ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 267 పేజీలు: 10+4 వెల: 6.50

మూడోసారి పోటీకి ఇష్టమే: ట్రంప్

భారత్, పాక్ సరిహద్దులు మళ్లీ ఉద్రిక్తం 5లో

## అల కల్లోలం



# ఎపిలో మొంథా టెర్రర్

**భారీగా ఆస్తి, పంట నష్టం**

**వణికిన తీరప్రాంత జనం..**

**అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకిన తుఫాన్**

**గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో ఈదురు గాలులు**

**చెట్టు కూలిపడి మహిళ మృతి**

**విజయవాడ, అక్టోబరు 28,ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళా ఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను తీరాన్నితాకింది. కాకినాడ మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీచినట్లు అంచనా. తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో భారీగా గాలులు వీస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు >>2




విశాఖలో కురిసిన భారీ వర్షాలకు ఓ ఇంటిపై కూలిన చెట్టు

# రాష్ట్రంలో హై అలర్ట్

## తుఫాన్ ప్రభావంతో 3 రోజులు భారీ వర్షాలు

- పలు జిల్లాలకు రెడ్ అలర్ట్, ఆరెంజ్ అలర్ట్ జారీ
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు28:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొథా ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు పడటం ప్రారంభిం చాయి. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఈ మూడు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరం లేకుండా బయటకు వెళ్లరాదని సూచిం చింది. 24 గంటల్లో మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫా బాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, మంచి ర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ



వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట,యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామా బాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గడిచిన 24గంటల్లో ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండతో పాటు పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో 6.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైం దని టిజిడిపిఎస్ చెప్పింది.వాతావరణ హెచ్చరికలు బుధవారం 9 గంటల వరకు కొనసాగుతాయని ఐఎండీ తెలిపింది. వర్షాల తీవ్రతను బట్టి,అవసరమైతే మరిన్ని జిల్లాలకుకూడా హెచ్చరికలు జారీ చేసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు పేర్కొ >>2

## సినీ కార్మికుల సంక్షేమానికి

# రూ.10 కోట్ల నిధి

- ప్రత్యేక పాఠశాలలో వారి పిల్లలకు 12వ తరగతిదాకా చదువు చెప్పిస్తా
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు కూడా..
- 20 శాతం కార్మికులకు ఇస్తేనే ఇక టిక్కెట్ ధరల పెంపు
- హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు రప్పిస్తా
- అభినందన సభలో సిఎం రేవంత్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే తెలంగాణ రైజింగ్ 2047లో చిత్ర పరిశ్రమకు ప్రత్యేకమైన స్థానం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సినీకార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగవారం యూసుఫ్‌గూడలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందన సభ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సినీ కార్మికులకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. తెలుగు సినీపరిశ్రమను మద్రాసు నుంచి హైదరా బాద్‌కు తీసుకొని రావడంలో మర్రి చెన్నారెడ్డి విశేష కృషి చేశారన్నారు. అన్న ఎన్టీఆర్, ఎఎన్నార్, కృష్ణ లాంటి వాళ్లను సంప్రదించి చిత్ర పరిశ్రమ తరలి రావడానికి ప్రోత్సహించారన్నారు. నాడు నటుడు డాక్టర్‌ప్రభాకర్‌రెడ్డి సినీ కార్మికుల >>2



మంగళవారం హైదరాబాద్‌లో సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో సిఎం రేవంత్. చిత్రంలో ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు, వల్లభనేని, విజయేంద్ర ప్రసాద్ తదితరులు



## 8వ వేతనసంఘం ఏర్పాటు

**50 లక్షల కేంద్ర ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి**

**18 నెలల్లో నివేదిక తయారు**

**రూ. 36,792 కోట్ల ఎరువుల సబ్సిడీ**

**కేబినెట్ కీలక నిర్ణయాలు**

**వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్**

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లకు మోడీసర్కార్ శుభవార్త చెప్పింది. లక్షలాదిమంది ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ కమిషన్‌కు జస్టిస్ రంజనప్రకాశ్ దేశాయ్ సారథ్యం వహించనుండగా ఐఐఎం బెంగ >>2

**తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లదాకా 80 టిఎంసిల**

# నీటి తరలింపు

**కాళేశ్వరం బ్యారేజీల రిపేర్లపై సిఎం రేవంత్ ఆదేశాలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు28:** తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టిఎంసిల నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేయాలని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. సుందిళ్లను రిపేరు చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తెచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయా లని అధికారులను ఆదేశించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లో తన నివాసంలో కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ లేఖపై సమీక్షలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చర్చించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖను పంపిన కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు సిఎం వివరించారు. ఏ విధంగా ముందుకెళ్లాలనేఅంశంపై అధికా రులకు సిఎం పలుసూచనలు చేశారు. >>2

## మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సుప్రీంలో ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు28:** వైద్య ఆరోగ్య శాఖలో 1200 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సుప్రీంకోర్టు ఊరట నిచ్చింది. వారిని ఉద్యోగాల్లో కొనసాగిం చాలని సుప్రీంకోర్టు ఆదేశాలలో పేర్కొంది. హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేస్తున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు ఇచ్చింది. 2013లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కారుణ్య నియామకాల కింద మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ఉద్యోగం పొందారు. ఆ నియామకాలను రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. హై కోర్టు తీర్పును సవాలు చేస్తు హెల్త్ అసిస్టెంట్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సుప్రీంకోర్టు వారిని కొనసాగించాలని తెలిపింది.

**బడా నేరస్తుని వదిలేసిన టాస్క్‌ఫోర్స్ ఎస్ఐపై వేటు** 3లో

# చంద్రన్న, ప్రకాష్ లొంగుబాటు

**మరో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు జనజీవన స్రవంతిలోకి**

**లొంగిపోయినవారిపై ఎలాంటి కేసులుండవు: డిజిపి**



లొంగిపోయిన మావోయిస్టు నేతలకు చెక్కులను అందజేస్తున్న డిజిపి శివధర్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** మావో యిస్టు పార్టీ నేతల లొంగు బాట్లు కొనసాగుతూనే వున్నాయి. ఇప్పటికే తెలంగాణతో పాటు చత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో మావోయిస్టుపార్టీ అగ్రనేతలు వందల సంఖ్యలోగల తమ క్యాడర్‌తో లొంగిపోగా తాజాగా మంగళవారం నాడు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆ పార్టీ ఐడియాలజి రూపకర్త పుల్లూరి ప్రసాద రావు అలియాస్ చంద్రన్నతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. కాగా ప్రభుత్వ పిలుపుకు స్పందించి లొంగిపోయే నక్సలైట్లపై ఎలాంటి కేసులుండవని డిజిపి శివధర్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. నక్సలైట్లను లొంగిపోయేలా చేసేందుకు పోలీసు శాఖ చేబట్టిన చర్యల్లో భాగంగా ఇద్దరు అగ్ర నేతలు మంగళవారం లొంగిపోయారు. పార్టీలో సీనియర్ నాయకుడుగా వుంటూ మావోయిస్టు పార్టీలో ఐడియాలజి రూపకర్తగా పేరొందిన కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న (64) 45 యేళ్ల అజ్ఞాత జీవితానికి స్వస్తి పలికాడు. శంకరన్న, సోమన్నగా కూడా ఆయనకు పేరుంది. పెద్దపల్లి జిల్లా జూలపల్లికి చెందిన చంద్రన్న ఇంటర్‌చదువుతున్న సమయంలో 1980లో నక్సలిజం వైపు ఆకర్షితుడయ్యాడు. మొదట్లో రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో ఆ తరువాత పీపుల్స్ వార్‌లో కీలక సభ్యుడుగా చేరాడు. అనంతరం ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్య విభాగంలో చేరాడు. ఈ సమయంలోనే అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిలుపై విడులయ్యాక 1981లో ఆదిలాబాద్ పీపుల్స్ వార్ దళంలో చేరాడు.

1983లో కమాండర్‌గా పదోన్నతి పొందిన చంద్రన్న 1987లో డిసిఎంగా మళ్లీ పదోన్నతి అందుకున్నాడు. 1995లో ఉత్తర తెలంగాణ జోనల్ కమిటీ దళంలో చేరాడు. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో చంద్రన్న తప్పించుకోగా కొందరు సభ్యులు చనిపోయారు. 2006లో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేబట్టాడు. 2007లో ఉత్తర తెలంగాణ >>2

# ఏరో ఇంజిన్‌కు రాజధానిగా తెలంగాణ

**ఇక్కడినుంచే ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలకు విడిభాగాలు**

**రూ. 425 కోట్ల పెట్టుబడి, 500 ఉద్యోగాలు**

**ఆదిభట్ల ఫెసిలిటీని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు28:** 2030 నాటికి తెలంగాణను దేశ ఏరోఇంజిన్ రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని అని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సంయుక్తంగా రూ.425 కోట్ల పెట్టుబడితో ఆదిభట్లలో ఏర్పాటుచేసిన ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్ న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని మంగళవారం హైటెక్ సిటీలోని ఐటిసి కోహినూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రారంభించారు. గ్లోబల్ ఏరోస్పేస్‌డిఫెన్స్ స్పేస్‌హబ్‌గా తెలంగాణను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను ఈసందర్భంగా ఆయన వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం సిటీ ఆఫ్ పెరల్స్ మాత్రమే కాదని, ప్రొపల్షన్, >>2



## ఎపికి 18 విమానాలు నిలిపివేత

**'మొంథా' ఎఫెక్ట్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు28:** మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో శంషాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిన 18 విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. వాతావరణం అనుకూలించని కారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్టణం, రాజమహేంద్రవరానికి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. విజయవాడ, విశాఖ, రాజమహేంద్రవరం నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 17 విమాన సర్వీసులను కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రద్దయిన వాటిలో విశాఖపట్టణం నుంచి 9, రాజమహేంద్రవరం నుంచి 5, విజయవాడ నుంచి 5 విమానాలు ఉన్నాయి. మొంథా తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో ఏపీ రాష్ట్రంలోనిఇ కోస్తా ప్రాంత జిల్లాలకు వెళ్లే పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. 107 రైళ్లను రద్దు చేసింది. బుధవారం,గురువారం కూడా రైళ్ల రద్దు ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. మంగళవారం 70, బుధవారం 36, గురువారం ఒక రైలును రద్దు చేసినట్లు వెల్లడించింది.



## 107 రైళ్ల రద్దు.. 10 దారి మళ్లింపు

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 28 ప్రభాతవార్త :** మొంథా తుఫాన్ నేపథ్యంలో 107 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది. కొన్ని రైళ్లను ఇప్పటికే దారి మళ్లించింది. మరికొన్ని రైళ్ల గమ్యం కుదించింది. ఎపి నుంచి హైదరాబాద్ వైపు వచ్చే పలు రైళ్లు రద్దుచేసినట్లు దక్షిణ మధ్యరైల్వే పేర్కొంది. సోమవారంతో పాటు రేపు, ఎల్లుండి బయలుదేరే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, రైళ్లు రద్దు చేశారు. అదేవిదంగా పార్సిల్ రైళును, మరో 10 రైళ్లను దారి మళ్లించారు. మరో 28 రైళ్లను రీషెడ్యూల్డ్ చేశారు. మరో రైలును రిస్టోరేషన్ చేయడంజరిగింది. తుఫాన్ తీవ్రతను బట్టి రైల్వే సర్వీసులను పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గోదావరి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్, విశాఖపట్నం.. తిరుపతి ఎక్స్‌ప్రెస్,చెన్నై సెంట్రల్ వీక్లి ఎక్స్‌ప్రెస్, ఎల్టిటీతో పాటు పలు ప్రధాన రైళ్లు, పలు పాసింజర్ రైళ్లు ఉన్నాయి. విశాఖ మీదుగా సాగే రెల్వే సర్వీసుల జాబితాను రైల్వే శాఖ ఇప్పటికే విడుదల చేసింది. స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు జిఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.




కాకినాడ తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు



కోనసీమ ప్రాంతంలో నీటమునిగిన కాలనీలు

# మొంథా టెర్రర్

>> జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 24 గంటల్లో తీరప్రాంతంలో 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**అంతర్వేదిపాలెంలో తీరం తాకిన మొంథా తుపాను**

మచిలీపట్నానికి 20 కి.మీ. దూరంలో, విశాఖకు 220 కి.మీ. దూరంలో తుపాను కేంద్రీకృతమైంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు సమీపంలో మొంథా తుఫాన్ తీరాన్ని తాకిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పూర్తిగా తీరాన్ని దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటలు సమయం పట్టే అవకాశం ఉందని వాతావరణ అధికార యంత్రాంగం పేర్కొంది. ఊహించినట్లు మంగళవారం రాత్రి పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు 10 జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే,ఏడు జిల్లాల్లో పంటనష్టంతో రహదారి వ్యవస్థ దెబ్బతింది. కాకినాడ- మచిలీపట్నం మధ్య మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. గడిచిన 12 గంటల్లో గంటకు 17 కి.మీ వేగంతో తుఫాన్ కదిలిందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి మచిలీపట్నానికి 120 కిమీ, కాకినాడకి 110 కిమీ, విశాఖపట్నానికి 220కిమీ దూరంలో కేంద్రీకృత మైందని తెలిపారు. పూర్తిగా తీరం దాటడానికి 3-4 గంటల సమయం పడుతోందన్నారు. ప్రజలు సురక్షితంగా ఇంట్లోనే ఉండాలన్నారు, కృష్ణా జిల్లాలోని గుడివాడలో తుఫాను ప్రభావంతో భారీ గాలులతో వలువొట్ల ప్రధాన రహదారుల్లో చెట్లు నేలకూలాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, గుడివాడ ముదినేపల్లి ప్రధాన రహదారిలో వృక్షాలు నేలకూలాయి. గుడివాడ విజయవాడ ప్రధాన రహదారిలో వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. హుటాహుటిన విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నా యి. విమ్ము చీకటిలో ఆధునిక యంత్ర సామాగ్రితో రోడ్లపై కూలిన చెట్లను బృందాలు తొలగిస్తు న్నాయి. ముదినేపల్లి ప్రధాన రహదారిలో కూలిన వృక్షాలను గుడివాడ రూరల్ పోలీసులు తొలగించారు. అధికార యంత్రాంగం మొత్తం సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో 222 పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించి వాటిలో అవసరమైన 177 కేంద్రాలను ప్రారం భించింది. లోతట్టు ప్రాంతాలు, పూరిళ్లు, తాటాకు పాకలు, మట్టి ఇల్లు, పాత బడిన ఇళ్లలో నివసిస్తున్న పేద ప్రజలను అధికారులు ఒప్పించి సమీపంలో ఉన్న సురక్షిత పునరావాస కేంద్రాలకు, తుఫాను షెల్టర్లకు తరలించింది. ఇప్పటివరకు మొత్తం 11317 మందిని పునరావాస కేంద్రాలకు చేరవేసింది. కేంద్రాలలో ప్రజలకు కావలసిన మంచినీరు, మూడు పూటలా మంచి ఆహారం, మరుగు దొడ్లు, కొవ్వొత్తులు మస్కిటో కాయిల్స్ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా ఉచితంగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరము, జలుబు, దగ్గు,వాంతులు, విరోచనాల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరిగింది.

కోహీరు మండలంలో రామకృష్ణాపురం, పెడన మండలంలో నందమూరు, చోడవరం, వల్లపల్లి మండలంలో చల్లపల్లి, వెలివోలు, లక్ష్మీపురం, కృత్తివెన్ను మండలంలో కృత్తివెన్ను, కోమలపూడి, చిన్న గొల్లపాలెం, గన్నవరం మండ లంలో సవారిగూడెం, గుడ్లవల్లేరు మండలంలో వడ్లమన్నాడు, ఘంటసాల మండలంలో కంచడం, దేవరకోట, అవనిగడ్డ మండలం వేకనూరు, ఎడ్లంక, పెడపాటుపూడి మండలంలో టిమిడింటా కూరు, గూడూరు మండలం ఆకులమ న్నాడు, రామానుజవార్లపల్లి, మల్లవోలు, బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామాలలో చెట్టుపడిపోగా వెంటనే పంచాయతీ సిబ్బంది స్పందించి రాకపోక లకు ఆటంకం లేకుండా వాటిని తొలగించారు. జిల్లాలో ప్రమాదాలను ప్రమా దాలు జరిగితే కాపాడేందుకు వీలుగా రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను జిల్లాకు రప్పించి మచిలీపట్నం గుడివాడ డివిజన్లలో ఉంచడం జరిగింది.

తుఫాను ప్రభావానికి జిల్లాలో 12 మండలాల్లోని 68 గ్రామాలు, 5 పట్టణ ఆవాసాల్లో 41,729 మంది ప్రజలు ప్రభావితం అవుతున్నారని, ఇప్పటి వరకూ 35,114 మందిని సురక్షిత ప్రదేశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, త్రాగునీరు, ఇతర కనీస వసతులు కల్పించామని తెలిపారు.

అగ్నిమాపక శాఖకు చెందిన 199 మంది సిబ్బంది, 42 ఫుడ్ కటింగ్ బృందాలు, 44 లైఫ్ జాకెట్లు, 44 లైఫ్ బోట్లు, ఇతర రక్షణ సామగ్రి సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. పోలీస్ ద్వారా 34 క్రేన్స్, 3 డ్రోన్స్, 121 అస్కాలైట్లు, 86 డ్రాగన్ లైట్లు, 395 రైన్ కోట్లు, 78 లైఫ్ జాకెట్లు, 20 మొబైల్ సెట్లు, 96 ట్రాక్టర్లు రంగంలో ఉంచారన్నారు. ప్రమాద కరమైన రూట్లలలో 44 ఆర్టీసీ బస్సులు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ౖళ్ల రాకపోకలపై ప్రధాన రైల్వేస్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వేశాఖ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసింది. విజయవాడ డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



మంగళవారం హైదరాబాద్‌లోని శంకరమఠంలో శృంగేరి శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న సిఎం రేవంత్‌రెడ్డి

# శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి ఆశీస్సులు తీసుకున్న సిఎం రేవంత్

**హైదరాబాద్, అక్టోబరు 28 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీశృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. మంగళవారం నల్లకుంటలోని శంకరమఠంలో శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ జగద్గురు విధుశేఖర భారతిస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి, స్వామివారి ఆశీస్సులు తీసుకొని అనుగ్రభాషణం పొందారు. ఈ సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై విధుశేఖర భారతీ స్వామికి సిఎం వివరించారు. పునరుద్ధరణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ భేటిలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతకు ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శంకరమఠంలో కొలువుతీరిన శ్రీశారదాంభ అమ్మవారిని, చంద్రశేఖరుడిని, వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ధర్మాధికారి సి.శ్రీనివాసమూర్తి ముఖ్యమంత్రిని స్వాగతం పలికారు.కాగా, శ్రీ విధుశేఖర భారతి స్వామిని, ఆలయంలో కొలువుతీరిన శ్రీశారదాంబను దర్శించుకునేందుకు నగరవ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు ఆలయం ఫంక్షన్‌హాల్ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# రూ.10 కోట్ల నిధి

>> కోసం మణికొండలో తన పది ఎకరాల సొంత స్థలాన్ని విరాళంగా అందజేశారన్నారు. చిత్రపురి కాలనీ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. సినీ కార్మికుల కష్టాన్ని ఆయన కొనియాడారు. రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడే కార్మికుల కష్టం తనకు ఎంతగానో తెలుసని, తన కళ్లు అధికారంతో ఏమి మూసుకుపోలేదన్నారు. సినీ పరిశ్రమకు ప్రత్యేకస్థానం ఉందని, ప్రభుత్వానికి, సినీ పరిశ్రమకు వారధిగా ఉండేందుకు ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా దిల్‌రాజును నియమించినట్లు తెలిపారు. రాష్ట్రం వచ్చిన తరువాత పదేళ్లుగా నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాగాయకుడు గద్దర్ పేరుతో అందిస్తూ కళాకారులను ప్రోత్స హిస్తున్నట్లు తెలిపారు. తెలుగు సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లడం వెనుక సినీ కార్మికుల కష్టం ఎప్పటికి మరువలేదన్నారు. హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలన్నదే తమ కోరికని స్పష్టం చేశారు. ఐటీ, ఫార్మా రంగాల తరహాలోనే సినీ పరిశ్రమకు ప్రత్యేక చాప్టర్ ఉందన్నారు. సినీ పరిశ్రమ అండగా ఉంటే హాలివుడ్‌ను ఇక్కడికి తీసుకొచ్చే బాధ్యత తనదని స్పషం చేశారు. కృష్ణనగర్‌లో స్థలం చూడాలని, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సినీ కార్మికుల పిల్లలకు పాఠశాల ఏర్పాటుచేసి చదువు చెప్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తామన్నారు. సినీ కార్మికుల సంక్షేమానికి రూ. 10 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటుచేస్తామన్నారు. అలాగే నిర్మాతలు సినిమా నుంచి వచ్చే ఆదాయంలో 20 శాతం వాటా ఇవ్వాలని, అలాగే ఇకపై సినిమా టిక్కెట్లపై ధరలు పెంచితే అందులో 20 శాతం సినీ కార్మికులకు ఇచ్చేలా జీవో ఇస్తామన్నారు. ఫ్యూచర్ సిటీలో సినీ ఇండస్ట్రీకి స్థలాలు కేటాయిస్తామని హామీల వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, సినీ కార్మిక చి.369 సంఘాల ప్రతినిధులు వల్లభనేని అనీల్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**చిత్రపురిపై ఆప్ ఆందోన**

చిత్రపురి కాలనీలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆప్ ఆధ్వర్యంలో కార్యక్రమ ప్రాంగణం ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డగించారు. అక్కడి నుంచి తరలించారు.

# చెట్టుకూలి కోనసీమలో మహిళ మృతి

**అమలాపురం, అక్టోబరు 28:** మొంథా తుపాను తీరంతాకే సమయంలో ప్రకృతి భీభత్సం సృష్టించింది. కోనసీమ జిల్లాలోని మాకనగూడెం గ్రామంలో చెట్టుకూలి ఒక మహిళ చెందినట్లు అధికారులు తెలిపారు. కోస్తాతీరంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ తుపాను భీభత్సా నికి ప్రజలు వణికిపోతున్నారు. మొత్తం 19 సహాయ శిబిరాల్లో 700 మందిని చేర్పించామని అధికారులు చెపుతున్నారు. 22 జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 3174 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసింది. 3778 మంది అధికారులను నియమించింది. ఒక్క కోనసీమ జిల్లాలోనే అత్యధికంగా 650 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసింది. 110 కిలోమీటర్ల వేగంతో వస్తున్న ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. అనేక చోట్ల విద్యుత్‌స్తంభాలు కూలి పోవడంతో సరఫరానున నిలిపివేసారు. విశాఖఎయిర్‌పోర్టునుంచి మొత్తం 32 విమానసర్వీసులు రద్దయ్యాయి.

# రాజధానిగా తెలంగాణ

>> ప్రెసిషన్, ప్రోగ్రెస్ నగరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023-24లో రూ.15,900 కోట్లు ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరిగాయన్నారు. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ హయాంలో ఈ రంగం సాధించిన వృద్ధి రేటుకు నిదర్శనమన్నారు. ఈ న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీలో ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలు లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్ (స్టేషనరీ కాంపోనెంట్),లోప్రెషర్ టర్బైన్ షాఫ్ట్ (రోటేటివ్ కాంపోనెంట్) తయారవుతాయ న్నారు. ఫలితంగా తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తమవ్వడంతో పాటు కొత్తగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విమాన ప్రయాణ భవిష్యత్తును నిర్మించాలనుకుంటే దానిని తెలంగాణలో నిర్మించండి అని ఈ వేదికగా అంతర్జాతీయ దిగ్గజ ఏరో సంస్థలకు పిలుపు నిచ్చారు. ఇంజిన్స్, కాంపోనెంట్స్, ఎమ్మార్వో, కన్వర్షన్స్, స్పేస్, డ్రోన్స్, డిజిటల్, ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఈవో, ఎండీ సుకరన్ సింగ్, ఈడీ మసూద్ హుస్సేన్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్స్ వైస్ ప్రెసిడెంట్ డొమినిక్ డూప్, టిజిఐఐసి ఎండి శశాంక, తెలంగాణ ఏరో స్పేస్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పిఎ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో హై అలర్ట్

>> న్నారు. రాష్ట్ర ప్రభుత్వం,విపత్తు నిర్వహణ శాఖ ఇప్పటికే అన్ని జిల్లాలకు అప్రమత్తత సూచనలు పంపింది. మెదక్ జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంవల్ల పలుకొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. కొంగోడు కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసి పోగా, నాయిని జలాల్‌పూర్, కొంగోడు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకు పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు టార్పాలిన్ కవర్లు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని రైస్ మిల్ యజమానులు ఎలాంటి తరుగు లేకుండా, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## వారం - వర్జ్యం

29-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
సప్తమి ఉ.9.21
ఉత్తరాషాఢ సాం.5.25
వర్జ్యం : రా.9.35-11.15
దు.ఉ.11.29-12.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** పెద్దల సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం:** బంధు, మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఉద్యోగయత్నాలు.

**మిథునం:**షేర్లు, భూముల క్రయవిక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** సంఘోద్ధరణకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు.

**సింహం:** కారణం లేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి.

**కన్య :** ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం.

**తుల :**స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రుత్తులు పాటించండి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడిందని గుర్తించి కొత్త వ్యూహాలను అనుసరిస్తారు.

**ధనుస్సు:** వృత్తి, ఉద్యోగాలలో ఏర్పడిన చికాకులను కుటుంబసభ్యులపై ప్రదర్శిస్తారు.

**మకరం:** సేవక బృందము యొక్క బాగోగులు పరిశీలించి వారికి సహాయం అందిస్తారు.

**కుంభం:** ప్రతి చిన్న పనికి శ్రమించి చివరకు పూర్తి చేస్తారు. ప్రయాణాలు.

**మీనం :** సంతానం విద్యా విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వాఫీజ్ సయీద్ సన్నిహితుడికి బంగ్లా రెడ్‌కార్పెట్!

**ఢాకా, అక్టోబరు 28:** ముంబై దాడుల సూత్ర ధారి, లష్కరే తోయిబా (ఎల్ఈటీ) వ్యవస్థాప కుడు హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితు డైన ఇబ్తిసామ్ ఎలాహి జహీర్ బంగ్లాదేశ్‌లో పర్యటించడం తీవ్ర కలకలం రేపుతోంది. భారత్‌తో ఆనుకుని ఉన్న సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుతూ, స్థానిక తీవ్రవాద గ్రూపులతో సమావేశమవుతూ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తుండటంపై భద్రతా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ఈశాన్య రాష్ట్రాల్లో అస్థిరత సృష్టించేందుకు జరుగుతున్న పెద్ద కుట్రలో ఇది భాగమని అనుమానాలు బలపడు తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన మర్కజీ జమియత్ అహ్లెహదీత్ ప్రధాన కార్యదర్శి అయిన జహీర్ ఈ నెల 25న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌కు రావడం ఇది రెండోసారి.

# అంగన్వాడీ నియామకాల ప్రక్రియ వేగవంతం

## సుప్రీంకోర్టు స్టేను తొలగించుకునేలా చట్టపరమైన చర్యలు ప్రారంభం

### లా సెక్రటరి, పిఆర్సీ ఛైర్మన్‌తో సమావేశమైన మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు28:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సమయంలో నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు సచివాలయంలో మంగళవారం నాడు లా సెక్రటరీ బీ. పాపిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్, పీఆర్సీ ఛైర్మన్ ఎన్. శివశంకర్‌లతో మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. అంగన్వాడీల నియామకాల్లో ఎదురవుతున్న న్యాయ చిక్కులపై చర్చించారు. న్యాయ చిక్కులను అధిగమించే దిశలో వారి సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. సమావేశంలో శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు. రాష్ట్రంలో సుమారు 14 వేల వరకు అంగన్వాడీ ఖాళీలుండగా, వాటి భర్తీపై గతంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్, హెల్పర్ పోస్టులను ఎస్టీలకు రిజర్వ్ చేసిన ప్రభుత్వం, చిన్నారులు తమ మాతృభాషలో నేర్చుకోవడం సులువవుతుందన్న ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ రిజర్వేషన్లు 50 శాతం మించిపోవడంతో, కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు స్టే విధించింది.ఈ నేపథ్యంలో స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా లా సెక్రటరీ పాపిరెడ్డికి మంత్రి సీతక్క సూచించారు. రిక్రూట్‌మెంట్, సర్వీస్ రూల్స్‌లో నిపుణుడైన ఎన్.శివశంకర్ సలహాలతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు.అయితే మంత్రి సీతక్క ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు..ఇప్పటికే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పర్యటించి అంగన్వాడీ రిక్రూట్‌మెంట్ విధానాన్ని అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు. ఆ రాష్ట్రాల్లో అంగన్వాడీ పోస్టులు ప్రభుత్వ సర్వీస్ కిందకు రాకపోవడం వలన సబార్డినేట్ సర్వీస్ రూల్స్ వర్తించవని, దీంతో రిజర్వేషన్లు 50 శాతం పరిమితి వర్తించదని అధికారులు వివరించారు.పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో అంగన్వాడీ పోస్టులు ఎస్టీలకే రిజర్వ్ చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

# చంద్రన్న, ప్రకాష్ లొంగుబాటు

>> జోనల్ కమిటీ కార్యదర్శిగా నియమించబడ్డాడు. 2008లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడుగా నియమించ బడ్డాడు. ఆయనతో పాటు మరికొందరు అదే సమయంలో కేంద్ర కమిటీ సభ్యులుగా నియమించబడ్డారు. దీంతో పాటు ఆయన ఉత్తర తెలంగాణ జోనల్ కమిటీ కార్యదర్శిగా కూడా 2015 వరకు కొనసాగారు. 2021లో రాష్ట్ర కమిటీ కార్యదర్శి హరిభూషన్ చనిపోయాక పార్టీ బాధ్యతలను చంద్రన్న చేబట్టి 2024 వరకు నిర్వహించాడు. కాగా 2024 డిసెంబర్‌లో జరిగిన పార్టీ రాష్ట్రస్థాయి సమావేశంలో చంద్రన్న తన బాధ్యతలను బడే చొక్కారావుకు అప్పగించి పార్టీకి దిశా నిర్దేశం చేయసాగాడు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడుగా 17 ఏళ్లకు పైగా చంద్రన్న పనిచేశాడు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో రావాలని ప్రభుత్వం ఇస్తున్న పిలుపుకు స్పందించి చంద్రన్న లొంగిపోయాడని డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు.

కాగా చంద్రన్నతో పాటు లొంగిపోయిన మరో నేత బండి ప్రకాష్ (55) అలియాస్ క్రాంతి. ఆదిలాబాద్ జిల్లా మందమర్రికి చెందిన క్రాంతి 1983లో ఏడవ తరగతి చదువుతున్న సమయంలో రాడికల్ యూత్ లీగ్‌లో చేరాడు. దీని తరువాత 1984లో పార్టీ సిర్పూర్ దళంలో చేరాడు. 1984లో కొత్తగూడెంలో సిపిఐ నాయకుడు అబ్రహం హత్యలో పాల్గొన్నాడు. దీని తరువాత ఈ కేసులో అరెస్టయ్యాడు. ఈ సమయంలోనే జైల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు నల్లా ఆదిరెడ్డి సహా పలువురు అగ్రనేతలను కలిశాడు. దీని తరువాత 1988 ఆగస్టులో ఆదిలాబాద్ సబ్ జైలునుంచి కొందరు నేతలతోపాటు క్రాంతి తప్పించుకున్నాడు. 1989లో పోలీసుల గాలింపుతో అజ్ఞాతంలో వెళ్లాడు. 1992లో మల్కాజిగిరిలో అరెస్టయ్యాడు. అబ్రహం హత్య కేసులో జీవిత ఖైదు పడడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. 2004లో ఆగస్టు 15వ తేదీన సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల కోసం సర్కారు జారీ చేసిన జిఒలో భాగంగా క్రాంతి విడుదలయ్యాడు. దీని తరువాత క్రాంతి మళ్లీ నక్సలిజంలో చేరి మావోయిస్టు పార్టీని బలోపేతంచేశాడు. 2004లో సర్కారుతో జరిగిన శాంతిచర్చల్లో పాల్గొన్నాడు. చర్చలు విఫలం అయ్యాక ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు బదిలీ అయ్యి అక్కడి నక్సలైట్లకు నాయకత్వం వహించాడు. 2008 నుంచి 2011 వరకు చెర్ల..శబరి ఏరియా కమిటీ ఇంఛార్జిగావున్నాడు. 2012లో రాష్ట్రకమిటీ సభ్యుడుగా పదోన్నతి పొందాడు. 2015లో సింగరేణి కోల్ బెల్ట్ కమిటీ బాధ్యతలు నిర్వహించిన సమయంలో అనారోగ్య కారణాలతో ఆ పదవినుంచి వైదొలిగాడు. కాగా మావోయిస్టులు లొంగిపోవాలని సర్కారు ఇచ్చిన పిలుపు మేరకు క్రాంతి లొంగిపోయినట్లు డిజిపి తెలిపారు. కాగా లొంగిపోయిన చంద్రన్నకు 25 లక్షల రూపాయలు, క్రాంతికి 20 లక్షల రూపాయల చెక్కులను డిజిపి వారికి అందజేశారు.

**ఈ యేడాది రాష్ట్రంలో 427 మంది నక్సలైట్లు లొంగిపోయారు: డిజిపి వెల్లడి**

కాగా మావోయిస్టు బావజాలానికి కాలం చెల్లిందని డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. నక్సలైట్లు ఆయుధాలు పట్టుకుని అడవుల్లో వుండడం కన్నా జనంలో వచ్చి ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వాములు కావడం మంచిదని ఆయన కోరారు. ఈ ఏడాది తెలంగాణలో ఇప్పటి వరకు 427 మంది నక్సలైట్లు లొంగిపోయారని, వీరిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, ఎనిమిది మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎనిమిది మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 35 మంది ఏరియా కమిటీ సభ్యులు వున్నారని ఆయన తెలిపారు. నక్సలైట్లు ఇంత భారీ సంఖ్యలో లొంగిపోవడం వెనుక పోలీసుల సమష్టి వ్యూహం, ప్రభుత్వ ప్రోత్సాహం వుందని ఆయన తెలిపారు. ఇది మావోయిస్టులపై పోలీసుల విజయంగా డిజిపి తెలిపారు. మావోయిస్టు పార్టీలో జాతీయ స్థాయిలో 64 మంది అజ్ఞాత కేడర్‌లో వున్న వారు తెలంగాణకు చెందిన వారు వుండగా, తొమ్మిది మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో ఐదుగురు తెలంగాణవారే వున్నారని డిజిపి తెలిపారు. మావోయిస్టులు జనంలోకి రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. లొంగిపోయిన వారికి రివార్డులు ఇవ్వడంతోపాటు సాధారణజీవితం గడిపేందుకు అవకాశం కల్పిస్తామని, వారిపై ఎలాంటి కేసులు వుండకుండా చూస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డిజి స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి సుమతి తదితరులు పాల్గొన్నారు.

# 80 టిఎంసిల నీటి తరలింపు

>> లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి, ప్రాజెక్టువారీగా అనాలసిస్ చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సమీక్షలో చర్చించిన సిఎం బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు సిఎం సూచించారు. ప్రాజెక్టులవారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా.. తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని సిఎం నిర్ణయించారు. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై సమీక్షలో చర్చించిన ముఖ్యమంత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీరు, తాగు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇందుకు పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లేందుకు అంచనాలను తయారు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర డ్యామ్ భద్రత మదింపునకు 2026 డిసెంబరు తుదిగడువు

## తెలంగాణలో 173 డ్యామ్స్‌గుర్తించిన కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ

### అక్టోబరు 17న సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి సిఆర్ పాటిల్ లేఖ

**హైదరాబాద్ అక్టోబరు 28,ప్రభాతవార్త:** సమగ్ర డ్యామ్ భద్రత మదింపును డిసెంబరు 2026లోగా చేపట్టి వాటి స్థితిగతులపై నివేదిక అందజేయాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీచేసింది. తెలంగాణలో మొత్తం 173 నీటిపారుదల ప్రాజెక్టులు, బ్యారేజిలు,రిజర్వాయర్లు డ్యామ్‌సేఫ్టీ చట్టం 2021 పరిధిలో ఉన్నాయి. డ్యామ్‌సేఫ్టీ చట్టం 2021 సెక్షన్ 38(1) అనుసరించి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఒక నిపుణుల కమిటిని ప్రతి డ్యామ్, బ్యారేజి, రిజర్వాయర్‌కు వాటి యాజమాన్యాలు అంటే రాష్ట్రప్రభుత్వాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని అందులో పేర్కొన్నారు. ప్రతి డ్యామ్‌కు సాంకేతిక నిపుణులను నియమించి ఆర్థిక వనరులుకూడాకల్పించి 15నెలలోగా మదింపు పూర్తిచేయాలని ఆపరేషన్ అండ్ మెంటనెన్స్ ఇతర అంశాలలో జవాబు దారితనం, డ్యామ్‌సేఫ్టీ గవర్నెన్స్ బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకోవాని కేంద్రజలశక్తిమంత్రిత్వశాఖ తెలంగాణ సిఎంని ఆదేశించింది. స్వతంత్ర ప్రతిపత్తికలిగిన సాంకేతిక నిపుణులను ఏర్పాటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటి సలహాలు కూడా తీసుకోవాలని సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి సిఆర్‌పాటిల్ లేఖ రాస్తూ ఆదేశాలు జారీచేశారు.

# 8వ వేతనసంఘం ఏర్పాటు

>> ఊరు ఆచార్యుడు పాలుక్ ఘోష్ తాత్కాలిక సభ్యుడిగా, పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ సభ్య కార్యదర్శిగా ఉంటారు. జస్టిస్ దేశాయ్ కమిషన్ 18నెలల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. 8వ వేతన సంఘం సిఫారుసులు జనవరి ఒకటి నుంచి అమలయ్యే అవకాశం ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది. ఈ కమిషన్ సిఫార్స్‌లతో 50లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69లక్షల మంది పింఛనుదారులకు ప్రయోజనం కలుగనుందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**ఎరువుల రాయితీకి ఆమోదం**

మరోవైపు రూ.37,952 కోట్ల ఎరువుల రాయితీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి ఫాస్ఫేట్ అండ్ పొటాషియం ఎరువులపై సబ్సిడీ రేట్లను నిర్ణయించే ప్రతిపాదనను కేంద్రం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఎరువుల రాయితీకి రూ.37,952 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఇది 2025 ఖరీఫ్ సీజన్ కంటే రూ.736 కోట్లు ఎక్కువ అని చెప్పారు. డై అమ్మోనియం ఫాస్ఫేట్, నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్, సల్ఫర్ వంటి ఎరువులపై ఆమోదించిన రేట్ల ప్రకారం సబ్సిడీలు అందించనున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు సబ్సిడీతో, సరసమైన ధరలకు ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.



మంగళవారం సోదరి భర్త అయిన తన్నీరు సత్యనారాయణ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సిఎం కెసిఆర్ తదితరులు

# మాజీ మంత్రి హరీశ్‌రావుకు పితృవియోగం

### మాజీ సిఎం కెసిఆర్‌సహా పలువురి నివాళులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 28, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి సత్యనారాయణ మంగళవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. సత్యనారాయణ మృతి పట్ల బిఆర్‌ఎస్ పార్టీ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. సత్యనారాయణ అంత్యక్రియలను జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించారు. పార్టీ అధినేత కెసిఆర్ తన బావ (ఏడో సోదరి, అక్క లక్ష్మి భర్త) సత్యనారాయణ మృతి పట్ల తీవ్రసంతాపం ప్రకటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బావతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సమాచారం తెలియగానే హరీశ్‌రావుకు ఫోన్‌చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తర్వాత సత్యనారాయణ పార్థివదేహం ఏర్పాటుచేసిన క్రిన్స్ విల్లాస్‌కు చేరుకొని నివాళులర్పించారు.

కెసిఆర్‌తోపాటు పార్టీ నేతలు కెటిఆర్, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంతత్‌రెడ్డి, పద్మారావు, సంతోష్‌రావు, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, జగదీశ్‌రెడ్డి తదితరులు పార్థివదేహానికి నివాళు లర్పించి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు.

మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తదితరులు వచ్చి సత్యనారాయణ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో భాగంగా కెటిఆర్, పాడి కౌశిక్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాడె మోయగా మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య డప్పు దరవు వేస్తూ ముందుకు కదిలారు. కుటుంబసభ్యుల మధ్య కన్నీటి వీడ్కోలుతో సత్యనారాయణ అంత్యక్రియలను మహాప్రస్థానంలో పూర్తి చేశారు.

### పలువురు ప్రముఖుల సంతాపం

సత్యనారాయణ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎక్స్ ఖాతా వేదికగా హరీశ్‌రావుకు సానుభూతిని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి హరీశ్‌రావుకు ఫోన్‌చేసి మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్, కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో సానుభూతిని ప్రకటించారు.

### హరీశ్‌రావు తండ్రి మరణానికి

### పలువురు మంత్రులు, రాజకీయ నేతల సంతాపం

**హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి పట్ల పలువురు మంత్రులు, వివిధ పార్టీల నేతలు తమ సంతాపం ప్రకటించారు. కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు. ఎపి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హరీశ్‌రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. హరీశ్‌రావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో పవన్ కల్యాణ్ తెలిపారు.

#### మంత్రులు అడ్లూరి, దామోదర రాజనర్సింహ సంతాపం..

హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి మంత్రి దామోదర రాజనర్సింహ సంతాపం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిన్ని ప్రార్థించారు. హరీశ్‌రావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంతాపం తెలిపారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

#### సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శుల సంతాపం..

హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మరణం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపాన్ని తెలియ జేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

#### హరీశ్‌రావుకు సానుభూతి తెలిపిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

సిద్ధిపేట శాసన సభ్యుడు, మాజీ మంత్రి, హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి తనకు తీవ్రంగా బాధ కలిగించిందని, ఆయన కుటుంబానికి పూడ్చు కోని నష్టం జరిగిందని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి తన సానుభూతిని తెలిపారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు.


BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD
O.A. No. 76 OF 2021
IN
I.A. NO. 1651 OF 2025

ICICI BANK LIMITED ...Applicant
AND
M/S. VENKAT REDDY LOGISTICS PVT. LTD., ...Defendants

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
R1. M/s. VENKAT REDDY LOGISTICS PVT. LTD. (Borrower) Rep by its Managing Director, Sridhar Reddy Jangam Reddy, Office at: Flat No. 102, First Floor, JBS Towers, Plot No. 11 and 12, Bachupally, Hyderabad- 500 049.
R2. M/s. J.V. LOGISTICS (Co-Borrower), Rep by J. Sridhar Reddy, Office at: Plot No. 11 12 32, Bachupally, Opp: Volvo Service Center, Hyderabad - 500 090, TS.
R5. J. SRIDHAR REDDDY, S/o J. Venkat Reddy Aged About 48 years, Occ: Business, R/o H.No. 28/76, Shivalayam Street, Miryalguda, Nalgonda District, TS.
R6. SRIDHAR REDDY JANGAMREDDY (Guarantor) S/o Venkat Reddy, Aged: 48 Years, Occ: Business, R/o. Plot No. 102, First Floor, JBS Towers, Plot No. 11 & 12, Bachupally, Hyderabad- 500 049, TS ...Respondents/Defendants

Please take the summons in the above O.A. No. 76 of 2021 filed by the Applicant for Recovery of money Rs. 8,59,61,621.60Ps/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VARTHA" a Telugu Daily newspaper, and posted the matter on 15.12.2025.
In accordance with sub- section (4) of section 19 of the Act, you the defendants are directed as under:
(i) To show cause within Thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial No. 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be To account for the sale proceeds realized by the sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 15-12-2025 10:30 A.M. at Debts Recovery Tribunal- II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take Notice that in case of default the application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this the 10th day of October, 2025.
(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad


# తేమ నిబంధన సడలించి పత్తి రైతుల కష్టాలు తీర్చండి

### అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయారు

### పత్తి మద్దతు ధర పెంచి తెలంగాణ రైతన్నను ఆదుకోండి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ పత్తి రైతుల సమస్యలు, తేమ శాతం సడలింపు, కనీస మద్దతు ధర పెంపుదల ఆర్ అండ్ బి సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మంగళవారం ముంబైలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లలిత్‌కుమార్ గుప్తాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై లలితకుమార్‌తో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య గంటపాటు సమావేశంలో చర్చించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పత్తి సేకరణ, రైతులకు తక్షణ ఉపశమనం అందించాల్సిన అవసరాన్ని మంత్రి సిసిఐ చైర్మన్‌కు వివరించారు. తేమ శాతం తప్పనిసరి సడలించాలని ప్రస్తుతం సుదీర్ఘ నైరుతీ వానా కాలం, తుఫాను కారణంగా వాతావరణంలో వర్షంతో పాటు తేమ పెరగడంతో అన్ని వ్యవసాయ ఉత్పత్తుల్లో గరిష్ఠంగా 23శాతం తేమ ఉంటున్నదని తెలిపారు. పత్తికి కూడా తేమ పెరిగిందని అన్నారు. తెలంగాణసహా దక్షిణ భారత రాష్ట్రాలలో అధికతేమ స్థాయిలు ఉన్న కారణంగా, ప్రస్తుత సగటు నాణ్యత ప్రమాణాలు నిబంధనల ప్రకారం నిర్దేశించిన 8 -12 శాతం తేమ ఎఫ్‌ఏక్యూ పాటించడం అసాధ్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, తుఫాను వల్ల పంటలు దెబ్బతిన్నాయి. అందుకే, రైతులకు నష్టం జరగ కుండా ఉండేందుకు తేమ శాతాన్ని తక్షణమే 14శాతం వరకు సడలించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కనీస మద్దతు ధర కూడా వ్యవసాయ సాగు పెట్టుబడులకు అనుగుణంగా సవరించాలని ఆయన కోరారు. అలాగే అన్ని పత్తి పండించే జిల్లాల్లో సిసిఐ కొనుగోలు కేంద్రాలను విస్తరించి, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుండి రైతులను కాపాడాలని మంత్రి సూచించారు. 'గులాబీ తెగులుసోకి, అకాలవర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రత్యేక ఉపశమన ప్యాకేజీ అందించాలని పసుపురంగు వచ్చిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని కోరారు. గత సీజన్లలో సేకరించిన పత్తికి సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ స్థాయిలో ఆధునిక తేమ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. తెలంగాణ రైతులకు న్యాయం జరిగి, వస్త్ర సరఫరా గొలుసు బలోపేతమ య్యేలా సిసిఐ చైర్మన్ వ్యక్తిగత శ్రద్ధ వహించాలి' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సానుకూలంగా పరిష్క రిస్తామని సిసిఐ చైర్మన్ లలిత్‌కుమార్ గుప్తా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హామీ ఇచ్చారు. మంత్రి వెంట జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా ఉన్నారు.



మంగళవారం ముంబైలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లలిత్‌కుమార్ గుప్తాకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

# హైకోర్టులో గంజాయి లేడీ డాన్ అంగూర్‌బాయ్‌కి చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 28:** దూల్‌పేట్ నుంచి హైదరాబాద్‌లో గంజాయి వ్యాపారాలు కొనసాగించే లేడీడాన్ అరుణ్ బాయ్ అలియాస్ అంగూర్‌బాయ్‌కి హైకోర్టులో చుక్కెదురైంది. పిడి యాక్ట్‌పై ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ ధర్మాసనం మంగళవారం కొట్టివేసింది. అంగూర్ భాయ్‌పై పోలీసులు పిడి యాక్ట్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై పెట్టిన పిడి యాక్ట్‌ను సవాలు చేస్తూ అంగూర్ భాయ్ హైకోర్టును ఆశ్రయించింది. పిడి యాక్ట్ పై హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంజ్ న్యాయమూర్తులు జస్టిస్ మోసమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్‌లు విచారించారు. వాదనలు విన్న అనంతరం అంగూర్ భాయ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించారు. అంగూర్ భాయ్ పై పిడి యాక్ట్ కొనసాగించాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఒరిలా, అసిస్టెంట్ న్యాయవాది రవి కుమార్‌లు వాదనలు వినిపించారు. గంజాయి లేడీ డాన్ అంగూర్ భాయ్ పై ఎక్సైజ్ శాఖ ఎస్టిఎఫ్ ఏటీం లీడర్ అంజిరెడ్డి, దూల్‌పేట ఎక్సైజ్ సిఐ మధుబాబులు అంగూర్ భాయ్ పై అనేక కేసులు ఉండడంతో పిడి యాక్ట్ పెట్టాలని ప్రతిపాదించారు. అంగూర్ భాయ్ పై పిడి యాక్ట్ పెట్టాలని ప్రభుత్వం నియమించిన అడ్వైజరీ బోర్డు 2025 మార్చి 10న ప్రతిపాదనలకు పంపించారు. బోర్డు సిఫారసు మేరకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురి శెట్టి 2025 ఏప్రిల్ 15న అంగూర్ భాయ్ పై పిడి యాక్ట్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పిడి యాక్ట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అంగూర్ భాయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంగూర్ భాయ్ పై పిడి యాక్ట్ పిటిషన్ హైకోర్టులో కొట్టివేయడం పట్ల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఎక్సైజ్ సిబ్బందిని అభినందించారు.

# రాజేంద్రనగర్‌లో యువతి ఆత్మహత్య

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 28, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు వివరాల ప్రకారం...జమూమ్మకు చెందిన జాహ్నవి ఇండిగో విమానయన సంస్థలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో క్యాబిన్ క్రూగా ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తుంది. సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి పార్టీకి హాజరైంది. అనంతరం తన గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని రోజులగా జాహ్నవి గుప్తా డిప్రెషన్‌లో ఉన్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. పలుమార్లు పోలీసులు కుటుంబ సభ్యులను ఆత్మహత్య గల కారణాలు అడిగిన సమాధానం చెప్పలేదని తెలిసింది. ఈ ఘటనపై రాజేంద్ర నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# త్వరలో బిసి రథయాత్ర: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు సాధనకై త్వరలో బీసీ రథయాత్ర పెడతామని బిసి జెఎసి చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. మంగళవారం బిసి భవన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కలిసిన బీసీ నాయకులతో రిజర్వేషన్ల ఉద్యమంపై సమీక్షించారు. ఈ సమావేశంలో బిసి రథయాత్ర జరపాలని నిర్ణయించారు. త్వరలో బిసి జెఎసి నేతలతో సమగ్రంగా చర్చించి రిజర్వేషన్ల సాధన దిశగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను సమీకరించే లక్ష్యంతో త్వరలో రథయాత్ర జరుపుతామని పేర్కొన్నారు. ఈనెల 18న జరిగిన రాష్ట్ర బంద్ చారిత్రాత్మకంగా జరిగిందన్నారు. బంద్ ప్రభావంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందిస్తాయని రాజ్యాంగ సవరణ చేస్తారనే కృష్ణయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. దీక్షలు ధర్నాలు గ్రామ స్థాయి నుంచి జరగాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు సాధనకై దీక్షలు ధర్నాలు జరపాలని పిలుపునిచ్చారు. అన్ని పట్టణ, మండల కేంద్రాలలో దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉద్యమాన్ని ఉధృతం చేయాలనీ కృష్ణయ్య పిలుపునిచ్చారు


తెలంగాణ ప్రభుత్వం
బోడుప్పల్ నగరపాలక సంస్థ:: మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా
ఆసక్తి వ్యక్తీకరణ (EOI) పత్రికా ప్రకటన
తేది : 27.10.2025
బోడుప్పల్ నగరపాలక సంస్థ నందు సానిటేషన్ వసతుల నిమిత్తం కొనుగోలు చేసిన తొట్టితో కూడిన ట్రాక్టర్, ట్యాంకర్ కూడిన ట్రాక్టర్‌ల యొక్క ఒక సంవత్సర పరిమితికి ఇన్సురెన్స్ & పర్మనెంట్ రిజిస్ట్రేషన్ మరియు & 4 వీలర్ ఆటో టిప్పర్‌ల కొరకు ఒక సంవత్సర పరిమితికి ఇన్సురెన్స్ చేయించుటకు ఆసక్తిగల కన్సల్టెంట్ల నుండి సీల్ టెండర్లని ఆసక్తి వ్యక్తీకరణకై (EOI) దరఖాస్తులు స్వీకరించబడును. షెడ్యూల్ పొందుటకు & సీల్ కవర్‌లో సమర్పించుటకు ఆఖరు తేది : 03.11.2025న మ.12.00గం. వరకు బోడుప్పల్ నగరపాలక సంస్థ కార్యాలయము నందు సమర్పించవలెను. షెడ్యూల్ పొందుటకు కమిషనర్, బోడుప్పల్ నగరపాలక సంస్థ పేరిట రూ.1000/- (Non-Refundable) ల డిడిని కార్యాలయము నందు సమర్పించి పొందగలరు.
సం/-. కమిషనర్, బోడుప్పల్ నగరపాలక సంస్థ.
DIPR.NO. 9817-PP/CL/ADVT/1/2025-26 తేది: 28.10.2025


## క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ పూర్తి చేసిన ప్రభుత్వం

# ఢిల్లీలో కృత్రిమ వర్షం

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశ రాజధాని ఢిల్లీని తీవ్ర వాయుకాలుష్యం వేధిస్తోంది. దీపావళి అనంతరం పరిస్థితులు మరింత దిగజారాయి. మంగళవారం ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 306గా నమోదు అయినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. ఇది తీవ్రమైన కాలుష్య కేటగిరిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు స్థానికంగా కృత్రిమ వర్షం కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసింది. ఐఐటి కాన్పూర్ నుంచి బయల్దేరిన ఎయిర్ క్రాఫ్ట్ సిల్వర్ అయోడైడ్, పొటాసియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను వివిధ ప్రాంతాల్లోని మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో మరికొన్ని గంటల్లో వర్షం పడే అవకాశం ఉంది. నగరంలో అయిదు క్లౌడ్ సీడింగ్ ట్రయల్స్ నిర్వహించడానికి ఢిల్లీ ప్రభుత్వం సెప్టెంబర్ 25న ఐఐటి కాన్పూర్‌తో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం అక్టోబర్ 1 నవంబర్ 30 మధ్య ఎప్పుడైనా ట్రయల్స్ నిర్వహించడానికి పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను నిర్వహించడానికి కావాల్సిన రూ.3.21 కోట్ల బడ్జెట్‌ను ఢిల్లీ మంత్రివర్గం మేలో ఆమోదించింది. అయితే ప్రతికూల వాతావరణం, రుతుపవన పరిస్థితుల కారణంగా ఈ ప్రక్రియ పలుమార్లు వాయిదా పడింది. తొలుత శాస్త్రవేత్తలు కృత్రిమ వర్షానికి అనువైన మేఘాలను గుర్తిస్తారు. వాటిలో సరిపడా తేమ ఉంటుంది. కానీ, వర్షించేందుకు అనువైన పరిస్థితులు ఉండవు. అలాంటి సందర్భంలో సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఇవి మేఘాల్లోని తేమను కరిగించి, వర్షపు బిందువుల రూపంలో కింద పడేందుకు సహకరిస్తాయి. కొన్నిసార్లు పొడి మంచును కూడా వినియోగిస్తారు. దీనివల్ల మేఘాలు చల్లబడి వర్షం కురిసేందుకు వీలుంటుంది.




తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 28.10.2025
భారత ఎన్నికల సంఘంచే కేరళ రాష్ట్రం గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా ఉండి నిచ్చెన గుర్తు రిజర్వ్ కాబడిఉన్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (పార్టీ పేరు)ని రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి అదే నిచ్చెన గుర్తుతో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఆ పార్టీ అధ్యక్షుడు శ్రీ కే.ఎం.ఖాదర్ మోహిఉద్దీన్ నేషనల్ ప్రెసిడెంట్ గారు అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వబడినది. ఈ పార్టీలో (1) శ్రీ: మహమ్మద్ షకీల్ స్టేట్ ప్రెసిడెంట్ గారు. (2) శ్రీ: షేక్ ముజాహిద్ స్టేట్ జనరల్ సెక్రటరీ. (3) శ్రీ: సయ్యద్ మసూద్ అలీ స్టేట్ జనరల్ సెక్రటరీ గారు. (4) శ్రీ: మహమ్మద్ అన్వర్ మోహియుద్దీన్ జనరల్ సెక్రటరీ. (5) శ్రీ: షేక్ చాంద్ పాషా జనరల్ సెక్రటరీ. (6) శ్రీ: అహ్మద్ బిన్ అలీ అల్ కాసెరి కోశాధికారి గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు పార్టీ కేంద్ర కార్యాలయం: క్వాయిద్ ఎ మిల్లత్ మంజిల్, నెం.36, మరైకాయర్, లెబ్బై స్ట్రీట్ చెన్నై - 600001, తమిళనాడు మరియు పార్టీ రాష్ట్ర కార్యాలయం: 2-2-34/1/B, ఎదురుగా విశాల్ మెగామార్ట్ ఎదురుగా, అంబర్‌పేట్, రామంతపూర్‌రోడ్, హైదరాబాద్-500013 తెలంగాణ స్టేట్: సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, టీటీసీ భవనము, ఏసీ గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజులలోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలేమీ రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పౌరుల ప్రాతినిధ్యం [illegible] స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (పార్టీ పేరు)ను ఒక రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేయుచూ నిచ్చెన గుర్తును ఆ పార్టీకి కేటాయిస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతుంది.
సం/-. కే.ఎం.ఖాదర్ మోహిఉద్దీన్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (పార్టీ పేరు).


# బడా నేరస్తుని వదిలేసిన టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐపై వేటు

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అనేకచోట్ల అమాయకులను నిండా ముంచిన బడా ఆర్థిక నేరగాడి నుంచి రెండు కోట్ల రూ పాయల లంచం తీసుకుని వదిలేసినందుకు నగర టాస్క్‌ఫోర్స్‌కు చెందిన ఓ యువ ఎస్‌ఐని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ముంబయి కేంద్రంగా గోల్‌మాల్ నడుపుతున్న ఈ ఆర్థిక నేరగాడిపై మూడు వేల కోట్ల రూపాయలకు పైగా మోసాలు చేసినట్లు అభియోగాలు వున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి నవి కూడా వున్నాయి. ఈ కేసుల్లో అనేకం హైదరాబాద్‌లోనూ వుండడంతో అతన్ని పట్టుకునేందుకు సిటీ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన ఓ ప్రత్యేక బృందం ఇటీవలే ముంబయికి వెళ్లింది. పక్కా సమాచారంతో ఆ నేగాడిని ముంబయిలో పట్టుకుని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసు బృందంలోని ఓ ఎస్‌ఐ సదరు ఆర్థిక నేరగాడితో బేరం మాట్లాడి తనకు రెండు కోట్ల రూపాయలు ఇస్తే వదిలేస్తానని చెప్పాడు. ఇందుకు ఆ నేరగాడు సరేనని తన వారిచేత ముంబయి.. హైదరాబాద్ మార్గంలో ఒక హోటల్ వద్ద ఈ డబ్బులు తెప్పించి ఎస్‌ఐకి ఇచ్చాడు. దీని తరువాత సదరు ఎస్‌ఐ ఆ నేరగాడిని తన కారు నుంచి వదిలేసి, వెనకాలే కొద్ది దూరంలో మరో రెండు వాహనాల్లో వస్తున్న సహచర పోలీసులకు ఫోన్ చేసి ఆర్థిక నేరగాడు తప్పించుకున్నాడని చెప్పాడు. అయితే ఈ ఎస్‌ఐ మాటలపై అనుమానం చెందిన ఇతర సిబ్బంది వెంటనే దీనిపై సిటీ పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీని తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు ఎస్‌ఐను విచారించగా రెండు కోట్ల రూపాయల డీల్ వెలుగు చూసింది. అనంతరం అతని వద్ద నుంచి నగదును రికవరీ చేసి సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై మాట్లాడేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు నిరాకరించారు. దీనిపై ఒకటి 2 రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే వీలుంది.


BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-I
TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD.
I. A. NO. OF 2024
IN
R.C. NO.363 OF 2017
IN
O. A. NO.740 OF 2013
Between:
Punjab National Bank (Erstwhile United Bank of India), Koti, Hyderabad.
... Petitioner Bank/ Certificate Holder/ Applicant Bank
And
M/s. Sanghi Filaments P. Ltd. & Others
... Respondents/ Certificate Debtors/ Defendants
To,
2) Mr. Gireesh Kumar Sanghi, 4-3-352, Bank Street, Hyderabad-95.
3) Mr. Ravi Sanghi, 4-3-352, Bank Street, Hyderabad-95.
4) Mr. Sudhir Sanghi, 4-3-352, Bank Street, Hyderabad-95.
5) M/s. Sanghi Zip Fasteners P. Ltd., Rep. by its Managing Director, 4-3-352, Bank Street, Hyderabad-95.
Whereas the Punjab National Bank has filed a Petition in IA No.163 of 2025 in R.P.No.363 of 2017 before the Hon'ble DRT-I for transfer of shares attached by the Hon'ble Tribunal vide Order dated 29-08-2024 from the Demat Account of the CD No.2 and credit the same in the account of the CH Bank.
The Hon'ble Tribunal directed substitute service since you were not available in the above address.
Take notice that the above matter is posted on 13-11-2025 before the Hon'ble DRT-I, Hyderabad at 10.30 am for your appearance. If you fail to appear on that day either in person or through an advocate, the matter will be decided in your absence.
(BY ORDER OF THE TRIBUNAL)
Sd/- Mrs. Kalpana Ekbote, Advocate
Counsel for the Applicant
Flat No. 201, 11-6-856+859, Arun Doyen Apartments, Red Hills, Hyderabad – 500 004 - : (Off) 040-23396266


# రాజకీయ ఉద్దేశంతో ఇసి నిర్ణయాలు

### 12 రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్ అమలు నిర్ణయం సరైంది కాదు

### సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** జాతీయ ఎన్నికల కమిషన్ (ఇసిఐ) రాజకీయ ఉద్దేశంతో నిర్ణయాలు తీసుకుంటోందని, 12 రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్‌ను అమలు చేయాలని నిర్ణయించడం సరైంది కాదని సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్ విమర్శించారు. ఎస్‌ఐఆర్‌పై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందనీ, ఇంకా తుదితీర్పును వెల్లడించలేదని గుర్తు చేశారు. ఇసి స్వతంత్రంగా వ్యవహరించాలనీ, ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23 నుంచి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైన సిపిఎం అఖిల భారతస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ప్రకాశ్‌కరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడంతో పాటు రాజకీయంగా, సైద్ధాంతికంగా బలోపేతం కావాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. 12 రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్ నిర్వహించాలని ఇసి ప్రకటించిందని, రెండు నెలల క్రితం ఎస్‌ఐఆర్‌ను బీహార్‌లో నిర్వహించిందని గుర్తుచేసిన ప్రకాశ్‌కరత్.. లౌకిక, ప్రతిపక్ష పార్టీలన్నీ ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయన్నారు. ఇసి తీరుపై అనుమానాలు వస్తున్నాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు సిద్ధాంత, రాజకీయ అవగాహనను పెంచడం కోసమే ఈ శిక్షణ తరగతులను నిర్వహించామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు చెప్పారు. రాబోయే కాలంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు తమ పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయి లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విద్యార్థి సంఘాల రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు.




మంగళవారం హైదరాబాద్‌లో రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్


DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT II)
1st Floor, Triveni Complex Abids, Hyderabad-500001
O.A. No. 623 OF 2025
Bank of Maharashtra ...Applicant
And
M/s. Niyathi Agencies And Others ...Defendant(s)
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To
1) M/s. Niyathi Agencies Prop:Mrs. Sridevi Nemani, 12-5-130 Mumbai Highway Road, Mumbai Highway Road Moosapet, Moosapet, Moosapet Hyderabad, Telangana-500018. TG (Borrower)
2) Mrs. Sridevi Nemani, W/o. Veera Venkata Nageshwara Dileep Gorapalli, Age:42 years, Occ: Business, Flat No.1702, Manjeera Majestic Homes, KPHB, 3rd Phase, Hyderabad-500085.TG (Proprietor)
3) Mr. Boda Harsha Vardsha Anil Reddy, Occ: Business, Flat No.103, S S Castle, Manovikas Nagar, Near Pallavi Model School, New Bowenpally, Secunderabad, Hyderabad-500009 (Guarantor)
....Defendants
Please take the summons in the above O.A.No. 623 OF 2025 filed by the Applicant for Recovery of money of Rs.2,93,17,663 Ps/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VARTHA TELANGANA" Telugu Daily, newspaper and posted the matter to 17.11.2025
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application.;.
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;.
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 17.11.2025 at 10.30 am at Debts Recovery Tribunal-II, 1st floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the Application will be heard and determined in your absence 10th Day of October-2025
(By order of the Court)
Sd/- Asst Registrar
Debts Recovery Tribunal Hyderabad (DRT II)


వార్త

మంచి మాటయే గొప్ప అలంకారం. ఆభరణాలన్నీ నశిస్తాయి కాని, వాక్కు అనే ఆభరణం ఎన్నటికీ నశించదు.

-భర్తృహరి

# రసకందాయంలో రాజకీయం!

దేశమంతటా బీహార్ శాసనసభ ఎన్నికల గురించే పెద్ద చర్చ జరుగుతోంది. రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయనే చెప్పాలి. విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచారం వేడెక్కింది. ఈ మధ్యనే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార సభలో ఆర్‌జెడి పరిపాలన గురించి చెణుకులు విసరడంతో ప్రచారం వేడెక్కినట్లేవుంది. అలనాటి అవినీతి గురించి వందేళ్లయినా చర్చించుకుంటారని ప్రధాని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల బీహారుకు ఒరిగిందేమీ లేదని ఇండియా బ్లాక్ మహా ఘట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్ జెడి నేత తేజస్వీ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఈ కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం మాత్రం కుదరకపోవడం చెప్పుకోదగిన అంశం. అయినా కూటమి భాగస్వాముల మధ్య ఏదో తెలియని శంక వెన్నాడుతూనేవుంది. అక్కడ పోటీ చేస్తున్న సీట్లను బట్టి ఎవరి పరువు వారు కాపాడుకొని ఎక్కువ స్థానాల్లో తమ అభ్యర్థుల్ని గెలిచి తీసుకురావడం తప్ప వేరే ప్రత్యామ్నయమూ కనపడదు కొన్ని చోట్ల పరస్పర పోటీలో ఉండడం వారికి వ్యతిరేకఅంశం. దీనికితోడు ప్రచార పోస్టర్లలో రాహుల్ బొమ్మ లేకుండా ఆర్జెడి ముందుకు వెళ్తుండడం కాంగ్రెస్ శ్రేణులకు రుచించడం లేదు. సహజంగానే ఇలాంటి అంశాలను ఎన్డీఎ కూటమి తమకు అనుకూల ప్రచార అస్త్రాలుగా చేసుకుంటోంది. ఎత్తిచూపుతోంది. ఆర్‌జెడి కాంగ్రెస్‌ల మధ్య పొత్తు లేదనేందుకు ఇదే ఉదాహరణంటూ ఓటర్ల ముందుకు ఎన్డీఏ తెస్తోంది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పాత్ర ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది ఎన్నికల ఫలితాల నాడు కానీ తెలియదు. బీహార్‌లో పాలనపై కన్నేసి నితీష్ కుమార్ చెంతన చేరడం విభేదించి బయటకువచ్చి జన సురాజ్‌పార్టీ పెట్టడం, ఆపై జనంలోకి బాగా చొచ్చుకెళ్లిన ప్రశాంత కిషోర్ ఎలాంటి వ్యూహాలు లేకుండా ఎన్నికల గోదాలోకి దిగి వుంటారని ఎవరూఅనుకోలేరు. ఎంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారెండు ప్రధాన కూటములను నిలవరించి ముందుకు రాగలరని ఎవరూ అనుకోవడం లేదు. రావడం కష్టమే. అలాగని హంగ్ ఏర్పడుతుందని ఎక్కడా చెప్పడం లేదు. ఏదో ఆశయం ఉండబట్టే దింపుడు కళ్లాల ఆశతో ప్రశాంతంగా తన పనేదో తాను చేసుకుపోతున్నారు. బీహార్లో ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ ఎత్తుగడ ద్వారా ఎన్నికల కమిషన్ ఏదో చేస్తోందనే అనుమానాలు రేకెత్తించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాన్ని ముందుగానే చేసుకోగలిగింది. బీహార్ ప్రజల నోళ్ళల్లో ఆ అంశానికి సంబంధించిన విషయాలు బాగా నానాయి. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ పాలనతో జనం విసుగెత్తి ఉన్నారన్న ప్రకంపనలు కూడా ఉన్నాయి. పదవే లక్ష్యంగా కూటములు ఫిరాయించారని ఆయనపై ఆరోపణలున్నాయి. స్వచ్ఛమైన నేతగా పేరుండి చివరకు పదవి కోసంఅవకాశ వాద రాజకీయాలకు పాల్పడినట్లు జనాభిప్రాయం. 2020అక్టోబరు నవంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా ఘట్ బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్డీఎ తీర్థం పుచ్చుకొని మరోసారి తన పదవి కాపాడుకున్నారు. ఇలా ఆయన నిలకడలేని రాజకీయాలకు ఆరితేరారని ప్రత్యర్థి పార్టీలు భారీ ప్రచారం చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రశాంత్ కిషోర్ తన ర్యాలీలో ఇదే ప్రచారంతో ప్రజల్లోకి వెళ్లి చేసినప్రచారం జనం స్మృతిపథంలో మెదులుతూనేఉంది. నితీష్‌తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారని ప్రతీతి. అందుకే ఎన్డీయే తన తరపున సిఎం అభ్యర్థి ఎవరో చెప్పడానికి జంకుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి వాదనలో పసకనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని కొన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. ఈ ఎన్నికల్లో ప్రత్యేకత ఏమిటంటే రెండు కూటముల్లోనూ మెజార్టీ సీట్లు సాధించిన ఏ పార్టీ అయినా తన వంతు రాజకీయం తాను చేస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. ఎవరు గెలుస్తారో ఎవరు ఎవరిని పక్కనపెడతారో వంటి అంశాల్లో ఈసారి బీహారు మార్క్ రాజకీయాలోనే తేలుతుంది. బీహార్‌లో దాదాపు 40 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు నిర్ణాయక శక్తిగా ఉండబట్టే వారినాకట్టుకొనే ప్రయత్నంలో భాగంగా ఆర్జేడి తాము అధికారంలోకి వస్తే 'వక్ఫ్' చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించింది. యాదవులు, ముస్లింలు, ఆర్థికం గా వెనుకబడిన కులాలుండే బీహార్ రాజకీయ నేతలకు బిసిలు ఎటువైపో తెలియక గాభరా పడ్తున్నారు. ఎవరి ఎన్నికల మేనిఫెస్టోలు వారు రచించుకోలేక కులాల ఆకర్షణ కోసం ఏవేవో చెప్పడమే ఈ ఎన్నికల అవగాహన. నిర్దిష్టమైన పథకాలు కూడా ప్రచారం చేసుకోలేక పోవడం విశేషం. ముస్లింలంతా మూకుమ్మడిగా కాంగ్రెస్ కు ఓటు బ్యాంకుగా మారవచ్చునని మహాఘట్బందన్ భావిస్తున్నారు. వచ్చే యేడాది అన్ని ఎన్నికలకు బీహార్ ఎన్నికలే దిక్సూచి.



వ్యర్థమైన మాటలు వేలాదిగా చెప్పడం కన్నా శాంతిని, కాంతిని ప్రసాదించే ప్రయోజనకరమైన మాట ఒక్కటి చాలు.

గౌతమ బుద్ధుడు



ప్రపంచాన్ని మార్చదలచినవాడు ముందుగా తనను తాను మార్చుకోవడం నేర్చుకోవాలి.

సోక్రటీస్

# ప్రజావాక్కు



## ప్రాణాలు గాలిలో దీపాలేనా..

అదుపులేని ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణీకుల ప్రాణాల్ని గాలిలో దీపాలుగా చేస్తున్నాయి. కర్నూలు దగ్గరలో జరిగిన అగ్నిప్రమాదంలో బస్సులోనే ఆహుతి అయిన 19 మానవ ప్రాణాలు ఈ దుస్థితికి ఉదాహరణ. ఆ ప్రమాద కారణాలు ప్రత్యక్షంగా ఏవైనప్పటికీ, అలాంటి ప్రమాదం ఏర్పడడానికి పరోక్షంగా దోహదపడిన పరిస్థితుల్ని చక్కదిద్దడానికి పూనుకోకపోతే మళ్లీ మళ్లీ అలాంటి దురదృష్టకర సంఘటనలకు పెచ్చరిల్లుతాయి. ఈ దుర్ఘటన జరిగాక ఆంధ్రప్రదేశ్‌లో సంబంధిత అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల్లో 360కి పైగా అతిక్రమణలు గుర్తించారు. నలభై బస్సుల్ని సీజ్ చేశారు. కళ్లెదుట ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణించే బస్సులు ఒక్క రోజు తనిఖీలోనే పదుల సంఖ్యలో ప్రయాణింప వీలుగాని కండిషన్‌లో ఉన్నాయంటే వ్యవస్థ ఏ స్థితిలో ఉందో అర్థమోతుంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## ప్రజలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రము లోని 12.769 గ్రామ పంచాయతీలల్లోఎస్సి, ఎస్టీ. కాలనీలలో ఇంటి యజమానులు ప్రజలు నడిచే గ్రామ పంచాయతీ రోడ్డు పై నల్లా నీళ్ల ఒడల ట్యాంక్ ప్రభుత్వ స్థలం రోడ్డు పై నిర్మించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోని అట్టి వాటిని గుర్తించి తొలగించడం అవసరం. రోడ్ల అక్రమంగా వాడుకొంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి. నోటీసులు జారీ చేసి అట్టి వాటిని గ్రామ పంచాయతీ సిబ్బంది చేత తొలగించడం అవసరం. ప్రజలకు న్యాయం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## రైతు సమస్యలను పట్టించుకోండి

వ్యవసాయరంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013భూసేకరణ చట్టంప్రకారం, భూమి ని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతు ఉత్పత్తులకు అనుకూల మైనవిధంగా మార్చాలి. రైతుకు వాస్తవ లాభం చేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

## రోడ్లపైనే పశువుల మందలు

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలు మండలాలు నగరాలు పట్టణ కేంద్రాల్లో రోడ్లపై స్వేచ్ఛగా ఆవులు గేదెలు, సంచరించడంవల్ల నిత్యం రోడ్డు ప్రమాదములు జరుగుతున్నాయి ముఖ్యంగా హన్మకొండ వరంగల్ పరకాల పట్టణం లో ప్రధాన రహదారిలో గుంపులుగా పశువులు ఉండి ప్రమాదాలకు కారకాలుగా నిలుస్తున్నాయి భూపాలపల్లి జిల్లా కేంద్రం లో కాటారం డివిజన్‌లో వివిధ పట్టణాల్లో రోడ్డు మధ్యనే గుంపులు గుంపులుగా ఆవులు సేద తీరడంతో వాహనదారులు నానా యాతన పడుతున్నారు ప్రతిరోజు ఇవి రోడ్లమీద సంచరించడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన నగరాల్లో రోడ్ల వెంబడి తిరుగుతున్నటువంటి పశువులను పశు శాలకు పంపించి ఆ పశువుల యజమానుల మీద కేసులు పెట్టాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## దేశీయ ఉపాధి మీదే ఆధారపడదాం

భారత ఐటీ రంగంఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బివీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలను పెంచడం, రిమోట్‌డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభనుపెంపొందించడం అత్యంతప్రాధాన్యం కలిగిన అంశం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభను ప్రదర్శించి స్థానిక స్థాయిలో స్టార్టప్స్‌ను స్థాపిస్తే, దేశీయఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మన స్థానం మరింత బలపడుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## వ్యవస్థలు బాగా పని చేయాలి

దేశంలోని ముఖ్యమైన వ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు, చట్టాలు, చట్ట సభలు, ఇతర రంగాల ఉద్యోగులు, పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచివేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలు అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వాతావరణ సంక్షోభాన్ని అరికట్టలేమా?

***అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశానికి విద్యుత్, పరిశ్రమల కోసం శక్తిచాలా అవసరం. అందుకే మన మొత్తంకాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి.***

డి జయరాం

ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, గాలిలో ఉండే కార్బన్ డయాక్సైడ్ పరిమాణం రికార్డు స్థాయిలో పెరిగింది. ఈ పెరుగుదల భూతాపానికి ప్రధాన కారణాలలో ఒకటిగా మారింది. 2024 సంవత్సరానికి సంబంధించిన ఈ నివేదిక చాలా ఆందోళన కలిగించే విషయాలను వెల్లడించింది. 2023 నుండి 2024 మధ్య ప్రపంచ సగటు కార్బన్ డయాక్సైడ్ స్థాయి 3.5 పీపీఎం పెరిగింది. 1957లో కొలవడం మొదలు పెట్టినప్పటి నుంచి ఒకే ఏడాదిలో ఇంత ఎక్కువ పెరుగుదల నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ కారణంగా, 2024లో గాలిలోని కార్బన్ డయాక్సైడ్ వాయువు స్థాయి 423.9 పీపీఎంకు చేరుకుంది. గత 8 లక్షల సంవత్సరాలలో మానవుడు ఇంత స్థాయిని ఎప్పుడూచూడలేదు. అంతేకాకుండా 1960ల నుంచి ఈ కాలుష్యం పెరిగే వేగం దాదాపు మూడు రెట్లు ఎక్కువైంది. గతంలో నెమ్మదిగా పెరిగేది కానీ ఇప్పుడు ఒక్కసారిగా 3.5 పీపీఎంకు పెరగడం మరింత భయాన్ని కలిగిస్తోంది. దీనికితోడు, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ఇతర వేడిని పెంచే వాయువులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. ఈ వాయువులన్నీ కలిసి 1990 నుంచి భూమిపై వేడిని నిల్వ చేసే శక్తిని 54 శాతం పెంచాయి. పెరుగుదలకు కారణాలు -మనిషి తప్పులు, ఈ అతిపెద్ద పెరుగుదలకు ముఖ్యంగా రెండు ప్రమాదకరమైన కారణాలు కలిశాయి. ఒకటి మనం చేసే పనుల వల్ల విడుదలయ్యే కాలుష్యం, రెండు ప్రకృతిలో కాలుష్యాన్ని పీల్చుకునే శక్తి తగ్గడం. ఇది భూమిపై ఉన్న కార్బన్ చక్రంలో ఒక పెద్ద సమస్య ఏర్పడిందని సూచిస్తుంది. మొదటిది బొగ్గు, పెట్రోల్, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను వాడడం తగ్గిస్తామని ప్రపంచ దేశాలు ప్రమాణాలు చేసినప్పటికీ, వాటిని మండించడం ఆగలేదు. కార్బన్ డయాక్సైడ్ వాయువు పెరుగుదలలో ఎక్కువ భాగం ఇంకా ఈ శిలాజ ఇంధనాల నుంచే వస్తుంది. రెండవది సాధారణంగా సముద్రాలు, అడవులు వంటి ప్రకృతి వ్యవస్థల. వీటిని ఖకార్బన్ సింక్‌లుఖ అంటారు. ప్రతి సంవత్సరం మనం విడుదల చేసే కాలుష్యంలో దాదాపు 50 శాతం వరకు పీల్చుకుంటాయి. అయితే, 2024లో వీటి కాలుష్యాన్ని పీల్చుకునే సామర్థ్యం తగ్గిందని ప్రపంచ వాతావరణ సంస్థ చెబుతోంది. వీటికి తోడుగా తీవ్రమైన వాతావరణ మార్పులు ప్రకృతి వైపరీత్యాలు కూడా ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి. 2024రికార్డు స్థాయి వేడి, ఎల్ నినో ప్రభావం వల్ల అమెజాన్, ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో భయంకరమైన కరువులు, పెద్ద అటవీ మంటలు వచ్చాయి. ఈ మంటల ద్వారా అడవుల్లో నిల్వఉన్న భారీ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు తిరిగి గాలిలోకి విడుదలవ్వడం ఈ పెరుగుదలను మరింత వేగవంతం చేసింది. ఈ రికార్డు పెరుగుదల చూస్తుంటే, వాతావరణ సంక్షోభం నెమ్మదిగా జరగడం లేదు, ఇది తనకు తానుగా వేగాన్ని పెంచే ప్రమాదకరమైన వలయం లోకి మారుతోందనే హెచ్చరిక ఇస్తుంది. ముఖ్యంగా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే కాలుష్యాన్ని పీల్చుకునే కార్బన్ సింక్‌లు బలహీనపడటం. ఉష్ణోగ్రత పెరిగిన సముద్రాలు తక్కువ కార్బన్ డయాక్సైడ్ వాయువును పీల్చుకుంటాయి. అదే సమయంలో అవి ఆమ్లంగా మారి సముద్రంలోని జీవులకు



ప్రమాదంగా మారుతాయి. భూమిపై కూడా, విపరీతమైన వేడి, కరువుల వల్ల మొక్కలు ఒత్తిడికి గురై కాలుష్యాన్ని తక్కువగా పీల్చుకుంటాయి. ఈ ఒత్తిడి తీవ్రమైతే భారీగా చెట్లు చనిపోతాయి. అరణ్యాలు కాలిపోతాయి. దీనివల్లనిల్వ ఉన్న కార్బన్ తిరిగి గాలిలో కలిసి, ఆ అటవీ ప్రాంతం కాలుష్యాన్ని పీల్చుకోవడం మానేసి, కాలుష్యాన్ని విడుదల చేసే ప్రాంతంగా మారుతుంది. ఈ వలయం మనకు ఏం చెబుతోందంటే, మనం కాలుష్యాన్ని తగ్గించినా లేదాఆపినా, ప్రకృతి కూడా తన శక్తిని కోల్పోయి నిల్వ ఉన్న కార్బన్‌ను విడుదల చేయడం మొదలుపెడితే మొత్తం వాతావరణ వ్యవస్థ మరింత వేగంగా వేడెక్కుతుంది. కార్బన్ డయాక్సైడ్ వాయువు చాలాకాలం వాతావరణంలో ఉండే కాలుష్య వాయువు. ఇది గాలిలో శతాబ్దాల పాటు ఉంటుంది. అందుకే 423.9 పీపీఎం స్థాయి అనేది తాత్కాలికం కాదు. ఇది రాబోయే తరాలకు కూడా అధిక ప్రపంచ ఉష్ణోగ్రతలకు దీర్ఘకాలిక కట్టుబాటును సూచిస్తుంది. ఈ వాయువులు పట్టి ఉంచే వేడి, మనం ఉద్గారాలను వెంటనే తగ్గించినా కూడా, భవిష్యత్తులో కరువులు, వరదలు లాంటి వాతావరణ మార్పులను, తీవ్రమైన విపత్తులను పెంచుతూనే ఉంటుంది. ఈ డేటా ప్రకారం పారిస్ ఒప్పందంలో నిర్ణయించిన 1.5డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పరిమితిని చేరుకోవడం మరింత కష్టమని తెలుస్తోంది. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక అంతర్జాతీయ విధానాలకు 'రెడ్ అలర్ట్' గా పనిచేస్తుంది. కాలుష్యాన్ని కేవలం 'తగ్గిస్తాం' అనే మాటలు చాలవు. శిలాజ ఇంధనాలను తక్షణమే పూర్తిగా విడిచిపెట్టాల్సిన అవసరాన్ని ఈ నివేదిక స్పష్టం చేస్తుంది. ప్రపంచ లక్ష్యాలను పెంచడంతో పాటు, కాలుష్యాన్ని పీల్చుకునే అడవులు, సముద్రాలను కాపాడడానికి కూడా ప్రయత్నాలు చేయాలి. ఈ రికార్డు స్థాయి బొగ్గుపులుసు వాయువు పెరుగుదల మన భారతదేశానికి చాలా పెద్ద ప్రమాద ఘంటిక. ప్రపంచ దేశాలు కలిసి కాలుష్యాన్ని తగ్గించడంలో విఫలం కావడం వల్ల, వాతావరణం మరింత వేడెక్కి, తీవ్రమైన వాతావరణ మార్పులు మొదలయ్యాయి. ఈ మార్పుల వల్ల మన దేశంలోనే ఎక్కువ నష్టం జరుగుతుంది. ఊహించని వరదలు, భరించలేని ఎండలు, రుతుపవనాలలో మార్పులు వంటివి పెరిగి మన వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. ఇది పేద ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. వాతావరణ న్యాయం కోణంలో చూస్తే ఈ పెరుగుదల మనకు అన్యాయం. మన దేశంలో ఒక్కొక్క మనిషి చేసే కాలుష్యం అంటే తలసరి కాలుష్యం ధనిక దేశాల కంటే చాలా తక్కువ. కానీ పాత కాలం నుండి ఎక్కువ కాలుష్యం చేసిన ధనిక దేశాల తప్పుల వల్ల, ఇప్పుడు ఈ మార్పుల కష్టాన్ని మాత్రం మనమే ఎక్కువ భరించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మన ముందు ఒక పెద్ద సవాలును ఉంచుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశానికి విద్యుత్, పరిశ్రమల కోసం శక్తిచాలా అవసరం. అందుకే మన మొత్తంకాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి. ధనిక దేశాలను బాధ్యులను చేయాలి. 'కాలుష్యం ఎవరు ఎక్కువ చేశారో, వారే ఎక్కువ తగ్గించాలి' అనే సిద్ధాంతాన్ని గట్టిగా నిలబెట్టాలి. ఈ రికార్డు కాలుష్యం పెరుగుదల అనేది మనమందరం మారాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ●

# ప్రజా సౌకర్యాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

ఐ.పి.రావు

కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం. విమానాలు, స్కూల్ బస్సులు ప్రమాదానికి గురైనప్పుడు, ట్రావెల్స్ బస్సులు అగ్నికీలల్లో ఆహుతి అయినప్పుడు, ప్రమాదాల్లో పలువురి ప్రాణాలు కోల్పోయినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు, సంబంధించిన శాఖలు ఆగమేఘాలపై విస్తృత తనిఖీలు నిర్వహించడం, పలు కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారిపోయింది. ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు అని గ్రహించాలి. ముఖ్యంగా ప్రైవేటు ట్రావెల్స్ పై నిఘా, తనిఖీలు నామమాత్రంగా జరగడం వల్లనే పలువురు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అసలు ట్రావెల్స్ బస్సులు అన్ని, సంబంధించిన శాఖ ఆడిటింగ్ చేస్తుందా!? ఎన్ని బస్సులు మంచి కండిషన్‌లో ఉన్నాయి. ఎన్ని బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, కిట్, హేమర్, అగ్నిమాపక పరికరాలు, నిపుణులైన డ్రైవర్ తదితర రక్షణ పరికరాలు ఉన్నాయో తనిఖీ జరిగిందా? లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కేసులు నమోదు చేశారు. ఏమి చర్యలు తీసుకున్నారు? శ్వేత పత్రం విడుదల చేయాలి. నిబంధనలు పాటించని బస్సులు వివరాలు, ఏమి చర్యలు తీసుకున్నారు, ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు, స్టేటస్ వంటి అంశాలు ప్రతీ సంవత్సరం ప్రజలకు తెలిసేవిధంగా ప్రభుత్వం, సంబంధించిన శాఖలు 'డాక్యుమెంట్' రిలీజు చేయాలి. 'పబ్లిక్ డొమైన్'లో పెడితే, ప్రయాణికులు అవగాహన చేసుకొని, మంచి ప్రమాణాలు పాటిస్తున్న బస్సులు ఎక్కి తమ గమ్యాలను సురక్షితంగా చేరుకోవడానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా పండుగ సమయాల్లో, పండుగ రద్దీసమయాల్లో రకరకాల బస్సులు ఆ మాటకు వస్తే కండిషన్ లేని బస్సులను కూడా నామమాత్రంగా మరమ్మతులు చేసి రంగులు పూసి, స్లీపర్, సెమీస్లీపర్, లగ్జరీవంటి పేర్లతో నడుపుతూ, అధికారుల కళ్లు గప్పి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నడుపుతూ ప్రైవేటు యాజమాన్యాలు అధిక మొత్తంలో ఆదాయం సంపాదించడం జరుగుతుంది. దీనికి ప్రధాన కారణం ఎక్కువ శాతం ఈ ప్రైవేటు ట్రావెల్స్ రాజకీయ నాయకులకు, వారి



బంధువులకు, ధనికులు భూస్వాములు సంపన్నులు కార్పొరేట్ వర్గాలకు చెందినవారివే. దీంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ సంవత్సరాలు తరబడి నడపడం జరుగుతుంది. అదే సమయంలో ప్రజలు, ప్రయాణికులు తమ తమ అవసరార్థం డబ్బులుచెల్లించి ప్రయాణాలు చేస్తున్న పరిస్థితి ప్రజల్లో కూడా అవగాహన పెరగాలి. సీజన్ బట్టి డబుల్ చార్జీలు వసూలు చేయడం జరుగుతుంది. ప్రభుత్వాలు కూడా ప్రజల అవసరతలు తీర్చాలి కదా? విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలు వంటివి ప్రజలకు నాణ్యమైన రీతిలోఅందించే ఏర్పాటు చేయాలి. దురదృష్టవశాత్తూ మన దేశంలో ఇటువంటి పబ్లిక్ ఫెసిలిటీస్ అన్నియు దాదాపు 70డెబ్బై శాతం ప్రైవేటీకరణ జరిగింది. ఇక దీంతో ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ట్రావెల్స్ పేద మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనికి తోడు కనీసం నియంత్రించే వ్యవస్థ, తనిఖీ అధికారులు అవసరాలకు అనుగుణంగా లేకపోవడం జరుగుతుంది. ఏ శాఖలో చూసిన ఖాళీ పోస్టులే, సిబ్బంది కొరత, సౌకర్యాలు కొరత ఉన్న సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఇక ఏ రవాణా శాఖ కార్యాలయంలో చూసిన ప్రైవేటు సిబ్బందిదే హవా. ఆయా కార్యాలయాలకు వద్దకు వెళ్ళితే, ఆ చుట్టుపక్కల ఉండే ప్రైవేటు వ్యక్తులు, కార్యాలయాలు హడావుడి అంతా ఇంతా కాదు. దీనికి ప్రధాన కారణం, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సిబ్బంది, కార్యాలయాలు లేకపోవడమే. ఇకనైనా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. అవసరత మేరకు రవాణా కార్యాలయాలు, సిబ్బంది, తనిఖీ అధికారులు, ఫైర్ సేఫ్టీ అథారిటీ, నిఘా సంస్థలు, పోలీసు పెట్రోలింగ్ వాహనాలు సమకూర్చాలి. కనీసం ప్రజల కనీస సౌకర్యాలు అవసరతలు తీర్చే వ్యవస్థలపై దృష్టి సారించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.. ప్రభుత్వ నియమనిబంధనలు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. ప్రమాదాలు బారిన పడకుండా చూసుకోవాలి.. ముఖ్యంగా ప్రభుత్వాలు నియమనిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. మరణించిన సమయాల్లో క్షతగాత్రులకు నష్టపరిహారం చెల్లించడంతో చేతులు దులుపుకోరాదు. పోయిన ప్రాణాలను తిరిగి తేలేం. ప్రాణం విలువైనది అనే భావనతో అందరి శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వాలు, యంత్రాంగం పనిచేయాలని ఆశిద్దాం. ●

# ఆవిష్కరణ ఆధారిత పరిశోధనలకు గుర్తింపు

డాక్టర్ రామకృష్ణ బండారు

ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులలో నోబెల్ బహుమతి మొదటిది. ఈ బహుమతిని స్వీడిష్ శాస్త్రవేత్త 'ఆల్ఫ్రెడ్ నోబెల్' జ్ఞాపకార్థం 1901 నుంచి ప్రతీ సంవత్సరం ఇస్తున్నారు. శాంతి, సాహిత్యం, వైద్యశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి ఆరు కేటగిరీల్లో ఈ బహుమతిని అందజేస్తారు. ఈ ఆరు రంగాలలో అత్యుత్తమ కృషి చేసిన వారికి నోబెల్ బహుమతిని అందచేస్తారు. నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న వ్యక్తికి బంగారు మెడల్, డిప్లొమాతో పాటు దాదాపు 11 మిలియన్ స్వీడిష్ క్రోనర్ అంటే భారత కరెన్సీలో సుమారురూ. 8.5 కోట్లు నగదును బహుమతిగా ఇస్తారు. ఈ బహుమతి ప్రదానం రెండు ప్రాంతాలలో జరుగుతుంది. నోబెల్ శాంతి బహుమతి నార్వే రాజధాని ఓస్లోలో ప్రదానం చేస్తారు. మిగిలిన నోబెల్ బహుమతులను స్వీడన్లోని స్టాక్‌మ్‌లో ప్రదానం చేస్తారు. నోబెల్ బహుమతి అవార్డులను ప్రకటించడం కోసం రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కమిటీ ఉంటుంది. వచ్చిన నామినేషన్లను పూర్తి స్థాయిలో పరిశీలించి విన్నర్స్‌ను ప్రకటిస్తారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సంవత్సరం జాన్‌క్లార్క్, మైఖేల్ డెవోరెట్, జాన్ ఎం.మార్టినిస్‌లకు భౌతికశాస్త్రంలో, సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్ ఒమర్ ఎం.యాఘీలజు రసాయన శాస్త్రంలో, మేరీ ఇ.బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచిలకు వైద్య శాస్త్రంలో, సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నా హెర్కైకు, నోబెల్ శాంతి బహుమతికి మరియా కొరినా మచాడోకు, జోయెల్ మోకిర్, ఫిలిప్ అగియోన్, పీటర్ హొవిట్‌లకు ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతులు లభించాయి. ముఖ్యంగా, ఆర్థిక శాస్త్రంలో జోయెల్ మోకిర్, ఫిలిప్ అగియోన్, పీటర్ హొవిట్‌లకు నోబెల్ బహుమతి రావడం గర్వించదగ్గ విషయం. ఇన్నోవేషన్ ఆధారిత ఆర్థిక వృద్ధి సిద్ధాంతాలను వివరించినందుకు ఈ ముగ్గురు ఆర్థికవేత్తలకు 2025 సంవత్సరానికి గాను ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. నూతన ఇన్నోవేషన్స్ 'ఆర్థిక వృద్ధి'నిఎలా ముందుకు తీసుకుపోతాయో అనే అంశం మీద వీరి పరిశోధనలు సాగాయి. జోయెల్ మోర్ అమెరికాఇజ్రాయెలీ ఆర్థికవేత్త. నార్వెస్టర్న్ యూనివర్సిటీలో డచ్‌ఇజ్రాయెలీఅమెరికన్ ఆర్థిక చరిత్రకారుడిగా పనిచేస్తున్నాడు. ప్రతిష్టంభన నుంచి స్వీయ సుస్థిర ఆర్థిక వృద్ధి వైపు సొసైటీ ఎలా పయనించిందో చారిత్రక ఆధారాలను తన పరిశోధనలో తెలియచేసాడు. సాంకేతిక ప్రగతి ద్వారా సుస్థిర అభివృద్ధికి కావాల్సిన అవసరాలను గుర్తించినందుకు మోకిర్‌ని ఈ బహుమతికి ఎంపికచేశారు. ఆయన పరిశోధన పారిశ్రామిక విప్లవం ఎలా ప్రారంభమైంది, అది ఎలా నిరంతర వృద్ధికి దారి తీసిందో వివరించింది. సాంకేతిక ఆవిష్కరణల వెనుక ఉన్న శాస్త్రీయ వివరణలే ఆర్థిక వృద్ధిని దీర్ఘకాలం కొనసాగించడానికి సహాయపడతాయి అని పేర్కొన్నాడు. అలాగే, సమాజం కొత్త ఆలోచనలను, మార్పులను స్వీకరించే సంస్కృతి అవసరమని తన పరిశోధనల ద్వారా తెలియ చేసాడు. ఇన్నోవేషన్ విజయానికి జ్ఞానం సామాజిక అంగీకారం రెండూ కీలకమని నిర్ధారించాడు. అదేవిధంగా, ఫిలిప్ అఘియాన్ ఫ్రాన్స్ దేశానికీ, పీటర్ హెవిట్ కెనడాకు చెందిన ఆర్థికవేత్తలు. ఫిలిప్ అగియోన్ పారిస్లోలోని ఇన్సెడ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్లో ప్రొఫెసర్గా పనిచేస్తున్నాడు. పీటర్ హెవిట్ యునైటెడ్ స్టేట్స్ లోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా ఉన్నారు. 'క్రియేటివ్ డిస్ట్రక్షన్' ద్వారా నిరంతర ప్రగతి పై వీరు చేసిన పరిశోధనలకుగాను నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. అఘియోన్, హెవిట్ ఇద్దరూ 1992లో ప్రచురించిన తమ ప్రసిద్ధ వ్యాసంలో 'సృజనాత్మక విధ్వంసం' అనే భావనను గణితపరంగా వివరించారు. ఈసిద్ధాంతం ప్రకారం, కొత్త ఆవిష్కరణల ద్వారా నూతన సాంకేతికత ఉద్భవిస్తుంది. ఫలితంగా కొత్త పరిశ్రమలు, కొత్త ఉత్పత్తులు పుట్టుకొస్తాయి. పాతపద్ధతులను కొత్త ఇన్నోవేషన్స్ భర్తీ చేసే ప్రక్రియద్వారా ఆర్థికవ్యవస్థ ఎప్పటికప్పుడు ముందుకు సాగుతుందని వీరి సిద్ధాంతం చెబుతుంది. ఈ ముగ్గురు ఆర్థికవేత్తలుతమ పరిశోధనలవలన నూతన ఆవిష్కరణలు ప్రపంచ పురోగతికి ఎలాదోహదం చేస్తాయో తెలియచేసారు. మానవచరిత్రలో ఎన్నడూలేనివిధంగా ప్రపంచం వృద్ధివైపు పయనిస్తుంది. తద్వారా కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటమే కాకుండా ప్రపంచ సంపద పెరుగుదలకు కారణమైనది. ఈప్రపంచ ప్రగతి కారణమైన ఇన్నోవేషన్స్‌ల పాత్ర ను అర్థమయ్యేలా చెప్పడమే వీరి పరిశోధనల సారాంశం. సాంకేతిక పురోగతి, ఇన్నోవేషన్స్ ద్వారా స్థిరమైన వృద్ధిఎలా ఏర్పడుతుందో శాస్త్రీయంగా వీరు నిరూపించారు. వాస్తవానికి, సాంకేతిక పోరోగతి పారిశ్రామికీకరణకే కాకుండా మానవాళి మనుగడకు కూడా దోహదం చేస్తుంది. అలాంటి సాంకేతిక అభివృద్ధితో కూడుకున్న సమాజాలను ఎలా నిర్మించాలో జోయెల్ మోకిర్ తన పరిశోధనతో తెలియ చేసాడు. అంతేకాదు చారిత్రక ఆధారాలతో సాంకేతిక పురోగతికి నిరంతర వృద్ధికి అవసరమైన పరిస్థితులను వివరించాడు. అంతేకాదు, పారిశ్రామిక విప్లవానికి ముందు తరువాత పరిస్థితులను తన పరిశోధనలతో వివరించడం ద్వారా ప్రస్తుత తరానికి అలాంటి పరిస్థితులను ఎలా అనుకూలం గా మార్చుకోవాలో తెలిసివస్తుంది. మార్కెట్‌లో కొత్త టెక్నాలజీ వచ్చి నప్పుడు పాత టెక్నాలజీ ఉపయోగిస్తున్న కంపెనీలు ఎలా దెబ్బతింటాయో తెలియచేయడం ద్వారా పారిశ్రామిక వర్గా లకు ఎంతో మేలు చేకూరుతుంది. కొత్త ఇన్నోవేషన్స్‌ను సొసైటీ ముందుకు తీసుకెళితే, పాత పద్ధతులు కనుమరు గవడం వల్ల జరిగే నష్టాన్ని 'క్రియేటివ్ విధ్వంసం'గా తెలి యచేయడం ద్వారా పాత పద్ధతుల ప్రాముఖ్యతను తెలియచ్చేసారు. ఇన్నోవేషన్స్ వలన ఆర్థికవృద్ధి స్థిరత్వం ఎలా నియంత్రించవచ్చో ఈ ఆర్థికశాస్త్రవేత్తలు నిరూపించారు. ●

## మూడోసారి పోటీకి ఇష్టమే

### ట్రంప్ మన్‌కీ బాత్!



**వాషింగ్టన్, అక్టోబరు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అంశంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరంగా అవకాశం లేనప్పటికీ, 2028లో మళ్లీ పోటీ చేసే ఆలోచనను ఆయన తోసిపుచ్చలేదు. తన మాజీ వ్యూహకర్త స్టీవ్ బానన్ చేసిన సూచనపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ మీడియాతో మాట్లాడిన ట్రంప్, మూడోసారి పోటీ చేయడాన్ని నేను కచ్చితంగా ఇష్టపడతాను. నాకు మునుపెన్నడూ లేనంత మంచి ఆదరణ ఉందని అన్నారు. అయితే, వెంటనే మాట మార్చుతూ, దాని గురించి నేను నిజంగా ఇంకా ఆలోచించలేదని పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా పనిచేయడానికి వీల్లేదు. పొలిటికో కథనం ప్రకారం, ట్రంప్ సన్నిహితుడైన స్టీవ్ బానన్, ఆయన మూడోసారి పోటీ చేయాలని బలంగా వాదిస్తున్నారు. దీనికోసం ఒక ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని తన పాడ్‌కాస్ట్‌లో ఇటీవల బానన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో తన తర్వాత రిపబ్లికన్ పార్టీని నడిపించే నాయకులపై కూడా ట్రంప్ స్పష్టత ఇచ్చారు. 2028 అధ్యక్ష ఎన్నికల బరిలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధాన అభ్యర్థులుగా ఉంటారని సంకేతాలిచ్చారు. మన దగ్గర చాలా మంచి నాయకులు ఉన్నారు. వారిలో ఒకరు ఇక్కడే నిలబడి ఉన్నారంటూ రూబియోను ఉద్దేశించి అన్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా అద్భుతమైన వ్యక్తి. వీరిద్దరికీ వ్యతిరేకంగా ఎవరూ పోటీ చేయరని నేను భావిస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ట్రంప్ ఆసియా పర్యటనలో ఉన్నారు. మలేషియాలో ఆసియాన్ సదస్సులో పాల్గొన్న ఆయన, తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని జపాన్‌లోని టోక్యోకు చేరుకున్నారు. మలేషియా పర్యటన ముగింపు సందర్భంగా అక్కడి అధికారులు, ప్రజలకు ఆయన అభివాదం చేశారు. చాలా గొప్ప, శక్తివంతమైన దేశం మలేషియా నుంచి బయలుదేరుతున్నాను. కీలకమైన వాణిజ్య, రేర్ ఎర్త్ ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అంతకుమించి థాయ్‌లాండ్, కంబోడియా మధ్య శాంతి ఒప్పందం కుదిర్చాం. ఇక యుద్ధం లేదు లక్షలాది ప్రాణాలను కాపాడాం. ఇప్పుడు జపాన్‌కు బయలుదేరానని ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు.

## రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు!



**చెన్నై, అక్టోబరు 28:** ప్రముఖ తమిళ నటుల ఇళ్లకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, వర్ధమాన నటుడు ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈమేరకు తైనాంపేట్ పోలీసులకు ఈమెయిళ్ల అందడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఏకంగా రాష్ట్ర డిజిపి కార్యాలయానికే ఈ మెయిళ్ల రావడం విశేషం. ఈ నటుల ఇద్దరి ఇళ్ల కూడా తైనాంపేట్‌పోలీసు పరిధిలో ఉండటంతో వెంటనే కేసులునమోదుచేసి గాలింపు ప్రారంభించారు. అయితే ఇళ్లకువెళ్లిన తర్వాత తమకు బాంబు స్క్వాడ్ అవసరం ఏమీ లేదని చెప్పారని తేలింది. రెండో హెచ్చరిక సాయంత్రం 6.30 గంటలకు వచ్చింది. రజనీకాంత్ టీమ్ మరోసారి సెక్యూరిటీ తనిఖీలను వ్యతిరేకించింది. అలాగే మరోనటుడు ధనుష్‌ఇంటిని పేల్చేస్తామని కూడా ఇదే తరహా మెయిల్ డిజిపికి వచ్చింది. ఆయన కూడా ఇలాంటి సెక్యూరిటీ తనిఖీలు వద్దని నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవలికాలంలోప్రముఖ వ్యక్తులు అనేకమందికి ఈ తరహా మెయిళ్లు వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సైబర్‌క్రైమ్ పోలీసులు ఈ వచ్చిన ఈమెయిళ్లను పరిశీలిస్తున్నారు. ఎక్కడినుంచి వచ్చాయన్న వివరాలన ఐపి అడ్రసులను ట్రాకింగ్‌చేస్తున్నట్లు తెలిపారు.

## రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధం

### ఘటనలో ముగ్గురు మృతి, పలువురికి గాయాలు



**జైపూర్, అక్టోబర్ 28:** కర్నూలులో ఘోర బస్సు ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 19 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటన మరువకముందే దేశంలో మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. జైపూర్, ఢిల్లీ, జాతీయ రహదారిపై మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఉత్తరప్రదేశ్ నుంచి తోడిలోని ఇటుక బట్టీకి కార్మికులను తీసుకెళుతోంది. జైపూర్ గ్రామీణ జిల్లా షాపురా సబ్ డివిజన్‌లోని మనోహర్‌పూర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. బస్సు రన్నింగ్‌లో ఉండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలాయి. వెంటనే భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. సుమారు 12 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## ట్రంప్‌ను 'శాంతి'కి నామినేట్ చేస్తా

### - జపాన్ ప్రధాన మంత్రి సనాయి తకైచి - టోక్యోలో ట్రంప్‌తో చర్చలు



**టోక్యో, అక్టోబరు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ చేస్తానని జపాన్ ప్రధానమంత్రి సనాయి తకైచి పేర్కొన్నారు. ఇదే విషయాన్ని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. మంగళవారం ఉదయం టోక్యోలోని అకసకా ప్యాలెస్‌లో ప్రధానమంత్రి తకైచితో ట్రంప్ భేటీ అయ్యారు. ఇరు దేశాల ఆర్థిక, భద్రతా, ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ భేటీ సందర్భంగా, నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ నామినేషన్‌కు తాము మద్దతి స్తామని తకైచీ స్పష్టం చేసినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. అయితే, దీనిపై జపాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ సమావేశంలో అంతర్జాతీయ శాంతి స్థాపన కోసం ట్రంప్ చేస్తున్న కృషిని తకైచీ కొనియాడారు. ముఖ్యంగా థాయ్‌లాండ్- కంబోడియా మధ్య శాంతి ఒప్పందం, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారని ఆమె ప్రశంసించారు. "అధ్యక్షా, మీరు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించడంలో విజయం సాధించారు.

అలాగే, మధ్యప్రాచ్యంలో మీరు ఇటీవల కుదిర్చిన ఒప్పందం అపూర్వమైనది, చారిత్రాత్మకమైనది" అని తకైచీ అన్నారు. ఆసియాలో అమెరికాకు జపాన్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశంగా ఉంది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాలపై ఒప్పందాలు జరిగాయి. ఆసియా పర్యటనలో భాగంగా ట్రంప్ తొలుత మలేషియాలో పర్యటించి ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు.

## అమెరికా, రష్యా మధ్య ప్లుటోనియం ఒప్పందం రద్దుచేసిన పుతిన్

**మాస్కో, అక్టోబర్ 28:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ఆపేయాలన్న తన సూచనను పెడచెవిన పెట్టాడని పుతిన్ పై ట్రంప్ ఇప్పటికే ఆగ్రహంగా ఉ న్నారు. ఈ క్రమంలోనే అమెరికాతో గతంలో రష్యా కుదుర్చుకున్న ప్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు. దీనికి సంబంధించిన చట్టంపై తాజాగా పుతిన్ సంతకం చేశారు. ఈ పరిణామం మళ్లీ అణు ఉద్రిక్తతలకు దారి తీస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒబామా హయాం లోనే2000 సంవత్సరంలో అమెరికా, రష్యాల మధ్య ప్లుటోనియం నిర్వహణపై ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2010లో ఈ ఒప్పందాన్ని సవరించారు. దీని ప్రకారం రష్యా తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ప్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి వాడకూడదు. ఈ నిల్వలను పౌర అణు విద్యుత్ తయారీ కోసం వినియోగించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారీని అడ్డుకున్నట్లు అప్పట్లో అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒబామా హయాంలో 2016 సంవత్సరం అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. దీంతో ప్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు.



## సరిహద్దులు మళ్లీ ఉద్రిక్తం

**లీపా లోయలో కాల్పుల విరమణ ఉల్లంఘన**
**మోర్టార్ షెల్లింగ్‌కు తెగబడిన పాక్ రేంజర్లు**

**శ్రీనగర్,అ క్టోబరు 28:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య నియంత్రణ రేఖ వెంబడి దాదాపు 5 నెలలుగా నెలకొన్న ప్రశాంతతకు మరోసారి భంగం కలిగింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ ఏడాది మే 10వ తేదీ నుంచి నిశ్శబ్దంగా ఉన్న సరిహద్దు ప్రాంతం తాజాగా అక్టోబర్ 26,27 మధ్య అర్ధరాత్రి కాల్పుల మోతతో దద్దరిల్లింది. నియంత్రణ రేఖ వెంబడి జమ్మూ కాశ్మీర్‌లోని వ్యూహాత్మక ప్రాంతమైన లీపా లోయలో పాకిస్తాన్ సైన్యం ఈ కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడింది. సరిహద్దుల్లోని భారత స్థావరాలను లక్ష్యంగా చేసుకొని పాక్ సైనికులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరపడంతో పాటు మోర్టార్ షెల్లింగ్‌కు కూడా తెగబడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చాలా కాలంగా లీపా లోయ వద్ద పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి అక్రమంగా చొరబాట్లకు కీలకమైన స్థావరంగా ఉంది. పాకిస్తాన్ సైన్యం ప్రారంభించిన దుశ్చర్యకు భారత సైనికులు గట్టిగా బదులిచ్చారు. పాక్ రేంజర్ల రెచ్చగొట్టే కాల్పులను భారత సైనికులు బలంగా తిప్పికొట్టారు. భారత జవాన్ల దీటైన ప్రతిఘటనతో పాకిస్తాన్ సైనికులు తోక ముడిచి వెనక్కి తగ్గక తప్పలేదని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. భారత్ బ్రహ్మోస్ మిసైల్స్‌కు పాక్ సైన్యం అవాక్కైంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి నియంత్రణ రేఖ వెంట మే 10వ తేదీ నుంచి శాంతి యుత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించిన తర్వాత ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ మే 7వ తేదీన చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో పాకిస్తాన్ భూభాగంలో లోపల ఉన్న 9 ఉగ్రవాద శిబిరాలను భారత వైమానిక దళం ధ్వంసం చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఆపరేషన్ సిందూర్‌లో వందకు పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్ర సంస్థల స్థావరాలు పూర్తిగా నాశనం అయ్యాయి. కూలిన పాక్ ఫైటర్ జెట్లు ఆపరేషన్ సిందూర్ దెబ్బకు తట్టుకోలేకపోయిన పాకిస్తాన్ భారత్‌పై డ్రోన్, క్షిపణి దాడులకు దిగింది. అయినప్పటికీ భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఫలితంగా.. మే 8వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పాకిస్తాన్‌లోని 11 సైనిక విమాన స్థావరాలపై దాడులు చేయడంతో.. తీవ్రంగా వణికిపోయిన ఇస్లామాబాద్ చివరకు కాల్పుల విరమణ కోసం భారత్‌కు విజ్ఞప్తి చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ స్వయంగా శాంతి కోసం భారత్‌ను అభ్యర్థించిన తర్వాత కూడా తాజాగా లీపా వ్యాలీలో కాల్పుల విరమణను ఉల్లంఘించడం ఆ దేశం వక్రబుద్ధికి, సరిహద్దుల్లో శాంతిని చెదరగొట్టాలనే కుట్రకు నిదర్శనంగా నిలుస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఆగస్ట్‌లో పూంఛ్ ప్రాంతంలో కూడా ఇలాంటి ఉల్లంఘనలు జరిగాయని వార్తలు వచ్చినా అప్పట్లో భారత సైన్యం వాటిని ఖండించింది. అయితే తాజా లీపా వ్యాలీ ఘటనతో సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తత పెరిగింది.

## ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

**• 200 యూనిట్ల ఉచిత విద్యుత్ • మహిళలకు ప్రతినెలా రూ.2,500 • ప్రభుత్వం వచ్చిన 20రోజుల్లోనే అమలు**

**• 25 హామీలతో మహాకూటమి మేనిఫెస్టో విడుదల**




**పాట్నా, అక్టోబరు 28:** బీహార్‌లోని ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం మంగళవారం తన ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సహాయం హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలనెలా రూ.2,500 ఆర్థిక సహాయం ఇస్తామని పేర్కొంది. అలాగే పాత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని కూడా మేనిఫెస్టోలో మహా కూటమి హామీ ఇచ్చింది. జీవికా దీదీస్‌కు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని కూడా మేనిఫెస్టోలో పేర్కొంది. కాంట్రాక్టు, ఔట్ సోర్స్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులు మారుస్తామని హామీనిచ్చింది. దాదాపు 25 హామీలతో "బీహార్ కా తేజస్వి ప్రాణ్ పత్ర" పేరిట మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహాఘట్ బంధన్ సిఎం అభ్యర్థి, ఆర్జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎం అభ్యర్థి, వికాశీల్ ఇసాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముకేష్ సాహని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా, సిపిఐ(ఎంఎల్) అగ్రనేత దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, తమ మేనిఫెస్టోలో ఆచరణాత్మక హామీలనే తాము పెట్టామని, ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి భారం కాదని పేర్కొన్నారు. అధికార ఎన్‌డిఎ కూటమిపై తేజస్వి విమర్శలు గుప్పించారు. సిఎం నితీశ్‌కుమార్ ఎన్‌డిఏ కూటమిలో బందీ అయిపోయారని, అందుకే సిఎం అభ్యర్థి ఎవరనేది ఇంకా తేల్చడం లేదని ఆర్జెడి నేత దుయ్యబట్టారు.

**చిక్కుల్లో ప్రశాంత్ కిశోర్ - బీహార్, బెంగాల్‌లో ఓటరుగా నమోదు - ఇసి నోటీసులు**

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ చిక్కుల్లో పడ్డారు. బీహార్‌తోపాటు పశ్చిమబెంగాల్ రెండు రాష్ట్రాల ఓటర్ల జాబితాలో ప్రశాంత్ కిశోర్ పేరు నమోదైంది. బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భబానీపూర్‌లో 121, కాళీఘాట్ రోడ్ చిరునామాతో ఓటరు జాబితాలో ప్రశాంత్ కుమార్ పేరుంది. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కిశోర్ టిఎంసికి రాజకీయ సలహాదారుగా పనిచేసిన విషయం తెలిసిందే. బీహార్‌లో కర్గాహార్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ప్రశాంత్ కిశోర్‌కు ఓటుంది. పికెకు ఇసి నోటీసులు బీహార్‌తో పాటు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలోనూ ఆయన పేరు కనిపించడంతో ఎన్నికల కమిషన్ ఈ చర్యలకు దిగింది. బీహార్‌లో రోహతాస్ జిల్లా ససరాంలోని కర్గాహార్ అసెంబ్లీ నియోజవవర్గం రిటర్నింగ్ అధికారి ఈ నోటీసులు పంపారు. కర్గాహార్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 621లో ఎపిక్ (ఓటర్ ఐడి) నంబర్ 1013123718 కింద ఓటరుగా ఆయన పేరు నమోదైందని, ఇదే సమయంలో పశ్చిమబెంగాల్‌లోని భాబనిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సెయింట్ హెలెన్ స్కూలు పోలింగ్ బూత్‌లో కూడా ఆయన పేరు నమోదై ఉందని ఆ నోటీసులో రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.





## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బస్సుదగ్ధం!

**న్యూఢిల్లీ,అక్టోబరు 28:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది. టెర్మినల్ 3 వద్ద ఎయిరిండియా విమానానికి కొన్ని మీటర్ల దూరంలో ఆగి ఉన్న ఓ బస్సులో అగ్నిప్రమాదం సంభవించింది. బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టెర్మినల్ 3 వద్ద బే 32 సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సు పలు విమానయాన సంస్థలకు గ్రౌండ్ సర్వీసులు అందించే సాట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్‌పార్టీ సంస్థకు చెందినది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరు. సమాచారం అందుకున్న వెంటనే విమానాశ్రయ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి, నిమిషాల వ్యవధిలోనే మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ యాజమాన్యం స్పందించింది. ఇదొక సాధారణ ఘటనేనని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎక్స్ వేదికగా తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే మా ప్రథమ ప్రాధాన్యత. విమాన సర్వీసులన్నీ యథాతథంగా కొనసాగుతున్నాయి" అని స్పష్టం చేసింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు గానీ, లగేజీ గానీ లేదని పోలీసులు తెలిపారు. అయితే, బస్సులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సాట్స్ సంస్థ దర్యాప్తు ప్రారంభించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు బస్సును క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.


## రీల్స్ చేయబోయి నదిలోపడిన బిజెపి ఎమ్మెల్యే



**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశరాజధాని ఢిల్లీలో అధికార బీజేపీకి చెందిన ఓ ఎమ్మెల్యేకి ప్రమాదకర అనుభవం ఎదురైంది. యమునా నది శుభ్రతపై రీల్స్ చేస్తూ కాలుజారి నదిలో పడిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఛట్ పూజ వేడుకల నేపథ్యంలో యమునా నది శుభ్రతపై అధికార బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. తాము అధికారం చేపట్టిన తర్వాత యమునా శుభ్రమైందంటూ బీజేపీ ప్రచారం చేస్తోంది. అయితే, బీజేపీ ప్రచారాన్ని ఆప్ తిప్పికొడుతోంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో యమునా నది శుభ్రతపై అవగాహన కల్పించేందుకు పత్పర్‌గంజ్ బీజేపీ ఎమ్మెల్యే రవీందర్ సింగ్ నేగి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగానే నది ఒడ్డున రీల్ చిత్రీకరిస్తుండగా.. అదుపుతప్పి నదిలోకి పడిపోయారు. 19 సెకన్ల నిడివి ఉన్న ఆ వీడియోలో, ఎమ్మెల్యే నేగి రెండు బాటిళ్లను చేతిలో పట్టుకుని యమునా నది ఒడ్డున మోకాళ్లపై కూర్చుని ఉంటారు. అక్కడి నుంచి లేవడానికి ప్రయత్నించగా అదుపుతప్పి ఒక్కసారిగా నీటిలో పడిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై ఆప్ నేత సంజీవ్ ఝా తీవ్రంగా స్పందిస్తూవ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీ నాయకులకు తప్పుడు వాగ్దానాలు చేయడం ఓ వృత్తిగా మారిందంటూ వ్యాఖ్యానించారు. బహుశా అబద్ధాలు, ప్రచార రాజకీయాలతో విసిగిపోయిన యమునా స్వయంగా వారిని పిలిపించుకున్నట్టుంది అన్నారు.

## సంక్షిప్తంగా..

### తుర్కియేలో తీవ్రస్థాయి భూకంపం



**అంకారా, అక్టోబరు 28:** తుర్కియేలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. నేటి వేకువజామున దేశంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భూమి కంపించడంతో ఉలిక్కిపడి లేచారు. ఏం జరుగుతోందో తెలియని ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప కేంద్రం, ప్రభావితమైన ప్రాంతాల పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం అందనప్పటికీ, కొన్ని భవనాలకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. భూకంపం సంభవించిన వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం సహాయక చర్యలను ప్రారంభించింది.

### ఆర్ఎస్ఎస్‌పై కర్ణాటక సర్కార్‌కు హైకోర్టు షాక్

**బెంగళూరు, అక్టోబరు 28:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది.

### దుబాయ్‌లో ఎన్ఆర్ఐల కోసం పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్

**దుబాయ్, అక్టోబరు 28:** ఎన్ఆర్ఐల కోసం దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్.. పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్ 2.0ను ఆవిష్కరించింది. ఆధునికీకరించిన ఈ ప్రోగ్రామ్ మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. పాస్‌పోర్టు సేవలను రిజిస్టర్ చేసుకోవడానికి, దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తుదారులు కొత్తగా లాంచ్ అయిన ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించాల్సి ఉంటుంది. అప్లికేషన్ ప్రాసెస్, సర్వీస్ సెంటర్లలో ఎదురుచూపులు తగ్గించేందుకు ఈ సేవను అందుబాటులోకి తీసుకువచ్చారు. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0 కింద ఇ-పాస్‌పోర్టులను తీసుకువచ్చారు. ఈ సాంకేతికతతో ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌లు వేగవంతం కానున్నాయి. భారత్ అందించే సేవలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారనున్నాయి. వీసా అవసరాలకు తగ్గట్టుగా ఫొటో, సంతకం, ఇతర పత్రాలను నేరుగా ఆ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేసుకోవచ్చు. దాంతో బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ సెంటర్లలో ప్రాసెసింగ్ టైమ్ తగ్గే అవకాశం ఉంటుంది.

### కెనడాలో సిక్కునేత దారుణ హత్య

**టొరంటో, అక్టోబరు 28:** కెనడాలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కానమ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు దర్శన్ సింగ్ సాహ్సీ (68) కాల్పుల్లో మరణించారు. బ్రిటిష్ కొలంబియాలోని అబాట్స్‌ఫోర్డ్‌లో ఆయన నివాసం వెలుపల ఈ ఘటన జరిగింది. కారులో కూర్చుంటున్న సమయంలో ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపి పారిపోయినట్లు తెలుస్తోంది. అబాట్స్‌ఫోర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 9:22 గంటలకు రిడ్జ్‌వ్యూ డ్రైవ్‌లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి, కారులో ఉన్న సాహ్సీ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ప్రథమ చికిత్స సిబ్బంది వెంటనే వైద్య సహాయం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది.

### ఢిల్లీ బయట రిజిస్ట్రేషన్ వాహనాలకు ఇకపై నో ఎంట్రీ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశ రాజధాని ఢిల్లీ లోకి నగరం బయట రిజిస్టర్ అయిన కమర్షియల్ వాహనాల ప్రవేశంపై నిషేధం విధించారు. నవంబర్ 1 నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు. 'ది కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే బీఎస్6 నార్మ్స్ కు లోబడి ఉన్న వాహనాలను మాత్రం ఈ నిషేధం నుంచి మినహాయించారు. బీఎస్6 నార్మ్స్‌కు లోబడి వాహనాలు కాలుష్య కారకాలను తక్కువగా విడుదల చేస్తాయని, కాలుష్య నియంత్రణలో ఇవి తోడ్పడుతాయని అధికారులు చెప్పారు. ప్రమాణాలకు లోబడి బీఎస్6 వాహనాలకు 2026 అక్టోబర్ 31 వరకు మాత్రమే ఢిల్లీలోకి అనుమతి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్6 కమర్షియల్ వాహనాలతోపాటు సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా తాజా నిషేధం నుంచి మినహాయింపు ఇచ్చారు.

# 'మొంథా' దృష్టిలో పెట్టుకొని కొనుగోళ్లలో వేగం పెంచండి



**తూకం తర్వాతి పనుల బాధ్యతంతా అధికారులదే:**
**రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**
**3,814 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం :**
**పౌర సరఫరాల జిఎం నాగేశ్వరరావు**

**హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల వద్ద తూకం అయ్యాక మిగతా విషయాలన్నిటికీ అక్కడి అధికారులదే బాధ్యత ఉండేలా చూడండి, రైస్ మిల్లులకు తరలించే వరకు రైతులకు బాధ్యత పెట్టొద్దని ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నా రు. రైతు కమిషన్ చైర్మన్ అధ్యక్షతన బిఆర్‌కె భవన్‌లో మంగళవారం వరిధాన్యం కొనుగోలుపై సమీక్ష చేశారు.
మొంథా తుఫాన్ దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద వుండే అధికారులు వేగవంతంగా పనిచేయాలని సూచించారు.
కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా తూకం వేయాలన్నారు. అదేవిధంగా లారీలకు ఎక్కించిన ధాన్యం రైస్ మిల్లులకు వెళ్లేదాకా రైతులను బాధ్యుల్ని చేయొద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కాంటా పూర్తికాగానే రైస్ మిల్లులకు తరలించే బాధ్యత కొనుగోలు కేంద్రాల్లో వుండే అధికారులు, సిబ్బంది చూసుకోవా లన్నారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, ఏర్పాట్లు, ఇతర సదుపా యాలపై పౌరసరఫరాల శాఖ అధికారి ప్రొక్యూర్మెంట్ జీఎం నాగేశ్వర్‌రావుతో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి అడిగి తెలుసు కున్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకు రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు జీఎం నాగేశ్వర్ రావు కమిషన్‌కు వివ రించారు. అందులో 4.428 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 3,814 కేంద్రాలు ప్రారంభించ డానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా ఏర్పాట్లు చేసిన విషయాన్ని కమిషన్ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ అధికారులు సంధ్య రాణి, హరి వెంకట ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

## 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక లోక్‌అదాలత్‌ల ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న కాంపౌండింగ్ కేసుల పరిష్కారం కోసం నవంబర్ 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నారు. దీనికి సంబం ధించిన ఏర్పాట్లపై రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మంగళవారం నాడు హైకోర్టులో పోలీసు ఉన్నతాధికారులతో ఒక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వున్న హైకోర్టు జడ్జి శ్యాం కోషి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి డిజిపి శివధర్ రెడ్డితో పాటు శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, సిఐడి చీఫ్ చారు సిన్హా, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి, జుడిషియల్ విభాగం పరిపాలనాధికారి ఎం.రాజు తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జడ్జి శ్యాం కోషి ప్రత్యేక లోక్ అదాలత్‌లు విజయవంతం అయ్యేందు కు పోలీసుల సహకారం వుండాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసుల విషయంలో చొరవ చూపాలలని ఆయన కోరారు. దీనిపై డిజిపి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు.



## ఆభరణాల తయారీపై బిఐఎస్ అధికారుల శిక్షణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు28:** భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా, హాల్‌మార్క్ పద్ధతులు పాటిస్తూ బంగారు, వెండి ఆభరణాలు తయారు చేయాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, దక్షిణ ప్రాంత కార్యాలయ హాల్‌మార్కింగ్ అధికారి, డైరెక్టర్ బాలకృష్ణన్ కోరారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఆభరణాల తయారీదారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం. బాలకృష్ణన్, సైంటిస్ట్-ఇ అండ్ డైరెక్టర్ (హాల్‌మార్కింగ్ అధికారి-ఎస్ఆర్ఓ),టీ. సుజాత, సైంటిస్ట్- ఇ అండ్ డైరెక్టర్, ప్రశాంతి, హెచ్ఎంఆర్, బిఐఎస్ హైదరాబాద్ పాల్గొని బంగారం, వెండి పరీక్షలు, భారతీయ ప్రమాణాల ప్రకారం ఆభరణాల తయారీ విధానం పై శిక్షణనిచ్చారు. పరీక్షలపై లైవ్ డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసిన పాల్గొనేవారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సర్టిఫికేషన్ శిక్షణా కార్యక్రమం ద్వారా ఆభరణాల తయారీలో పాటించాల్సిన ప్రమాణాలు, చేయకూడని పద్ధతులపై స్పష్టత పొందారు. నిజామాబాద్ జిల్లా హాల్‌మార్కింగ్ తప్పనిసరి జిల్లాగా ఉండడంతో, ఈ శిక్షణ తయారీదారులకు హాల్‌మార్కింగ్ ఆభరణాల తయారీలో దోహదపడనుంది. జిల్లాలో వినియోగదారులు హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలనే కొనుగోలు చేయాలని, హెచ్‌యుఐడి నంబర్‌ను బిఐఎస్ సిఏఆర్ఈ యాప్‌లో తనిఖీ చేయడం ద్వారా శుద్ధతను నిర్ధారించుకోవాలని సూచించారు.

## తుఫాన్‌తో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పత్తి రైతులు జాగరూకతో వ్యవహరించాలన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం రైతు నేస్తం వీడియోకాన్ఫరెన్స్‌లో మట్లాడుతూ తీసిన పత్తి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తేమ శాతం 12 శాతం మించకుండా చూడాలని తెలిపారు. మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికి పత్తి కొనుగోళ్లు జరపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 72 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారన్నారు. తొలిరోజు 784 మంది రైతులకు చెందిన 1,623 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 28 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనాలు ఉన్నాయన్నారు.

## వరంగల్ ఎంజిఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి నియామకం

**ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు**

**హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త:** వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రిలో జరిగిన పలు సంఘటనల నేపథ్యంలో ఎంజిఎం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. ఇప్పుడు ఎంజీఎం హాస్పిటల్‌కి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీష్ చంద్రా రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ పి హరీష్ చంద్రారెడ్డిని ఎంజిఎం ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ మంగళవారం జీవో ఆర్‌టి నంబర్ 506ను జారీ చేశారు. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వేరే వారికి బాధ్యతలు అప్పగించాలని డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డిఎంఈ)ని ఉత్తర్వు లో ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు డాక్టర్ హరీశ్ చంద్రారెడ్డి ఎంజిఎం ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా కొనసాగుతారని ఇప్పటివరకు ఎఫ్ఎసి బాధ్యతల్లో ఉన్న డాక్టర్ కె కిషోర్‌కుమార్ ఆ బాధ్యతల నుంచి తొలగించాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## ఇంటర్ ప్రైవేటు విద్యార్థుల హాజరు మినహాయింపు ఫీజు తుదిగడువు నవంబరు 17

**హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త:** మార్చి 2026లో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు కళాశాలల చదువు లేకుండా హాజరయ్యే ప్రైవేట్ అభ్యర్థులకు హాజరు నుండి మినహాయింపు ఇస్తూ ఫీజు చెల్లించడానికి షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ప్రకటించింది. నవంబరు 17 వరకు రూ. 500 ఫీజుతో చెల్లించడానికి అవకాశం కల్పించారు. అపరాధ రుసుం రూ. 200తో నవంబరు 29 వరకు అవకాశం కల్పించినట్టు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి(సీవోఈ) జయప్రద బాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్ కాంబినేషన్లతో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఫీజు చెల్లించిన వారు మార్చి 2026లో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరు కావడానికి అనర్హులైతే, ఒకసారి చెల్లించిన రుసుము తిరిగి చెల్లించబడదని స్పష్టం చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి, దివ్య.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 256

**హైదరాబాద్ (బేగంపేట) అక్టోబరు 28, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 256 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 71 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 37 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 83 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 1 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.

# జాబ్ మేళాలతో 23,650 మందికి ఉద్యోగాలు

**సింగరేణి సిఎండి బలరాం**

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** సింగరేణి సామాజిక బాధ్యత కార్యక్రమా ల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ సిఎండి ఎన్ బలరాం తెలిపారు. ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు 7 పట్టణాల్లో నిర్వహించిన భారీ జాబ్ మేళా కార్యక్రమాల్లో 66,965 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా, వీరిలో 23,650 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల యువత ముంగిటకే హైదరాబాద్లోని ప్రముఖ కంపెనీలను తీసుకువచ్చి, వారి అర్హతలకు తగిన ఉద్యోగాలను ఎంచుకునే అరుదైన అవకాశాన్ని సింగరేణి కల్పిస్తోందన్నారు. నిరుద్యోగుల ముఖాలపై వెలుగులు నింపుతూ, సింగరేణి గత ఆరు నెలలుగా మెగా ఉద్యోగ మేళాల రూపంలో ఒక బృహత్తర యజ్ఞాన్ని నిర్విరామంగా కొనసాగిస్తోందని చెప్పారు. ఇంత భారీ ఎత్తున జాబ్ మేళాలు నిర్వహించడం, పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడం బహుశా ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఏడవ తరగతి మొదలు పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు గల వారితో పాటు, టెక్నికల్, మెడికల్, పారామెడికల్ తదితర అన్ని విద్యార్హతలు గల వారికి అర్హతలకు తగిన ఉద్యోగాన్ని ఎంచుకునే అవకాశం దక్కిందన్నారు హైదరాబాద్ ప్రాంతం నుండి ఒక్కొక్క జాబ్ మేళా కార్యక్రమంలో 100 నుండి 250 వరకు పలు ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయని వివరించారు.
ఈ జాబ్ మేళా కార్యక్రమాలను ఏప్రిల్ 21న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నుంచి ప్రారంభించారని, అప్పటి నుండి అది నిర్విఘ్నంగా కొననసాగుతోదని వెల్లడించారు. సింగరేణి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా మధిరతో పాటు, వివిధ తేదీల్లో భూపాలపల్లి, గోదావరిఖని, వైరా. హుజూర్‌నగర్, సత్తుపల్లి, బెల్లంపల్లిలో ఈ భారీ మెగా జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. సింగరేణి సంస్థ భవిష్యత్తులో కూడా సింగరేణి ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో నిర్వహించే సామాజిక బాధ్యత కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఉద్యోగ మేళాలకు సంస్థ సంపూర్ణ సహకారం అందించనుందన్నారు, త ద్వారా స్థానిక యువతకు, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి సింగరేణి తన వంతు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.
త్వరలోనే కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, ఆసిఫాబాద్ తదితర ప్రాంతాల్లో మెగా ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

# కమనీయంగా ఉద్దాల మహోత్సవం

**ఉత్సవానికి పోటెత్తిన భక్తజనం**
**స్వామివారి పాదుకలను తాకేందుకు బారులు తీరిన భక్తులు**



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 28, ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రతి రూపమైన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ కొండల్లోని కాంచనగుహాలో స్వ యంభూగా వెలసి పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామి ఉత్స వాలు వైభవంగా కొనసాగు తున్నాయి. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్స వాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్స వం అత్యంత వైభవంగా జరిగింది. వడ్డేమాన్ లోని ఉద్దాల కర్మాగారంలో దళితులు నియమనిష్ఠలతో కురు మర్తి స్వామి, పద్మావతి అమ్మవార్ల పాదుకలను తయారు చేశారు. పల్లమర్రి లోని మేదరులు తయారు చేసిన చాట ఉద్దాల మండపానికి రాగానే స్వామివారి పాదుకలను చాటలో ఉంచి ఉద్దాల మండపం ముందు ఉంచారు. అక్కడ నెల్లి వంశీయులు తొలి పూజ చేయగానే స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర చైర్ పర్సన్ సీత దయాకర్ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువ జన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ, దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పాదుకలు ఉన్న చాటను తలపై ఉంచుకునేందుకు ఒకరినొకరు పోటీపడ్డారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారి పాదుకలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అందంగా అలంకరించిన ట్రాక్టర్ పై స్వామి వార్ల పాదుకలను ఉంచి ఊరేంపుగా ఉద్దాల గుండుకు చేర్చారు. అక్కడ వేలాదిగా తరలివచ్చిన భక్తజనం శివసతుల నాట్యాలు, భక్తుల గోవింద నామస్మరణతో కురుమతి గిరులు పులకరించాయి. కొండ దిగువన జాతర మైదానంలో స్వామివారి పాదుకలను ఉంచిన ట్రాక్టర్ మూడు ప్రదక్షిణలు నిర్వహిం చారు. అనంతరం కొండపై గల స్వామివారి ఆలయానికి చేర్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉద్దాల మండపంలో స్వామివారి పాదుకలను ఉంచి భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక శాసన సభ్యులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక,డైరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువ జన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**టిఎన్‌జిఒ సెంట్రల్ అసోసియేషన్ కార్యవర్గం తీర్మానం**

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిఎన్‌జీవో సెంట్రల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం గత 22 నెలలుగా ఎదురు చూస్తూ అనేక పర్యాయాలు ముఖ్యమంత్రితో, మంత్రివర్గ ఉపసంఘంతో, అధికారుల కమిటీతో చర్చలు జరిపినప్పటికీ ముఖ్యమంత్రి, మంత్రులు స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ ఉద్యోగుల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉండటం శోచనీయమని సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఎస్.ఎం హుస్సేని ముజీబ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో కేంద్ర సంఘం భవనంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘం నేతలు తమ అస హనాన్ని ప్రదర్శించారు. కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం పెండింగ్ బిల్లులు నెలకు రూ. 700 కోట్లు ఉద్యోగ లోకానికి చెల్లిస్తామని చెప్పినప్పటికీ బకాయిలు ఇప్పటివరకు చెల్లించకుండా తాత్స ర్యం చేస్తున్న ఉద్యోగుల గోడును పెడచెవిన పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈహెచ్ఎస్ ఉద్యోగుల ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తామని చెప్పి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కమిటీతోనే పథకాన్ని ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు.
బకాయిపడ్డ 5 డిఏల గురించి అడిగితే కేవలం ఒక్క డిఏ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడం దారుణ మన్నారు. జూలై 1, 2023 నుండి అమలు చేయాల్సి న నూతన వేతన సవరణ మాట ఎత్తకపోవడం, ముఖ్యమంత్రి, యావత్ మంత్రిమండలి సభ్యుల ఆదేశాలను గౌరవించాల్సి న అధికారులందరూ ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారా అనే అనుమానం కలగకుండా ఉండాలంటే, సమస్య లను వెంటనే పరిష్కరించాలని మారం జగదీ శ్వర్, ముజీబ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ బిల్లులను యుద్ధప్రాతిపదికన క్లియర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలను తక్షణమే విడుదల చేయాలి, ఆరోగ్య రక్షణ పథకాన్ని (ఈహెచ్ఎస్) పూర్తి స్థాయిలో అమలుచేయాలన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పీఆర్సీ నివేది కను వెంటనే తెప్పించుకుని 51శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలన్నారు.
వివిధకారణాలతో సస్పెండ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టీఎన్జీవోలకు కేటాయించాలన్నారు. జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతుల కమి టీలను సకాలంలో ఏర్పాటు చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు.



పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు

## నేటి నుంచి సిపిగెట్-2025 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

**నవంబరు 1 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం**

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలు(సిపిజెట్)-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మా గాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాల క్యాంపస్, కాన్‌స్టిట్యూషనల్, అనుబంధ కళాశాలల క్యాంపస్‌లలో పిజి కోర్సులలో ప్రవేశాల కోసం సిపిజిఈటి-2025ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా నేటి నుంచి నవంబరు 1 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 2న అభ్యర్థులు తమ దరఖాస్తులో తప్పులను సరి చేసుకోవడానికి అవకాశం కల్పించారు. నవంబరు 2 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. నవంబరు 5నన వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. వెబ్ ఆప్షన్లుఇచ్చిన వారికి నవంబరు 9న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన వారు నవంబరు 11లోగా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు.

# ప్రయాణికుల భద్రతపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలి



మంగళవారం విడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**మొంథా తుఫాన్ సంసిద్ధతపై సమీక్ష నిర్వహించిన**
**దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ**

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 28, ప్రభాతవార్త :** ప్రయాణికులకు ఉత్తమ భద్రతను కల్పించే ప్రయత్నాలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మొంతాఖి తుఫాను పరిస్థితిని ఎదుర్కోవడానికి సంసిద్ధత దిశగా రైలు కార్యకలాపాల భద్రత, కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుండి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు మొత్తం 6 డివిజన్లైన సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రాబోయే మొంతా తుఫాన్ దృష్ట్యా అన్ని విభాగాల ప్రధానాధిపతులతోపాటు పాటు ముఖ్యంగా విజయవాడ, గుంటూరు డివిజన్లతో కూడా వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ తుఫానును ఎదుర్కో వడానికి రైల్వేలు తీసుకుంటున్న వివిధ చర్యలను సమీక్షించారు. వివిధ డిపోలలో రుతుపవనాల సంసిద్ధత కోసం చేసిన నిల్వల స్థితిని ఆయన సమీక్షిం చారు. వివిధ ప్రదేశాలలో తగినంత నిల్వలను మోహరించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను మార్గాన్ని నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్ఎఫ్) బృందాలతో సన్నిహితంగా వ్యవహరించి, ట్రాక్ మరియు రైలు కార్యకలాపాల భద్రతను నిర్ధారించడానికి ఈ విభాగంలో రైల్వే ప్రభావిత ట్యాంకుల స్థానాన్ని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రభావితమయ్యే విభాగాలలో ట్రాక్‌లపై పెట్రోలింగ్ ఉండేలా చూడాలని కూడా ఆయన ఆదేశించారు. వాస్తవ సమయ సమాచారాన్ని పొందడానికి అన్ని వంతెనలు, ప్రదేశాలలో స్టేషనరీ వాచ్‌మెన్‌లను కూడా నియమించాలని తెలిపారు.

**ఎంప్లాయి ఆఫ్ ది మంత్ అవార్డులను అందజేసిన జిఎం**

జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందికి 'ఎంప్లాయి ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డుగ్రహీతలలో స్టేషన్ మాస్టర్స్, లోకో పైలట్లు, పాయింట్స్ మ్యాన్, కీ మ్యాన్ వంటి వంటి వివిధ కేటగిరి లకు చెందినవారు ఉన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అవార్డు గ్రహీతలను అభినందించారు. వారి విధులను అత్యంత అంకితభావంతో నిర్వర్తించడంలో వారి నిబద్ధతను అభినందించారు. ఈ అవా ర్డులు ఇతర ఉద్యోగులను మరింత అప్రమత్తంగా ఉండటానికి మరియు రైలు కార్యకలాపాలలో సురక్షితంగా ఉండేలా నిజాయితీగా పనిచేయడానికి ప్రేరేపిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి, పత్తి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపుకలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, సిర్పూర్ నియో జకవర్గ శాసనసభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ కుమురం మాంతయ్య, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సుద్దాల దేవయ్య, కుడ్మెత విశ్వనాథ్‌లతో జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, ప్రాథమిక సహకార, గ్రామీణ అభి వృద్ధి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొను గోలుకు 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులకు మౌలిక వసతులు కల్పించాలని, తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు మాట్లాడుతూ ఈ సంవత్స రం యూరియా కొరత ఉన్నప్పటికీ వ్యవసాయ అధికారులు సమన్వయంతో వ్యవహరించి రైతులకు యూరియా సకాలంలో అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ అధికారి వెంకటి, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నామినేటెడ్ పదవుల్లో కమ్మ సామాజికవర్గానికి
### తగిన ప్రాధాన్యత ఇస్తా: సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు28:** నామినేటెడ్ పదవుల్లో కమ్మ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇస్తానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కమ్మ సంఘాల నాయకులు కలిశారు. కమ్మ సంఘాల నేతలు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అమీర్ పేట్ మైత్రి వనంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నేతలు కోరారు. నామినేటెడ్ పదవుల్లో సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కమ్మ సంఘాల సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. మైత్రీ వనంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుతోపాటు కమ్మ సంఘాల నాయకుల విజ్ఞప్తులపై సానుకూలంగా సీఎం స్పందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కమ్మ సంఘాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడల్లో గిరిజన విద్యార్థులు రాణించాలి
### సాంఘిక సంక్షేమ మంత్రి లక్ష్మణ్

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** అంతర్జాతీయ క్రీడల్లో గిరిజన విద్యార్థులు రాణించాలని సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ బోట్స్ క్లబ్ (సెయిలింగ్ అనెక్స్) వద్ద మంగళవారం గిరిజన కెనో స్ప్రింట్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ గిరిజన యువత సాధికారతకు, వారి సాంప్రదాయ క్రీడా వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ తరహా క్రీడల ద్వారా గిరిజన ప్రాంతాల నుండి క్రీడా ప్రతిభను వెలికితీసే అవకాశం కలుగుతుందని చెప్పారు. అలాగే అటువంటి వారికి జాతీయ స్థాయిలో ప్రోత్సాహం అందిస్తూ, నీటి క్రీడల కేంద్రముగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. జన జాతీయ గౌరవ వర్ష్‌లో భాగంగా, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ మార్గదర్శకత్వంలో వీటిని చేపట్టడం జరిగిందన్నారు. ఈ పోటీలను ఈ నెల 28 నుండి 30 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ట్రై కార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించి వారు ఎంచుకున్న క్రీడల్లో రాణించే విధంగా కోచ్ లు ప్రత్యేక కృషి చేయాలన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సభ్యసాచి ఘోష్ మాట్లాడుతూ గిరిజన యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యతను అలాగే జాతీయ గౌరవాన్ని పెంపొందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. క్రీడలలో ప్రాక్టీస్ పెర్ఫార్మెన్స్ ఎంతో అవసరం అని క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వటంతో గిరిజన పిల్లలు అనేక క్రీడల్లో దేశ అంతర్జాతీయ స్థాయిలో రాణించనున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సముజ్వాల తదితరులు పాల్గొన్నారు.



## గుర్రానికి రూ.15 కోట్లు, గేదెకు రూ.23 కోట్లు!
### రాజస్థాన్ పశుప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణ

**జైపూర్, అక్టోబరు 28:** రాజస్థాన్ లోని పుష్కర్ లో జరుగుతున్న పశు ప్రదర్శనకు దేశం నలుమూలల నుంచి రైతులు ఖరీదైన పశువులను తీసుకొచ్చారు. ఈ ప్రదర్శనలో ఓ గుర్రం, మరో గేదె అందరినీ ఆకర్షిస్తున్నాయి. వాటికి కళ్లు చెదిరే ధరలు పలకడమే దీనికి కారణం. చండీగఢ్ రైతు తీసుకొచ్చిన గుర్రం 'షాబాజ్' కు ఏకంగా రూ.15 కోట్లు రాజస్థాన్ కు చెందిన రైతు తీసుకువచ్చిన గేదె 'అన్మోల్' ధర రూ.23 కోట్లని నిర్వాహకులు చెబుతున్నారు. షాబాజ్ గుర్రం వయసు కేవలం రెండున్నరేళ్లు మాత్రమే ఈ ప్రదర్శనలో షాబాజ్ పలు బహుమతులు అందుకుంది. దీనికి రైతు చెబుతున్న ధర రూ.15 కోట్లు కాగా కొనుగోలుదారులు రూ.9 కోట్ల వరకూ ఇచ్చేందుకు సిద్ధపడ్డారట. అయితే, ఆ ధరకు తాను అమ్మబోనని రైతు స్పష్టం చేశాడు. ఈ గుర్రం బ్రీడ్ కు రూ.2 లక్షల ధర పలుకుతోంది. నలుపు రంగులో ఆకర్షణీయంగా ఉన్న అన్మోల్ గేదె ఈ ప్రదర్శనలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మారింది. ఈ గేదెకు రోజూ పాలు, నెయ్యిలతో పాటు డ్రైఫ్రూట్స్ పెట్టి పెంచుతున్నట్లు రైతు చెప్పారు. దీనిని రూ.23 కోట్లకు అమ్మకానికి పెట్టారు.

## కెన్యా కోస్తా ప్రాంతంలో కుప్పకూలిన చిన్నవిమానం
### పైలట్ సహా 11 మంది మృతి



**నైరోబీ, అక్టోబరు 28:** కెన్యా కోస్తాప్రాంతంలో ప్రయాణీకులతో వెళుతున్న చిన్నపాటి విమానం కుప్పకూలిపోయింది. దీనితో అందులో ప్రయాణిస్తున్న 11 మంది చనిపోయినట్లు వైమానిక అధికారులు ధృవీకరించారు. కిచ్వా టెంబూకు ఈ విమానం వెళుతోందని, మస్సాయ్ మారా నేషనల్ పార్కువద్ద ఉన్న ఈ ఎయిర్‌స్ట్రిప్‌కు వెళ్లేందుకు బయలుదేరిన ఈ విమానం కుప్పకూలి ఘోరం సంభవించింది. మంగళవారం ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ప్రముఖ పర్యాటక కేంద్రం డయానినుంచి బయలుదేరిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయింది. మొంబాసా ఎయిర్‌సఫారీ ఛైర్మన్‌జాన్ క్లీవ్ మాట్లాడుతూ మొత్తం పదిమంది ప్రయాణీకులు ఎనిమిది మంది హంగరీనుంచి ఇద్దరు జర్మనికి చెందినవారు విమానంలో ఉన్నారన్నారు. వీరితోపాటే కెన్యా పైలట్‌కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఈ విమానం కూలిపోవడానికి గల కారణాలపై దర్యాప్తుజరుగుతోందని ఆయన చెప్పారు. గతంలో ఆగస్టు నెలలో కూడా ఒక తేలికపాటి విమానం స్వచ్ఛంద వైద్య ఎన్జీఓ సంస్థ ఆమ్రేఫ్ నైరోబి సరిహద్దుల్లోనే కూలిపోయి ఆరుగురు చనిపోగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం జరిగిన ప్రయాణీకుల విమానం పర్యాటకప్రదేశాలను వీక్షించేందుకు తీసుకెళ్లేదిగా ఉందని పోలీసులు తెలిపారు.

# తెలంగాణ రైజింగ్ లక్ష్యసాధనలో విద్యుత్ శాఖ పాత్ర కీలకం

### ఎన్పీడిసిఎల్‌కు ప్రతిష్టాత్మక ఐఎస్ఓ సర్టిఫికెట్లు రావడం గర్వకారణం
### ఇందిరా గిరిజల వికాసంతో సోలార్‌పంప్ సెట్ల ద్వారా సాగునీరు
### మధిర నియోజకవర్గంలో రూ 43 కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు
### భూమిపూజలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మధిర, అక్టోబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యం నెరవేరాలంటే విద్యుత్ శాఖ చాలా కీలకమని, ప్రతిరంగ అభివృద్ధికి నాణ్య మైన విద్యుత్ సరఫరా కీలకమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం పరిధిలోని మధిర బోనకల్ మండలాల్లో రూ.15 కోట్ల అంచనాతో ఐదు విద్యుత్ సబ్స్టేషన్లకు, రూ.27.76 కోట్ల అంచనా తో మధిర పట్టణంలో అంతర్గత విద్యుత్ సరఫరా లైన్ల ఏర్పాటు పనులకు ఆయన మంగళవారం భూమి పూజలు చేశారు. సందర్భంగా నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ కు అత్యంత ప్రతిష్టాత్మకమైన రెండు ఐఎస్ఓ సర్టిఫికేట్లు దక్కినాయని ఈ రెండు సర్టిఫికెట్లను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా మధిర కార్యక్రమంలో ఎన్పీడీసియల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి డిప్యూటీ సీఎం అందచేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక యువతమైన కార్యచరణను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ రైజింగ్ 2047 సాధనలో విద్యుత్ శాఖ కీలకంగా మారిందని అన్నారు. ఈ క్రమంలో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని పాలసీలను రూపొందించుకొని ప్రభుత్వం లక్ష్యం దిశగా పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోభారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో కూడా మధిర పట్టణంలోని ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా దిశగా చర్యలు చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతిపాదిత కార్యచరణ చర్యలో భాగంగామధిర నియోజకవర్గ కేంద్రంలోపట్టణ ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని లక్ష్యంతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని అన్నారు.భూగర్భ విద్యుత్ లైన్లు వేయడం వల్ల మధిర పట్టణంలో వైర్లు వేలాడకుండా అందంగా కనపడుతుందని, కాలుష్యం, విద్యుత్ ప్రమాదాలు తగ్గుతాయని, రోడ్ల పక్కన మంచి చెట్లు పెంచుకోవచ్చని అన్నారు. భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో కూడా మధిర పట్టణంలోని ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మెరుగైన సేవలను అందించే దిశగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో విద్యుత్ అంబులెన్స్ లను ట్రాన్స్ ఫార్మర్ తో సహా అవసరమైన సామాగ్రి, టెక్నిషియన్స్‌తో ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఎన్పీడీసీఎల్ సంస్థ రెండు ఐఎస్ఓ (9001, 45001) సర్టిఫికేట్లను పొందడం ద్వారా కార్యనిర్వహణలో అత్యుత్తమ పనిప్రదేశాలలో, భద్రతపరంగా మైలు రాయి నిలుస్తుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## తిరుమలలో వైకుంఠద్వార దర్శనం
# 10 రోజులు యథాతథం

### టిటిడి అన్ని ఆస్పత్రులకు ఒకే డైరెక్టర్‌గా డా.జగదీశ్
### రూ.30కోట్లతో కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం
### ప్రొక్యూర్‌మెంట్ సెల్ అవకతవకలపై ఎసిబితో విచారణ
### టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు



మంగళవారం టిటిడి బోర్డు సమావేశంలో చైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ సింఘాల్, అదనపు ఇఒ చౌదరి

**తిరుమల, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలు జరిగే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది డిసెంబర్‌లో కూడా పదిరోజులపాటు వైకుంఠ ద్వారాలు తెరిచి భక్తులకు దర్శనం కల్పించేలా టిటిడి నిర్ణయించింది. వైకుంఠద్వార దర్శనాల టోకెన్ల జారీ విధానం అత్యంత పారదర్శకంగా నిర్వహిం చేందుకు కార్యాచరణ రూపొందించుకోనున్నారు.

తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో 30కోట్ల రూపాయలతో టిటిడి ఆలయాన్ని నిర్మించేం దుకు నిర్ణయించారు. మంగళవారం తిరుమల అన్నమయ్య భవనం లో టిటిడి ధర్మకర్తలమండలి సమావేశం జరిగింది. ఉదయం 10గంటలకు మొదలైన సమావేశం సాయంత్రం 6గంటల వరకు సుదీర్ఘంగా కొనసా గింది. ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చర్చించి తీసు కున్న నిర్ణయాలను టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్సిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవితో కలసి మీడియాకు వెల్లడించారు. తిరుమల ఆలయంలో అత్యంత పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి పదిరోజులా,రెండురోజులా అనే అనుమానాలకు చెక్‌పెడుతూ సామాన్యభక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా పదిరోజులపాటు వైకుంఠ దర్శనాలకు మొగ్గుచూపారు. డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి ఘడియలు మొదలవుతాయి. 31వతేదీ ద్వాదశితో బాటు 2026 నూతన సంవత్సరం జనవరి 8వతేదీ వరకు వైకుంఠ ద్వారాలు తెరచి ఉంచుతారు.

పదిరోజులపాటు పవిత్రమైన వైకుంఠద్వారాలను తెరచి ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఐదువేల ఆలయాల నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. దేశంలోని అన్ని టిటిడి ఆలయాల్లో అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తారు. కడపజిల్లా ఒంటిమిట్టలో 37కోట్ల రూపాయలతో వసతి సముదాయం నిర్మాణానికి ఆమోదం. మరో 3కోట్ల రూపాయ లతో ఒంటిమిట్టపవిత్ర వనం నిర్మాణానికి ఆమోదించారు. టిటిడి గోశాల నిర్వహణను గోసంరక్షకులకు అప్పగించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పా టుచేశారు.

చిత్తూరుజిల్లా కాణిపాకం వరసిద్దివినాయకస్వామి కొలువైన చోట 25కోట్ల రూపాయలతో టిటిడి అతిథిగృహం, కల్యాణ మండపాలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. సాధ్యమైనంతమంది ఎక్కువమంది భక్తులకు పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలు చేయించేం దుకు ఇదివరకు లాగే పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలకే ఆమోదం తెలిపారు. టిటిడి ప్రొక్యూర్‌మెంట్ సెల్‌లో భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించడంతో ఏసిబితో విచారణ చేయించాలని బోర్డు నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో టిటిడి కొనుగోలుచేసిన అన్ని వస్తువుల్లోనూ భారీగా అవినీతి అక్రమాలు జరిగాయనేది బోర్డు నిర్ధారించింది. ఆ అక్రమాలపై సిబిఐతో సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించేలా చూస్తామన్నారు.

టిటిడి వైద్యవిభాగంలో అన్ని ఆస్పత్రు లను మరింతగా పారదర్శకంగా నిర్వహిం చేందుకు ఒకే డైరెక్టర్‌క్రిందకు తీసుకు రానున్నా మన్నారు. ప్రస్తుతం బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌ను అన్ని ఆస్పత్రుల డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ అనుమతికి సిఫార్సు చేశారు. అం తకుముందు నవంబర్ 17నుండి 25వరకు జరిగే తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మో త్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

## బియ్యం ఎగుమతులపై వ్యవసాయ వర్సిటీలో మేధోమథనం
### ఎగుమతులతోనే బియ్యం అధిక నిల్వల సమస్యకు పరిష్కారం

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నానాటికి వరి ఉత్పత్తులు పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక వినియోగం, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా మరియు కేంద్రానికి కేటాయించిన కోటా పోను దాదాపు 50 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు మిగులుతున్న నేపథ్యంలో వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపై మంగళవారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రి హబ్‌లో ఒక మేధో మధన సదస్సు జరిగింది. పిజెటిఎయూ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో పౌరసరఫరాల కమిషనర్ లీ. స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, పౌరసరఫరాల శాఖ సంచాలకులు హనుమంత్ కొండిబా, అదనపు సంచాలకులు రోహిత్ తో పాటు పిజెటిఎయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, పిజెటిఎయూ పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ బియ్యం ఎగుమతుల విశ్లేషకులు మరియు వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందు మహంతి, ప్రముఖ బియ్యం ఎగుమతిదారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రపంచం మొత్తం మీద ఆరు కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరుగుతుండగా అందులో అత్యధికంగా భారతదేశం వాటా 40 శాతంగా ఉందని సదస్సులో వక్తలు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రపంచ బియ్యం దిగుమతుల్లో అత్యధికంగా ఫిలిప్పైన్స్ దేశం 10 శాతం దిగుమతులు చేసుకుంటుందని తెలిపారు.

## దివ్యాంగుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం



### కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు : బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 28:** దివ్యాంగుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, రూ.4 వేల నుంచి రూ. 6 వేలకు పెన్షన్ పెంపు చేస్తామని చెప్పి అమలు చేయకుండా మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దివ్యాంగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక ఉపకరణాల పంపిణీ, ప్రత్యేక ఉపాధి కోటా వంటి హామీలు గాలిలో కలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు పొందేలా బీజేపీ కృషి చేస్తోందని భరోసా కల్పించారు. అదేవిధంగా మోడీ ప్రభుత్వం దివ్యాంగుల కోసం చేసిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, హియరింగ్ ఎయిడ్లు వంటి ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేస్తోందని అన్నారు. దివ్యాంగుల ఉపాధి అవకాశాల విస్తరణ, కేంద్ర ప్రభుత్వ ఉద్యో గాల్లో 4 శాతం రిజర్వే షన్ అమలు చేస్తోంద న్నారు. నేషనల్ హ్యాండి క్యాప్డ్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణ సహాయం అందిస్తోందని వివరించారు. దివ్యాంగుల హక్కులను కాపాడగల పార్టీ బీజేపీ ఒక్కటేనని రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో దివ్యాంగులు బీజేపీకి మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పే సమయం ఇదేనని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం రబీ సీజన్ కు ఫాస్ఫేటిక్ పొటాషిక్ ఎరువులపై పోషక ఆధారిత సబ్సిడీ రేట్లను నిర్ధారించిన నిర్ణయం దేశవ్యాప్తంగా రైతులకు గొప్ప ఉపశమనం కలిగించే చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. కేంద్రం సుమారు రూ.37,952.29 కోట్ల బడ్జెట్ కేటాయించడం ద్వారా మోడీ సర్కార్రైతు పక్షపాతి, రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించింది. ఈ నిర్ణయంతో డీ.ఏ.పీ, ఎన్పీకేఎస్ వంటి ఎరువులు రైతులకు సరసమైన ధరలకు సులభంగా లభిస్తాయి. రాబోయే రబీ సీజన్లో ఎరువుల కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం సమయానికి చర్యలు తీసుకోవడం ప్రశంసనీయం. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని, వారి శ్రమకు గౌరవం చేకూరేలా, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేలా కృషి చేస్తోంది. కేంద్రం ప్రతి సీజన్‌లో రైతుల అవసరాలను ముందే అంచనా వేసి ఎరువుల సబ్సిడీని నిర్ణయిస్తూ పెంపొందిస్తూ వస్తుందన్నారు. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం బాధాకరం,పల్లెల్లో కోతలు జోరుగా సాగుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు తమ ధాన్యం అమ్ముకోలేక,తీవ్ర ఆందోళనలో ఉన్నారని, కేంద్రం రైతులకు సబ్సిడీ ఎరువులు అందించగా, రాష్ట్ర మాత్రం రైతుల పంట కొనకుండా వారిని కష్టాల్లోకి నెడుతోంద న్నారు. రైతుల శ్రేయస్సు,వ్యవసాయ అభివృద్ధి, వ్యవసాయ రంగంలో స్థిరత్వం మోడీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతుంద న్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతు ద్రోహి విధానాలతో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఉపఎన్నికేగా అని ఉదాసీనత వద్దు
### మైనారిటీ ముఖ్యనేతలతో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త :** ఉప ఎన్నికేగా అని ఉదాసీనత వద్దని జూబ్లీహిల్స్‌లో ప్రచారం విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చూపొద్దని, కాంగ్రెస్ విజయం సాధించేందుకు అందరూ కష్టపడి పనిచేయాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ హితవు చెప్పారు. మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ మైనార్టీ ముఖ్య నేతలతో మహేష్ కుమార్ గౌడ్ కీలక సమావేశం జరిగింది సమావేశంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఇంచార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్,వివేక్ వెంకట్ స్వామి,ఎపిసిసి సెక్రటరీ విశ్వనాథన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్‌లు,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నాయకులందరూ ఐక్యంగా కృషి చేసి అధిక మెజార్టీ తీసుకురావాల న్నారు. నేతలు కేవలం 20 నుంచి 25 మంది కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరునూ కలసి ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను వివరించి ఓటు అడగాలని కార్యాచరణ ఇచ్చారు. బిఆర్‌ఎస్‌కు మద్దతుగా బిజెపి బలహీన అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలిపారని ఆయన గుర్తుచేశారు. బిఆర్‌ఎస్‌కు ఓటువేస్తే బిజెపికి ఓటువేసినట్లే అని ఓటర్లలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పెద్ద సంఖ్యలో అనుచరులతో తిరుగుతూ హడావుడి చేయొద్దు అని సూచించారు.

## మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల నూతన భవనం నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు28:** రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలోని మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం నిర్మాణం కోసం విద్యాశాఖ రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు ఇస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 31వ తేదీన జరిగిన మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన విషయం తెలిసిందే. తాజాగా ఆ పాఠశాల నూతనం నిర్మాణం కోసం విద్యాశాఖ రూ.10 కోట్లు మంజూరు చేసింది.

# సేవ్ ఫిల్మ్ ఛాంబర్
### చిత్ర ప్రముఖుల కొవ్వొత్తుల ర్యాలీ

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త :** సేవ్ ఫిల్మ్ ఛాంబర్ పేరుతో సినీ ప్రముఖులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఫిలిం ఛాంబర్ వద్ద ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌ను చిత్ర పరిశ్రమకు సంబంధించి తప్ప, వేరే వాటికి ఉపయోగించకూడదని సేవ్ ఫిలిం ఛాంబర్, బ్రింగ్ బ్యాక్ ద గ్లోరీ పేరుతో హైదరాబాద్‌లో సినీ ప్రముఖులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ ఫిల్మ్ ఛాంబర్‌ను పూర్తిగా చిత్రపరిశ్రమ అవసరాల కోసమే ఉపయోగపడాలని డిమాండ్ చేశారు. ఆనాడు మద్రాసు నుంచి తెలుగు చలనచిత్ర పరిశ్రమను హైదరాబాదుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఫిలింనగర్ సొసైటీలో ఫిల్మ్ ఛాంబర్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. దీన్ని సక్రమంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత చిత్ర పరిశ్రమదేనని తెలిపారు. మురళీ మోహన్ మాట్లాడుతూ చైన్నై నుంచి హైదరాబాదు చిత్ర పరిశ్రమ రావటానికి ఉద్దేశించి ఫిల్మ్ ఛాంబర్‌ను ఇచ్చారన్నారు. ఫిల్మ్ ఛాంబర్ ఏర్పడి ఇప్పటికి నలభై ఏళ్లు అవుతోందని, దీన్ని చిత్రపరిశ్రమకు కోసం తప్ప వేరే వాటికి ఉపయోగించకూడదన్నారు. ఫిలిం ఛాంబర్ అభివృద్ధిపై సినీ పెద్దలు అందరూ కలిసికట్టుగా ఉమ్మడి నిర్ణయం తీసుకుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నటులు. నిర్మాతలు శివాజీ రాజా, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, ఏడిద రాజా, బసిరెడ్డి, విజయేందర్ రెడ్డి, నరసింహారావు, శివ నాగేశ్వర రావు, చంటి అడ్డాల రవీంద్రనాథ్‌ఠాగూర్, మద్దినేని రమేష్ బాబు, కస్తూరిశ్రీనివాస్, జీవీమోహన్, హేమజిల్లోజు తదితరులు హాజరయ్యారు.

## కాంగ్రెస్ హయాంలో నిలిచిన ప్రాజెక్టు పనులు
### రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత
### జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా పాలమూరులో పర్యటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు నిలిచిపోయాయని, 80శాతం పూర్తైన ఉదండాపూర్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తారో లేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. మంగళవారం జాగృతి జనం బాట కార్యక్రమం పాలమూరు జిల్లాలో భాగంగా జడ్చర్ల మండల పరిధిలోని ఉదండాపూర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత రైతులకు పరిహారం చెల్లింపులు అన్ని పార్టీలు విఫలమయ్యాయని మానవత దృక్పథంతో భూ నిర్వాసితుల ప్యాకేజీ పెంపు పై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని పేర్కొన్నారు. ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే తాము నష్టపోయినా సరే కానీ ఉమ్మడి పాలమూరు జిల్లా రంగారెడ్డి జిల్లా రైతులు బాగుపడతారని ఆలోచించి ఉదార స్వభావంతో భూములు ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు 80% పూర్తయ్యాయని.. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాగానే పనులు పూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. ఇక్కడ పనులు ఆపేసి నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టులను ప్రారంభించారని ఇక్కడ 10శాతం డబ్బులు కేటాయిస్తే ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావడంతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లా భూముల సాగుకు నీరు అందేవని తెలిపారు. భూ నిర్వాసితుల చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించడంలో ప్రభుత్వం వెనుకాడడం సరైన పద్ధతి కాదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ ఏ సమయంలో ఇస్తారో ఆ సమయంలో ఉన్న భూముల ధరల ఆధారంగా వారికి డబ్బులు చెల్లించాలని ప్రభుత్వం మానవత దృక్పథంతో ఆలోచించి పరిహారం చెల్లించాలని కోరారు.

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 28.10.2025

భారత ఎన్నికల సంఘంచే కేరళ రాష్ట్రం గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా ఉండి నిచ్చెన గుర్తు రిజర్వ్ కాబడిఉన్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (పార్టీ పేరు)ని రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి అదే నిచ్చెన గుర్తుతో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ చేయుటకు ఆ పార్టీ అధ్యక్షుడు శ్రీ కే.ఎం.ఖాదర్ మొహిఉద్దీన్ నేషనల్ ప్రెసిడెంట్ గారు అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వబడినది. ఈ పార్టీలో (1) శ్రీ: మహమ్మద్ షకీల్ స్టేట్ ప్రెసిడెంట్ గారు. (2) శ్రీ: షేక్ ముజాహిద్ స్టేట్ జనరల్ సెక్రటరీ. (3) శ్రీ: సయ్యద్ మనూర్ అలీ స్టేట్ జనరల్ సెక్రటరీ గారు. (4) శ్రీ: మహమ్మద్ అన్వర్ మొహియుద్దీన్ జనరల్ సెక్రటరీ. (5) శ్రీ: షేక్ ఖాదర్ పాషా జనరల్ సెక్రటరీ. (6) శ్రీ: అహ్మద్ బిన్ అలీ అల్ కాసెరి కోశాధికారి గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు. పార్టీ కేంద్ర కార్యాలయం: క్వాయిద్ ఎ మిల్లత్ మంజిల్, నెం.36, మరైక్కాయర్, లెబ్బై స్ట్రీట్ చెన్నై - 600001, తమిళనాడు మరియు పార్టీ రాష్ట్ర కార్యాలయం: 2-2-34/1/B, ఎదురుగా విశాల్ మెగామార్ట్ ఎదురుగా, అంబర్‌పేట్, రామంతపూర్, హైదరాబాద్-500013 తెలంగాణ స్టేట్. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, టీజీపీఎస్ భవనము, ఎసి గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజులలోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలేమీ రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల ప్రాతిపదికగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (పార్టీ పేరు)ను ఒక రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేయుటకూ నిచ్చెన గుర్తును ఆ పార్టీకి కేటాయిస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతుంది.

సం/-. కే.ఎం.ఖాదర్ మొహిఉద్దీన్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (పార్టీ పేరు).

# 'ది గ్రేట్ ప్రి వెడ్డింగ్ షో' అందరికీ నచ్చుతుంది

## ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తిరువీర్



వెర్సటైల్ యాక్టర్ తిరువీర్, టీనా శ్రావ్య జంటగా నటించిన చిత్రంది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' , పప్పెట్ షో ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంయుక్తంగా సందీప్ అగరం, అశ్మితారెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కల్పనా రావు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నవంబర్7న ఈ మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, గ్లింప్స్, టైటిల్ పోస్టర్లు సినిమాపై అంచనాలు పెంచేశాయి. ఈ క్రమంలో మంగళవారం నాడు చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కి దర్శకులు కరుణ కుమార్, యదు వంశీ, ఆదిత్య హాసన్, రామ్ అబ్బరాజు, సన్నీ, దుశ్యంత్, ఉదయ్ గుర్రాల, రూపక్, తేజ, నంద కిషోర్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలోదర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ, తిరువీర్‌ను నేను ఓ నాటకంలో చూశాను. నేను మూవీ తీస్తే తిరువీర్‌కి పాత్ర ఇవ్వాలని ఫిక్స్ అయ్యాను..తల్లి చనిపోయినా కూడా తిరువీర్ ఆ విషయాన్ని మాకు చెప్పకుండా షూటింగ్‌లో సీన్ చేశాడు. అలా తిరువీర్ మాకు ఎంతో సహకరించారు. ఈ చిత్రం వంద శాతం బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందిఅని అన్నారు.

అంబాజీపేట దర్శకుడు దుశ్యంత్ మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ట్రైలర్ నాకు చాలా నచ్చింది. ఎవరైనా ఏదైనా కొత్త కాన్సెప్ట్ పట్టుకొస్తుంటే వారికి ఫస్ట్ ఛాయిస్‌గా తిరువీర్ నిలుస్తున్నారు. దర్శక, నిర్మాతలకు మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను. నవంబర్ 7న ఈ సినిమాను అందరూ చూడండి అని అన్నారు.దర్శకుడు ఉదయ్ గుర్రాల మాట్లాడుతూ, తిరువీర్ కోసమే ఇంత మంది దర్శకులు ఈ రోజు ఇలా వచ్చారు. తిరు ఎప్పుడూ మంచి కథల్ని ఎంచుకుంటూ ఉంటారు. పరేషాన్ దర్శకుడు రూపక్ మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో మూవీని నేను ఆల్రెడీ చూశాను. చాలా అద్భుతంగా ఉంటుంది. స్వీట్, సింపుల్, సెన్సిబుల్, ఫన్ రైడ్‌గా సినిమా ఉంటుంది.. ఫ్యామిలీ అంతా కలిసి చూసి హాయిగా నవ్వుకునేలా సినిమా ఉంటుంది. తిరువీర్‌కు ఈ మూవీతో మంచి సక్సెస్ వస్తుంద్ధి అని అన్నారు.జోహార్ దర్శకుడు తేజ మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో చిత్రంలో చాలా మంది కొత్త వాళ్లే కనిపిస్తున్నారు. కొత్త నిర్మాతలకు ఈ చిత్రంతో డబ్బులు బాగానే వస్తాయి. నవంబర్ 7న ఈ చిత్రం రాబోతోంది. అందరూ తప్పకుండా సినిమా చూసి కొత్త వాళ్లని ఎంకరేజ్ చేయండి అని అన్నారు. దర్శకుడు నంద కిషోర్ మాట్లాడుతూ,జార్జి రెడ్డి టైంలోనే నాకు తిరువీర్ తెలుసు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. ఆయన ప్రతీ సినిమాలో, ప్రతీ పాత్రలో సహజత్వం ఉట్టి పడుతుంది.. హీరో తిరువీర్ మాట్లాడుతూ,మా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో కోసం ఇంత మంది దర్శకులు వచ్చారు. నేను ఇంత మంది మంచి ఫ్రెండ్స్‌ను దర్శకుల రూపంలో సంపాదించుకున్నందుకు ఆనందంగా ఉంది.హీరోయిన్ టీనా శ్రావ్య మాట్లాడుతూ ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ట్రైలర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఇంత మంచి దర్శకులంతా కూడా మా ఈవెంట్‌కు రావడం ఆనందంగా ఉంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్ని ఆడియెన్స్ ఎప్పుడూ సపోర్ట్ చేస్తారు. మేం ఎంతో ఇష్టపడి, కష్టపడి ఈ మూవీని చేశాం. మా టీం అందరికీ థాంక్స్. నవంబర్ 7న థియేటర్లోకి రాబోతోంది. మంచి కంటెంట్‌తో మంచి ఎంటర్టైన్మెంట్ ఇచ్చేలా మా చిత్రం ఉంటుంది అని అన్నారు. .మాస్టర్ రోహన్ మాట్లాడుతూట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్క దర్శకుడికి థాంక్స్. అందరినీ హాయిగా నవ్వించేలా మా చిత్రం ఉంటుంది. నవంబర్ 7న మా సినిమాను అందరూ చూడండిఅని అన్నారు.సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ. ఈవెంట్‌కు వచ్చిన గెస్టులందరికీ థాంక్స్. నాకు ఈ అవకాశం ఇచ్చిన రాహుల్‌కి, సందీప్ కి, తిరువీర్‌కి థాంక్స్. సినిమా గురించి ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడతాన్ను అని అన్నారు .నటి యామిని మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ట్రైలర్ నాకు చాలా నచ్చింది. ఇదే నాకు తొలి చిత్రం. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు రాహుల్ కి, నిర్మాతలకు థాంక్స్. నవంబర్ 7న మా చిత్రం రానుంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి అని అన్నారు.




రితికా నాయక్

# సంచలన ఫ్రాంచైజీలో .. ఆగ్రా బ్యూటీ సోనాల్ చౌహాన్



ఆగ్రాబ్యూటీసోనాల్ చౌహాన్ కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఒకేలా సాగుతోన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, బెంగాలీ, తమిళ్ అంటూ నాలుగుభాషల్లోనూ నటించింది. కానీ ఏ భాషలోనూ నిల దొక్కు కోలేదు. ఎక్కడ అవకాశం వస్తే అక్కడకు వెళ్లి పని చేయడం త!ప తనకంటూ ఓ భాష ఉందని నిరూపించుకోలేకపోయింది. అవకాశాలు వస్తున్నా? వాటితో పాటు చిన్నా చితకా విజయాలు అందుకుంటున్నా? స్థిరంగా మాత్రం పని చేయలేకపోతుంది. అయితే ఏడాది కాలంగా ఆ చిన్నపాటి అవకాశాలు కూడా లేవు. చివరిగా గతఏడాది రిలీజ్ అయిన డార్డ్ లో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో సినిమా చేయలేదు. ఈ నేపథ్యంలో అమ్మడుఏకంగాబంపర్‌ఆఫర్ అందుకుంది.సంచలన 'మీర్జాపూర్' ఫ్రాంజైజీలో భాగమవ ్రతుంది. 'మీర్జాపూర్':దిఫిల్మ్ చిత్రంలో భాగమైనట్లు వెల్లడించింది.అద్భుతమైన ఆటను మార్చే ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉందంది. ఈ సినిమాలో నటించడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగాదర్శక,నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపింది. గుర్మీత్ సింగ్ దర్శకత్వంలో పర్హాన్ అక్తర్, రితేష్ సిద్వానీ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'మీర్జాపూర్' కు ప్రత్యేకమైన అభిమానులున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఫాలోయింగ్ ఉన్న సిరీస్ ఇది. పంకజ్ త్రిపాఠీ, అలీ జాఫర్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠీ నటించిన మీర్జాపూర్ ఫ్రాంచైజీ మూడు సీజన్లు పెద్ద విజయం సాధించాయి. ఇప్పుడిదే సిరీస్ ను గుర్మీత్ సింగ్ సినిమా గా తెరపైకి తేవడం విశేషం. మరి ఈ కథను ఒకే సినిమా గా రిలీజ్ చేస్తాడా? రెండు భాగాలుగా రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. సినిమాలో వెబ్ సిరీస్ పాత తారగణంతో పాటు, కొత్త నటీనటులు నటిస్తున్నారు. దీనిలో భాగంగా వెబ్ సిరీస్ లో సోనాల్ చౌహాన్ లేకపోయినా? సినిమా లో అవకాశం అందుకో గలిగింది. మీర్జాపూర్ ప్రాంతంలో అధికార పోరాటాలు, నేరస్థుల అండర్ వరల్డ్ కథకు కొనసాగింపుగా ఈ కథ ఉంటుంది. ఇదొక క్రైమ్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అవి పూర్త యిన వెంటనే పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయి.

# మాస్ మహారాజా రవితేజ 'మాస్ జాతర' ట్రైలర్ విడుదల



మాస్ మహారాజా రవితేజ అభిమానులతో పాటుఅందరూఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మాస్ జతర సినిమా ట్రైలర్ ఎట్టకేలకు విడుదలైంది. రవితేజ నుండి అభిమానులు, ప్రేక్షకులు ఆశించే అసలుసిసలైన మాస్ వేడుకలా ఈ ట్రైలర్ ఉంది. రైల్వే పోలీస్ అధికారిగా రవితేజ తనదైన శైలిలో ఒదిగిపోయిన తీరు కట్టిపడేసింది.రవితేజ అంటేనే ఉత్సాహంతో తెర వెలిగిపోతుంది. ఆ ఉత్సాహం 'మాస్ జాతర' ట్రైలర్ లో అడుగడుగునా కనిపించింది. భారీ యాక్షన్ సన్నివేశాలు, అదిరిపోయే పంచ్ డైలాగ్‌లతో మాస్ మహారాజా అభిమానులు కోరుకునే మాస్ విందులా ఈ ట్రైలర్ ను మలిచారు.కథానాయకుడు, ప్రతినాయకుడు మధ్య ఉత్కంఠభరితమైన సంఘర్షణ నేపథ్యంలో ట్రైలర్ ను రూపొందిన తీరు ఆకట్టుకుంది. వాణిజ్య అంశాలతో నిండిన పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రానికి హామీ ఇచ్చేలా ఖిమాస్ జతరఖి ట్రైలర్ ఉంది. నవీన్ చంద్ర మరోసారి శక్తివంతమైన ప్రతినాయక పాత్రలో మెరిసి, రవితేజను ఢీకొట్టే పాత్రలో మెప్పించారు. ట్రైలర్ కు మరింత ఆకర్షణ మరియు తాజాదనాన్ని జోడిస్తూ, కథానాయిక శ్రీలీల తెరపై ఎంతో అందంగా కనిపించారు. ఆమె మొదటిసారి శ్రీకాకుళం యాసలో మాట్లాడినప్పటికీ, ఆ యాసను పూర్తిగా ఆస్వాదిస్తూ అద్భుతంగా పలికిన తీరు ఆశ్చర్యపరిచింది. రవితేజశ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ ట్రైలర్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది.

ఇప్పటికే పాటలతో ప్రేక్షకుల మనసు దోచుకున్న సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో, తన నేపథ్య సంగీతంతో ట్రైలర్ ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ వింటేజ్ మాస్ ఆరాకు సరిగ్గా సరిపోయేలా ఆయన సంగీతం ఉంది. భారీ పోరాట సన్నివేశాలు, కడుపుబ్బా నవ్వించే హాస్యం, అద్భుతమైన పాటలతో విందు భోజనం లాంటి చిత్రానికి ఖిమాస్ జాతరఖి హామీ ఇస్తోంది.

తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు, ఖిమాస్ జాతర చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రేక్షకులకు పూర్తి స్థాయి మాస్ విందుని అందించడానికి అక్టోబర్ 31న ఖిమాస్ జాతరఖి చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగుపెట్టనుంది.

చిత్రం: మాస్ జాతరతారాగణం: రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్రదర్శకత్వం: భాను భోగవరపు నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య,సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

# ప్రణవ్ మోహన్ లాల్ 'డియాస్ ఇరాయ్' విడుదల



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్ లాల్‌తనయుడిగా చిత్రసీమలో అడుగు పెట్టిన ప్రణవ్, అతి తక్కువ సమయంలో తనకంటూ ఒక స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. 'హృదయం'తో భాషలకు అతీతంగా ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించుకున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'డియాస్ ఇరాయ్'. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేస్తోంది.

కమల్ హాసన్ 'పుష్పక విమానం', 'నాయకుడు' నుంచి ధనుష్ 'రఘువరన్ బీటెక్' వరకు తెలుగులో శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేసిన పరభాషా సినిమాలు భారీ విజయాలు సాధించడంతో పాటు విమర్శకుల ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. అందువల్ల, 'డియాస్ ఇరాయ్' మీద ప్రేక్షకులతో పాటు బిజినెస్ వర్గాల్లో అంచనాలు ఏర్పడ్డాయి. 'హృదయం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రణవ్ మోహన్ లాల్ వరుసగా సినిమాలు చేయలేదు. సెలక్టివ్‌గా కథలు ఎంపిక చేసుకుంటూ వస్తున్నారు. ఖిభూత కాలంఖి, మమ్ముట్టి 'భ్రమ యుగం' చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ సదాశివన్, ఈ ఖిడియాస్ ఇరాయ్ఖిను తెరకెక్కించారు. మలయాళ, తమిళ భాషల్లో అక్టోబర్ 31న ఈ సినిమా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ డియాస్ ఇరాయ్ఖి మలయాళ వెర్షన్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు శ్రీ స్రవంతి మూవీస్ అధినేత రవికిశోర్. సుష్మితా భట్, జిబిన్ గోపీనాథ్, జయ కురుప్, మనోహరి జాయ్, అరుణ్ అజికుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన 'డియాస్ ఇరాయ్' తెలుగు వెర్షన్‌ను నవంబర్ తొలి వారంలో థియేటర్లలో విడుదల చేయనున్నారు. విభిన్న కథలతో తెరకెక్కిన 'ప్రేమలు', 2018, 'మంజుమ్మెల్ బాయ్స్', 'కొత్త లోక'వంటి మలయాళ సినిమాలకు తెలుగులో చక్కటి ఆదరణ లభించింది. ఆయా సినిమాలు తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆ జాబితాలో 'డియాస్ ఇరాయ్' కూడా చేరుతుందని చిత్ర బృందం భావిస్తోంది. ప్రణవ్ మోహన్ లాల్ హీరోగా రాహుల్ సదాశివన్ రచన, దర్శకత్వంలో రూపొందిన 'డియాస్ ఇరాయ్' చిత్రాన్ని నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సంస్థలపై చక్రవర్తి రామచంద్ర, ఎస్ శికాంత్ నిర్మించారు. ఈ చిత్రానికి క్రిస్టో జేవియర్ సంగీతం అందించారు

# జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మెలోడీ పాట విడుదల..



అందమైన ప్రేమ కథగా ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్‌ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం 'ఓ.. చెలియా' నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఓ.. చెలియా పోస్టర్లు, గ్లింప్స్, సాంగ్స్, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా మరో అందమైన ప్రేమ గీతాన్ని చిత్రయూనిట్ రిలీజ్ చేసింది.విలక్షణ నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా నాకోసం ఆ వెన్నెలఅంటూ సాగే లవ్, మెలోడీ పాటను టీం విడుదల చేయించింది. ప్రస్తుతం ఈ పాట శ్రోతల్నిఇట్టే కట్టిపడేస్తోంది. ఎంఎం కుమార్ బాణీ వినడానికి ఎంతో హాయిగా ఉంది. శివ సాహిత్యం, మేఘన, మనోజ్ గాత్రం హృదయానికి హత్తుకునేలా ఉంది. ఇక ఈ లిరికల్ వీడియోని చూస్తుంటే హీరో హీరోయిన్ల మధ్య ఉన్న ప్రేమను చాటేలా కనిపిస్తోంది.ఈ పాటను రిలీజ్ చేసిన అనంతరం జేడీ చక్రవర్తి మాట్లాడుతూ, 'ఓ.. చెలియా'నుంచి నా కోసం ఆ వెన్నెలఅనే ఓ ప్రేమ గీతాన్ని విడుదల చేశాను. ఈపాటచాలా బాగుంది. హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ బాగుంది. సినిమా కూడా బాగుంటుందని, పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ అని అన్నారు. ఈ చిత్రానికి సురేష్ బాలా కెమెరా వర్క్, ఉపేంద్ర ఎడిటింగ్ స్పెషల్ అట్రాక్షన్ కానుంది.త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.తారాగణం: నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి, అజయ్ గోష్, భోగిరెడ్డి శ్రీనివాస్, సారిపల్లి సతీష్, యశోద ఆర్ కొలిశెట్టి, సునీల్ రావినూతల, డార్లింగ్ దాస్ తదితరులు.సాంకేతిక బృందంబ్యానర్: ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవి ప్రొడక్షన్స్ నిర్మాత: రూపశ్రీ కోపూరుదర్శకుడు:నాగ రాజశేఖర్ రెడ్డి.

# పాన్‌ఇండియన్ థ్రిల్లర్ 'డకాయిట్'

## ఉగాది కానుకగా మార్చి 19న గ్రాండ్ గా రిలీజ్

అడివి శేష్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'డకాయిట్' లీడ్ క్యారెక్టర్స్‌ని పరిచయం చేసిన ఫైర్ గ్లింప్స్ రిలీజ్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ప్రేమప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.

మేకర్స్ తాజాగా డకాయిట్ రిలీజ్ డేట్ అప్డేట్ ఇచ్చారు. 2026 ఉగాది కానుకగా మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇంటెన్స్‌లుక్స్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. ఇప్పటికే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రం డకాయిట్ కావడం విశేషం.

అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ భారీ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు.



# 'ఆంధ్రా కింగ్ తాలూకా'

## చిన్ని గుండెలో సాంగ్ 31న రిలీజ్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్, యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రాకింగ్‌తాలూక. మహేష్‌బాబు పి దర్శకత్వ ంలో, ప్రముఖ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న గ్రాండ్‌థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

ఇప్పటికేవిడుదలైన సాంగ్స్, టీజర్ కి ట్రెమండస్‌రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ నువ్వుం టే చాలే ద్వారా రామ్‌తన సింగింగ్ డెబ్యూ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ పాట ప్రేక్షకుల మనసులను దోచుకుని బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. రెండవ పాట పప్పీ షేమ్ డిఫరెంట్వైబ్‌తో అదిరిపోయింది. ఈ సాంగ్ కి రామ్ స్వయంగా వాయిస్ ఇచ్చారు.ఈ రోజు మేకర్స్ థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. చిన్నిగుండెలో సాంగ్‌ని అక్టోబర్ 31న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ లో రామ్, భాగ్యశ్రీ క్లాసిక్ లవ్ మూమెంట్ అదిరిపోయింది.ఉపేంద్ర ఈ చిత్రంలో సూపర్ స్టార్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ ముఖ్యమైన పాత్రల్లో కనిపిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తున్నారు. సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్,తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ,విటివి గణేష్ సాంకేతిక సిబ్బంది:కథ,స్క్రీన్ ప్లే దర్శకత్వం: మహేష్‌బాబు పి.నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రొడక్షన్ హౌస్: మైత్రీ మూవీ మేకర్స్,సమర్పణ: గుల్షన్‌కుమార్,భూషణ్ కుమార్ .సిరీస్ ఫిలిమ్స్,సిఇఓ: చెర్రీసంగీతం: వివేక్,మెర్విన్,సినిమాటోగ్రఫీ: సిద్ధార్థనుని,ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్,ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరితుమ్మల, పిఆర్ఓ: వంశీశేఖర్,మార్కెటింగ్: ఫస్ట్ షో.

# కార్పొరేట్ అగ్రపీఠాలపై అతివలు



ప్రకటన సంస్థల్లో ఉద్యోగినులుగానే కాదు, నాయకత్వ స్థానాల్లోనూ మహిళల సంఖ్య పెరుగుతోంది అంటోంది అవ్తోర్. చెన్నైకి చెందిన ఈ సంస్థ 'బెస్ట్ కంపెనీస్ ఫర్ విమెన్ ఇన్' (బీసీడబ్ల్యుఐ) 10వ ఎడిషన్ నివేదికను తాజాగా ప్రకటించింది. అందులో ఈ పరిశీలన. ఇందుకుగానూ 120 సంస్థలపై సర్వే చేసింది. వీటిలో 20 శాతం మంది మహిళలే నిర్వహిస్తున్నారు. ఐటీ, పరిశోధన, ఆర్థిక సేవలకు సేవలు అందించే జీసీసీ రంగాల్లో నాయకురాలు సంఖ్య 22 శాతమంటోంది. వివిధ స్థాయి ఉద్యోగాల్లో మహిళల శాతం 35.7గా ఉండగా... ప్రొఫెషనల్ రంగంలో 44.6 శాతం కనిపిస్తోంది అలాగే ఐటీఈఎస్‌లో 41.7, ఫార్మాలో 25, ఎఫ్ఎన్‌జీజీ రంగంలో 23, తయారీ రంగంలో 12 శాతాల చొప్పున ఉద్యోగినులున్నారు. అయితే 20 శాతం మహిళలు ఉద్యోగాలు వదులుకునే పరిస్థితులూ కనిపించాయట. వేరేచోట మెరుగైన అవకాశాలు దొరుకు తుండటం, అనారోగ్య సమస్యలు, త్యాగం చేయడం పిల్లల దీని కారణాలను చెబుతోంది. వారి కెరియర్‌పరంగా ముందుకు దూసుకెళ్తున్న వారే ఎక్కువ అంటోంది. అవ్తోర్... మహిళలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్న టాప్ 10 సంస్థల జాబితా విడుదల చేసింది. వాటిల్లో యాక్సెంచర్, ఆకా ఎక్స్‌ప్రెల్ ఇండియా, వేదాంత, ఈవై, కేపీఎంజీ ఇండియా, మాస్టర్ కార్డ్, ఆప్టమ్, పీ అండ్ జీ, టెక్ మహీంద్రా, విప్రో వంటి సంస్థలున్నాయి. 2016లో మహిళలు నాయకత్వం వహిస్తున్న సంస్థలు 13 శాతమే: ప్రస్తుతం 20 శాతం పెరిగింది. 25 శాతంగా ఉంటే ఉద్యోగినుల సంఖ్య 35.7కి పెరిగింది. ఇది మహిళా సాధికారతకు నిదర్శనమే అంటారు అవ్తార్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సౌందర్య రాజేష్. □

# పఠనాసక్తితో రండి ..



**బ్రాండ్లను నిలబెట్టడంలో దిట్ట ఆమె. ఓ ప్రముఖ బహుళజాతి సంస్థకి చీఫ్ బ్రాండ్ అంబాసిడర్. అలాంటామె తాజాగా హైదరాబాద్‌లో ఓ లైబ్రరీని కలిగి ఉంది. 'కాస్త ఆ ఫోన్, రీల్స్ ని పక్కన పెట్టండి. మా గ్రంథాలయానికి రండి' అంటూ ఆహ్వానిస్తున్నారు.** అనురాధ సెహగల్ గూర్చి తెలుసుకుందాం..

వస్తువు లేదా బ్రాండ్‌కి విలువ పెంచేలా చేయడం నాకు ఇష్టమైన వ్యాపకం. కాబట్టే, మార్కెటింగ్ వైపు వెళ్లా. మాది అమృత్‌సర్, నాన్న ఆర్ఎన్ సెహగల్ ఆర్మీలో బ్రిగేడర్‌గా చేశారు. అమ్మ రాణి ఉపాధ్యాయురాలుగా చేశారు. ఆంత్రప్రెన్యూర్ కూడా. నాన్న వృత్తిరీత్యా దేశమంతా తిరిగా, కేంద్రీయ విద్యాలయాల్లోనే నా విద్యాభ్యాసం సాగింది. ఎకనామిక్స్‌లో బీఏ ఆనర్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్ మాస్టర్స్ పూర్తిచేశా. నా తొలి ఎయిర్‌టెల్, లెన్స్‌కార్ట్‌లోనే కాదు ఉద్యోగం హిందుస్థాన్ యూనిలీవర్‌లో, ఆపై వర్ల్‌పూల్, రెకిట్, కొన్ని మీడియా సంస్థలకీ పనిచేశా. 'ప్రతి ఫ్రెండూ అవసరమేరా ఎయిర్‌టెల్, క్యాంపెయిన్‌తోపాటు వీట్, వానిష్‌లను ముందంజలో నిలపడం వంటివెన్నో నాకు పేరు తెచ్చాయి. ప్రస్తుతం సమాచార సేవా సంస్థ... 'కోఫోర్జ్'కి చీఫ్ బ్రాండ్ అండ్ సస్టెయినబిలిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

**అమెరికాలో చూసి... ..**

నా పనికీ లైబ్రరీలకీ పొంతన లేదు. అయినా ఎందుకు భాగస్వామ్యమయ్యానంటే మా సీఈఓ సుధీర్ సింగ్ పేరే చెబుతా. ఆయన గతంలో అమెరికాకు వెళ్లినప్పుడు ప్రతి 10-15 కి.మీ.కీ గ్రంథాలయం ఉండడాన్ని గమనించారట. మన దేశంలోనూ అలాంటి ఏర్పాటు చేయాలనుకున్నారు. అందులో భాగంగానే గత ఏడాది ఫిబ్రవరిలో నోయిడాలో 'పీపుల్స్ లైను ప్రారంభించాం. నిజానికి దీనికోసం చాలా పరిశోధన చేశాం. అమెరికాతోపాటు మన దేశంలో ప్రభుత్వాలు, స్థానిక సంస్థల గ్రంథాలయాలను పరిశీలించాం. ఆరు నుంచి అరవయ్యేళ్ల వారికి అందరికీ నచ్చేలా అన్ని జానర్ల పుస్తకాల్లోనూ పాఠశాలలు, ప్రాంతాలకు వెళ్లి మరీ 'మా గ్రంథాలయానికి రండి' అని ఆహ్వానించాం. పత్రికలు, ప్రసార మాధ్యమాల్లోనూ ప్రచారం చేశాం. దీంతో పాఠకుల సంఖ్య పెరిగింది. ఇదే రోజుకు వేలల్లో మా లైబ్రరీని సందర్శిస్తున్నారు. ఈ స్ఫూర్తితో గురుగ్రామ్‌తో పాటు తాజాగా హైదరాబాద్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. భవిష్యత్తులో మరిన్ని పబ్లిక్ లైబ్రరీలు తీసుకొనే ఆలోచనలో ఉన్నాం.

**చదివేవాళ్లు పెరుగుతున్నారు... ....**

ఇప్పుడు వార్తలు, సాహిత్యం లాంటివి ఎవరు చదువుతున్నారు? కంప్యూటర్, ఫోన్ పట్టుకుంటే బోలెడు సమాచారం అనేవారికి మా సమాధానం ఒక్కటే ప్రజల్లో పఠనాసక్తి పెరుగుతోందనే. నోయిడాలో లైబ్రరీని ప్రారంభించినప్పుడు ఉచితంగా చదువుకోవచ్చు అని తెలిసిన వారే వచ్చేవారు. క్రమంగా యువత, వృద్ధులే కాదు టెకీలు, పిల్లలు కూడా అనుసరించారు. 'వారంతాల్లో మాల్స్, షికార్లకు పిల్లలను తీసుకెళ్లేవాళ్లం... ఇప్పుడు లైబ్రరీకి తీసుకొస్తున్నాం'అని చాలామంది తల్లిదండ్రులు మాతో చెప్పారు. నిజానికి చదవడమూ వ్యసనమే! కాకపోతే మంచిది. ఒకసారి పుస్తకం పట్టు కుంటే మళ్లీ మళ్లీ దానికేసి ఆకర్షితులవుతారు. దానికి ఉదాహరణ మా గురుగ్రామ్లోని లైబ్రరీనే, దాన్ని రోజుకు 20వేలమంది సందర్శిస్తున్నారు. హైదరాబాద్‌లో మాకు రెండు కార్యాలయాలు, ఒక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఉన్నాయి. వీటిని ప్రారంభించాక మా అభివృద్ధి పెరిగింది. అదీకాక ఢిల్లీ తరవాత ఇక్కడే మాకు ఎక్కువమంది ఉద్యోగులు ఉన్నారు. అలాంటి మావంతుగా ఏదైనా అందించాలని ఇక్కడ 'పీపుల్ లైబ్రరీ' ప్రారంభించాం. ఇక్కడివారికి నచ్చే చరిత్ర, చిన్నపిల్లల సాహిత్యం, జీవిత కథలు... ఇలా యువతకు సాయపడే 15 వేలకు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచాం. మా లక్ష్యం ఒక్కటే నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారాలి. ఈ అంది పుచ్చుకుని సమాజం ఎదుగుతోంటే చూడాలంటే! □

# చర్మ సంరక్షణ కోసం..

అందాన్ని సంరక్షించడంలో అత్యవసర నూనెల పాత్ర కీలకం. పెప్పర్మెంట్ నూనె కూడా దీనికి మినహాయింపు కాదు. మొటిమలు, చర్మం నిర్జీవంగా మారడం, పొడిబారి పోవడం.. వంటి పలు సౌందర్య సమస్యలకు దీని పరిష్కారం లభిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ నూనెను ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం..!

**ఆలివ్ నూనెతో..** గిన్నెలో మూడు టేబుల్స్పూన్ల ఉప్పు, రెండు చెంచాల ఆలివ్ నూనె, నాలుగు చుక్కల పెప్పర్మెంట్ ఆయిల్ వేసి బాగా కలుపుకోవాలి. దీనితో ముఖం, మెడను మృదువుగా, గుండ్రంగా రుద్దుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం స్క్రబ్లా పనిచేసి చర్మంపై చేరిన మురికి, మృత కణాన్ని తొలగిస్తుంది.



ఫలితంగా చర్మం అందంగా, ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

**జోజోబా ఆయిల్...**విటమిన్ 'ఇ' నూనె, జోజోబా ఆయిల్‌ను సమపాళ్లలో కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. దీనికి కొన్ని చుక్కల పెప్పర్మెంట్ నూనెను కూడా కలపాలి. ముఖానికి మొటిమలు ఎక్కువగా ఉన్న వారు ఈ మిశ్రమాన్ని రోజూ రాత్రి నిద్రపోయే ముందు నేరుగా మొటిమలపై రాయడం.. కొన్ని రోజుల్లోనే మొటిమలు తగ్గడం గమనించవచ్చు.

**కీరాదోసతో..** రెండు చెంచాల కీరాదోస తురుము, టీస్పూన్ పెప్పర్మెంట్ ఆయిల్ తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. రెండు టీస్పూన్ల గ్రీన్ క్లే (ఇది సూపర్ మార్కెట్లలో, ఆన్‌లైన్ స్టోర్స్‌లో లభిస్తుంది కూడా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ వేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే చర్మం తాజాగా మారుతుంది. అలా ఇది చర్మం జిడ్డుగా మారకుండా కూడా కాపాడుతుంది.



**పంచదారతో..** గిన్నెలో రెండు కప్పుల పంచదార, పావుకప్పు బాదం నూనె, టీస్పూన్ పెప్పర్మెంట్ నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఒకవేళ ఈ మిశ్రమం మరీ జారుడుగా కనిపిస్తే ఇంకాస్త పంచదార వేసి కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో భద్రపరచుకొని నెల రోజుల పాటు ఉపయోగించుకోవచ్చు. రోజూ స్నానం చేయడానికి ముందు ఈ మిశ్రమంతో శరీరాన్ని మర్దన చేసుకున్నప్పుడు చర్మం కోల్పోయిన తేమను తిరిగి పొందడంతో పాటు మృదువుగా తయారవుతుంది. ఇక్కడ చేర్చవన్నీ సహజమైన పదార్థాలే అయినా.. వాడే ముందు చర్మ తత్వానికి సరిపడుతుందో లేదో నిపుణులను సంప్రదించి తెలుసుకోవాలి. అలాగే ఒకసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిది. □

# మీపై అజమాయిషీ చేస్తున్నారా?

**భార్యాభర్తల్లో ఇద్దరూ సమానమే! కానీ కొంతమంది భర్తలు తమ భార్యలపై అజమాయిషీ చెలాయించాలని చూస్తారు. అలాంటి వారిని 'ఆల్ఫా హస్బెండ్' అంటారు.** అయితే ఇలాంటి వాళ్లతో గొడవకు దిగకుండా, అదే సమయంలో ఆత్మ గౌరవాన్ని కోల్పోకుండా సమస్యను పరిష్కరించుకోవాలంటున్నారు నిపుణులు.

**నచ్చజెప్పండి!**

భార్యాభర్తల మధ్య ఏ గొడవ ఉన్నా కలిసి కూర్చొని మాట్లాడుకుంటే



పరిష్కారమవుతుందంటారు. ఈ నియమం పెత్తనం చెలాయించే భర్త విషయంలోనూ వర్తిస్తుంది. అయితే ఎదుటివ్యక్తి కోపంలో ఉన్నప్పుడు ఏం చెప్పినా వారికి అర్థం కాదు. తను కాస్త ప్రశాంతంగా ఒకచోట కూర్చున్నప్పుడు.. తన ప్రవర్తన వల్ల మీరు ఎంత ఇబ్బంది పడుతున్నారో విడమరిచి చెప్పండి. ఇద్దరి మధ్య జరిగే ఈ వాదనల వల్ల ఇటు మీరు, అటు మీ పిల్లలు ఎంతలా సతమతమవుతున్నారో వాళ్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేయండి. అలాగే వారు ప్రవర్తించడానికి గల కారణాలేంటో కూడా నేరుగా అడగచ్చు. ఇలా మధ్య జరిగే సానుకూల చర్చనైనా మీ ఇద్దరిలో మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

**ఆత్మన్యూనత వద్దు....**

అకారణంగా ఎదుటి వ్యక్తి మనపై పెత్తనం చెలాయిస్తున్నారంటే ఆత్మన్యూనతకు గురవడం హాజం. ఇలాంటప్పుడే ఇతరులతో పోల్చుకోవడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం.. జరుగుతుంటాయి. ఇలాంటి ప్రతికూల భావనలు శారీరకంగా, మానసికంగా కుంగదీయడంతో అనుబంధానికి అవరోధాలుగా మారుతుంటాయి. ఈ ఆఫర్ మీపై మీరు నమ్మకం, గౌరవం దోల్పోకుండా ఉండేందుకు స్వీయ ప్రేమను పెంచుకోవడం ముఖ్యం, నచ్చిన పనులు చేయడం ఇష్టమైన వ్యాపకాలపై దృష్టి పెట్టడం వల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది.



**ఆధారపడద్దు! ..** ఆర్థిక స్వేచ్ఛ ఉన్న మహిళల కంటే, వ్యక్తిగతంగా, ఆర్థికంగా తమపై ఆధారపడే భార్యల విషయంలోనే చాలామంది భర్తలు పెత్తనం చెలాయించాలని చూస్తారు. ఈ కావలసిన పూచిక పుల్లలా తీసిపడేస్తుంటారు. వాళ్ల నిర్ణయాలను, అభిప్రాయాలను ఏమాత్రం గౌరవించరు. భర్తలతో వేగలేక, తాము పడుతోన్న బాధ ఎవరితో చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతుంటారు ఇలాంటి చాలామంది భార్యలు. నిజంగా మీలో ప్రతిభ ఉంటే, మిమ్మల్ని మీరు నిరూపించుకోగలరన్న నమ్మకం ఉంటే ఎవరికీ తలవంచాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు ఈ మీ చదువు, ట్యాలెంట్‌కి తగ్గ ఉద్యోగం వెతుక్కునే ప్రయత్నం చేయండి. ఒకవేళ వాళ్లు అడ్డుపడకుండా.. ఇద్దరి సంపాదన ఉంటే అది కుటుంబానికే మంచిదని సానుకూలంగా మాట్లాడే ప్రయత్నం చేయండి. ఇలా మీ కాళ్ల మీద మీరు నిలబడగలిగితే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం రెట్టింపవుతాయి. ఇది పరోక్షంగా అనుబంధానికీ మేలు చేస్తుందంటున్నారు నిపుణులు.

**ఆఖరీ ప్రయత్నంగా..!** ఎదుటివారు తమని తక్కువ చేసి చూస్తున్నారంటేనే కోపం కట్టలు తెంచుకోవడం సహజం. అలాగని ఎంత ప్రయత్నించినా వాళ్లు మారట్లేదని.. మీరూ వాళ్లలాగే గట్టిగా అరవడం, గొడవలు చేస్తే సమస్య పరిష్కారమవకపోగా.. మరింత జటిలమవుతుంది. కాబట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతే.. ఆఖరి ప్రయత్నంగా ఇద్దరూ కలిసి మానసిక నిపుణుల దగ్గరికి కౌన్సెలింగ్‌కి వెళ్లడం మంచిది. మీవారి ప్రవర్తనకు గల కారణాలేంటో తెలుసుకొని వాళ్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం, ఇద్దరితో మరోసారి మాట్లాడడం.. దీనివల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది. □

# మనసు బాలేదా .. టిఫిన్ చేయండి !

ఇంటిపనిలో పడి గృహిణులు, ట్రైంకి బస్ అందుకోవాలని ఉద్యోగినులు టిఫిన్ చేయటం మానేస్తుంటారు. ఒకటి రెండు రోజులు ఏ తేడా కనిపించలేదు. కానీ, రోజూ ఇలానే చేస్తే మానసిక సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. అల్పాహారానికీ, మనసుకీ సంబంధం ఏంటి? అనుకుంటున్నారా? ఉంది... రోజులో ఉదయపు ఆహారం కీలకమైందని. అయితే, అది శరీరానికి శక్తినివ్వటం ఒక్కటేకాదు, మనసుపైనా ప్రభావం చూపుతుంది. బ్రేక్ ఫాస్ట్ ఆలస్యంగా తిన్నా, అసలు తినక పోయినా చికాకు, ఆందోళన, కుంగుబాటు... వంటి వాటికి కారణం. కార్టిసాల్ స్థాయులను పెంచి జీవగడియారంపైనా ప్రభావం చూపుతుంది రాత్రిపూట తగ్గిన గ్లూకోజ్ స్థాయులను పునరుద్ధరించండి, తక్షణ శక్తిని అందిస్తుంది అల్పాహారమే వ మానసికంగా, భావోద్వేగాలపరంగా స్థిరంగా ఉండటానికీ దోహదపడుతుంది. అందుకే, ఆల్పాహారాన్ని తీసుకునేలా చూడండి. అది కూడా ఉదయం తొమ్మిదిలో చేస్తే పూర్తి మేలు. □



# పెరుగు జుట్టుకీ మంచిదే !

పెరుగు.. పొట్టకే కాదు.. జుట్టుకీ మంచిదే అంటున్నారు. పెరుగుతో కలిపి వేసుకునే కొన్ని హెయిర్ ప్యాక్స్ సమస్యలను పోగొట్టి వెంట్రుకలకు బలాన్ని మెరుపునూ ఇస్తాయి. ఇదిగో ఈ ప్యాక్స్ ఇలాంటివే.

పెరుగు, మినుములతో..

జుట్టు మృదువుగా, బలంగా కావాలంటే ఈ ప్యాక్ ప్రయత్నించండి.

**కావాల్సినవి :** మినుములు అర కప్పు, పెరుగు-అర కప్పు.

**ప్యాక్ ఇలా!** మినుముల్ని రాత్రంతా నానబెట్టుకొని ఉయాన్నే మెత్తటి పేస్ట్‌లాగా చేసుకోవాలి. ఈ పేస్ట్‌ని పెరుగులో వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు, జుట్టు మొత్తానికీ పట్టించాలి. అరగంట తర్వాత సాంపూతో తల స్నానం చేయాలి. ఈ ప్యాక్ వల్ల జుట్టు దృఢంగా మృదువుగా అందంగా తయారవుతుంది.



◆ ఈ ప్యాక్ వారానికి రెండుసార్లు వేసుకుంటే మెరుగైన ఫలితం ఉంటుంది. మీ జుట్టు చివర్లు చిట్లిపోయి ఎక్కువగా జుట్టు రాలి పోతోందా? అయితే ఈ ప్యాక్ ట్రై చేసి చూడండి.

**కావాల్సినవి :** ◆ గడ్డ పెరుగు-ఒక కప్పు, మెంతులు-పావు కప్పు.

ప్యాక్ ఇలా ! మెందుగా మెంతుల్ని మిక్సీ పట్టుకోవాలి. ఇలా తయారైన పొడిని పెరుగులో వేసి పేస్ట్‌లా అయ్యేంత వరకు కలుపుతూనే ఉండాలి. ఈ పేస్ట్‌ని జుట్టు మొదళ్ల నుంచి చివర్ల వరకు, మాడుకూ పట్టించి గంట పాటు అలాగే ఉంచుకోవాలి. తర్వాత షాంపూతో తలస్నానం చేసి కండిషనర్ రాసుకోవాలి.

ఈ ప్యాక్‌లో ఉపయోగించిన మెంతుల వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉండడంతో పాటు చివర్లు చిట్లిపోవడాన్ని తగ్గిస్తుంది. అలాగే జుట్టు ఎక్కువగా రాలిపోవడాన్ని అరికడుతుంది.

గుర్తుంచుకోండి..◆ ఈ ప్యాక్‌ను పొడిగా ఉన్న జుట్టు పైనే అప్లై చేసుకోవాలి. ◆ వారానికోసారి ఈ ప్యాక్ ట్రై చేయచ్చు. ◆ వేసుకోవడానికి కనీసం రెండు గంటల ముందే ఈ ప్యాక్ తయారు చేసి పెట్టుకోవాలి. చూశారుగా.. పెరుగు జుట్టు సమస్యలను ఎలా పోగొడుతుందో.. కాబట్టి ఇలాంటి సహజసిద్ధమైన, సులభంగా తయారు చేసుకునే హెయిర్ ప్యాక్స్ ప్రయత్నించి ఎలాంటిదుష్ప్రభావాల బారిన పడకుండా మీకురులను కాపాడుకోండి. అయితే ఈ క్రమంలో తలస్నానానికి ఉపయోగించే షాంపై గాఢత తక్కువగా ఉండేలా జాగ్రత్తపడండి. □

# బోళా శంకరుడు

శివాయ విష్ణు రూప.ఆయ శివరూపాయ
విష్ణవే శివళ్య హృదయం
విష్ణో విష్ణో శ్చం హృదయం శివః

రూపాలు వేరైనా శివకేశవులు ఒక్కరే అనుకుంటే అలంకరా ప్రియహో విష్ణు! అభిషేక ప్రియ! శివహః అన్నట్లుగా పాలకడలిలో శేషతల్పంపై లక్ష్మీ సమేతుడై పవళించే శ్రీమహా విష్ణువు పర్వాలంకరణ భూషితడదై కన్నులపండుగగా ధర్శనం ఇస్తే సదాశివుడు మాత్రం కైలాసంలో మంచు కొండల మధ్య జటా జూటధారిగా మెడలో సర్ప పరంతో గరళకంఘడిగా పులితోలు ఆసనంగా శూల పాణిగా నిరాడంబరంగా భక్త జనపాలుడై లయకారుడై వరాలిచ్చేవాడే, శంకరుడుగా పూజలందుకుంటాడు. కానీ ముక్కంటి అయిన ఈశ్వరుడు ఆగ్రహం కలిగితే మూడో కన్ను విప్పి ప్రపంచాన్నే దహించగల రుద్రుడు. దయాహృదయం కలిగి. భక్త సులభుడిగా అభయం ఇచ్చి కాపాడే కరునామయుడు. అందుకే మన పురానాల ప్రకారం దానవులు శివతత్వం తెలిసిన వారై, ఆయనను ఆశ్రయించి జపాలు చేసి, తాము కోరిన వరాలు పొంది, ఆ తరువాత శివ సాయుధ్యం పొందారు. యుగయుగాలు తపమాచరించినా శ్రీ మహా విష్ణువు ప్రత్యక్షం కావడం కష్టం అయితే బోళాశంకరుడు మాత్రం తన చెంతకు చేరే వారిని త్వరిత గతిని తన దర్శన భాగ్యం కలుగజేసి తరింపచేసే, శివుడు లేని ప్రదేశం ఉండదు అనేలా ఆయన అన్ని వేళలా అభిషేక ప్రియుడుగా ఆరాధనలు అందుకుంటాడు. సాధు స్వభావులను, రాక్షసులను కూడా శివుడు సమానంగా కటాక్షిస్తూ ఉన్న ఫలితంగా హిరణ్య కశిపుడు భస్మాసురుడు మొదలుగా అసురులెందరో వారు కోరిన వరాలను గ్రహించారు ముక్తిపొందారు. ద్వాదశ జ్యోతిర్లింగాలుగా, సౌ రాష్ట్ర సోమనాథుడు శ్రీశైల మల్లికార్జునుడు ఉజ్జయిని మహాకాళుడు. ఓంకారుడుగా అమరేశ్వరం వైద్యనాథుడిగా, భీమశంకరుడై రామేశ్వరుడై దారుకావన నాగేశ్వరుడుగా వారనాశి విశ్వేశ్వరుడు గౌతమీతట త్రయంబకేశ్వరుడు. కేదార హిమవత్ వృష్ఠి, విష్ణేశ్వరుడుగా, శివ క్షేత్రాలు పవిత్ర కార్తీకంలో పలు భక్తులు శివాభిషేకాలు, పూజలు గావించి పునీతులై ఆయా ఆలయాల దర్శనంతో పారవశ్యం పొందుతారు. పంచారామాలైన, ద్రాక్షా రామం, అమరారామం, క్షీరారామం, సోమారామం, భీమారామం, శివనిలయాలైన ఆ రామాలు, నందివాహనుడు శివుడి ఎందుటనే ఎప్పుడూ, కనపడే స్వామి నందిమదనకాంకారి అయిన పరమేశ్వరుడు పార్వతీ సమేతంగా నాట్య ప్రియుడై, ప్రమథ గణాలతో తాండివించేన నటరాజు. బాలుడైన ధృవుడికి దీర్ఘాయుషు ప్రసాదించి, నక్షత్రంగా నిలిపిన హరుడి మహత్యాలు వర్ణింప సాధ్యంకావు 'ఓం నమశ్శివాయ' పంచాక్షరీ మంత్రం జపిస్తే చాలు పత్రం, పుష్పం ఫలంతోయం అన్నట్లుగా కేవలం నీటితో అనుగ్రహించే గంగాధరుడు కార్తీక మాసం శివలయాలు శక్తి సందోహంతో కళకళలాడుతూ పుణ్యం ప్రసాదించేపవిత్ర స్థలాలు దర్శనీయ క్షేత్రాలు.

- యం.వి రమణకుమారి.

ఆధ్యాత్మికం

# ఎగ్‌ప్లాంట్ పిజ్జా



**తయారీకి కావలసిన పదార్థాలు :**

ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, టమాట: ఒకటి, పిజ్జా సాస్: అర కప్పు, తురిమిన చీజ్: అర కప్పు, పార్సిమెన్: పావు కప్పు, ఆలివ్స్: పావు కప్పు, ఆలివ్ ఆయిల్: అర కప్పు, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం:** ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం. □

## చెలి చిట్కా

సున్నము లేదా బెల్లముగాని కోడిగుడ్ల సోనను అందులో కలిపి చాతీపై పట్టువేయవలెను. ఊపిరిగొట్టు నొప్పి తగ్గును. □

# దక్షిణాఫ్రికా సిరీస్‌కు టీమిండియాలో నంబర్ 4?



సంజు సామ్సన్



రియాన్ పరాగ్



తిలక్ వర్మ

## శ్రేయస్ ప్లేస్‌కై ముగ్గురు పోటీ

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా టీం ఇండియా బ్యాట్స్‌మన్ శ్రేయాస్ అయ్యర్ గాయపడ్డాడు. ఆయన కోలుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. దీంతో దక్షిణాఫ్రికా సిరీస్‌కు అతని స్థానంలో ఎవరు వస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పలువురు ప్లేయర్లు ఈప్లేస్‌కోసం పోటీ పడుతున్నారు. దక్షిణాఫ్రికాతో భారత్ తదుపరి వన్డే సిరీస్ నవంబర్ 30న స్వదేశంలో ప్రారంభమవుతుంది. అయ్యర్ స్థానంలో ఎవరు వస్తారనే దానిపై సెలక్షన్ కమిటీ ఇప్పటికే కసరత్తు చేస్తోంది. ఈ ప్లేస్‌కు ప్రధానంగా ముగ్గురు పోటీ పడుతున్నారు. వీరిలో సంజు సామ్సన్ ఉన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో సంజు ఆఫార్మాట్‌లో పైవరుసలో బ్యాటింగ్ చేస్తాడని ప్రకటించడంతో అతనికి ఆ సిరీస్‌లో అవకాశం రాలేదు. ఇప్పుడు నంబర్ 4 ప్లేస్ ఖాళీగాఉంది కాబట్టి, సంజుకు అవకాశం ఇవ్వాలి. ముఖ్యంగా గత వన్డే సిరీస్‌లో అతను ప్రదర్శించిన ఫామ్‌ను పరిశీలిస్తే, ఇప్పటివరకు 16 వన్డేలు ఆడి 56.66 సగటుతో 510 పరుగులు చేశాడు. అతని పేరులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలుకూడా ఉన్నాయి. అయ్యర్ ప్లేస్‌లో సుల భంగా నాలుగో స్థానంలోకి వచ్చి ఎక్కువ పరుగులు చేయగలడు. మరొకరు తిలక్ వర్మ. గత నెలలో ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో తిలక్ వర్మ ఓవర్‌నైట్ స్టార్ అయ్యాడు. 2023లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డేలో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 4 మ్యాచ్‌ల్లో కేవలం 68 పరుగులు మాత్రమే చేశాడు. కానీ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో తిలక్ 4వ స్థానంలో బ్యాటింగ్‌ను బలోపేతం చేయగలడు. ఇక రియాన్ పరాగ్ గత ఏడాది శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. అయితే, గాయం కారణంగా అతను జట్టుకు దూరంగా ఉన్నాడు. కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడి తొమ్మిది ఓవర్లలో 15 పరుగులు చేసి 3 వికెట్లు తీసుకున్నాడు. అతను భారత్ తరపున తొమ్మిది టి20లు కూడా ఆడగా, ఆరు ఇన్నింగ్స్‌లలో 106 పరుగులు చేసి 4 వికెట్లు తీసుకున్నాడు. పరాగ్ నాల్గవ స్థానంలో బ్యాటింగ్ చేయగలగడంతో పాటు, అదనపు బౌలింగ్ కాకుండా జట్టుకు సమతుల్యతను అందిస్తాడు.



## పారా క్లైంబింగ్ ప్రపంచ కప్‌లో.. మణికందన్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** పారా క్లైంబింగ్ ప్రపంచ కప్-2025లో మణికందన్ కుమార్ స్వర్ణం సాధించాడు. ఫ్రాన్స్‌లోని లావల్‌లో జరిగిన పురుషుల ఆర్పీ2 విభాగంలో ఈ భారత ఆటగాడు అత్యున్నత స్థానాన్ని సంపాదించాడు. అక్టోబర్ 24-26 వరకు ఫ్రాన్స్‌లోని లావల్‌లో జరిగిన ఐఎఫ్ఎస్‌సి పారా క్లైంబింగ్ వరల్డ్ కప్ చివరి రోజున భారతదేశానికి చెందిన మణికందన్ కుమార్ 2025 సీజన్‌లో తన తొలి ప్రపంచ కప్ స్వర్ణాన్ని సాధించాడు. పురుషుల ఆర్పీ2 పోటీ పడుతున్న మణికందన్ అసాధారణ ప్రదర్శనతో జర్మనీకి చెందిన ఫిలిప్ హ్రోజెక్‌ను 44+ నుండి 44 తేడాతో ఓడించాడు. ఆస్ట్రియాకు చెందిన డేనియల్ వీనర్ 40 కాంస్య పతకాలతో రెండో స్థానంలో నిలిచాడు. కాగా మణికందన్ ఈ ఈవెంట్‌లో పలుసార్లు పతకం గెలుచుకున్నాడు. వాటిలో ఇటలీలోని ఆర్కోలో జరిగిన 2024 ఎడిషన్‌లో స్వర్ణం కూడా ఉంది. ఈ ఈవెంట్ యొక్క చివరి పతకాల పట్టికలో రికార్డు స్థాయిలో 18 దేశాలు చోటు దక్కించుకున్నాయి. ఫ్రాన్స్ ఐదు స్వర్ణాలు, రెండు కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచింది, జర్మనీ ఎనిమిది పతకాలతో అత్యధికంగా ఒక స్వర్ణం, ఐదు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది.

## ఆసియా యూత్ గేమ్స్.. రికార్డు బద్దలు కొట్టిన ధీనిధి



**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్ 2025లో భారత స్విమ్మర్ ధీనిధి దేశింగు 400 మీటర్ల ఫ్రీస్టైల్ రికార్డును బద్దలు కొట్టింది. ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచి తన రికార్డును మూడు సెకన్ల తేడాతో మెరుగుపరుచుకుంది. బహ్రెయిన్‌లో జరిగిన ఆసియా యూత్ గేమ్స్‌లో ధినిధి కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. ధీనిధి 4:21.86 సెకన్లలో పూర్తి చేసి ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచింది. ఆమె 4:24.60 సెకన్ల రికార్డును మెరుగుపరుచుకుంది. ఇదే ఈవెంట్‌లో, దేశానికే చెందిన అదితి సతీష్ హెగ్డే 4:32.00 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచింది. భారత బాలికల 4+100 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే 4:05.73 సెకన్ల సమయంతో ఫైనల్‌లో చివరి స్థానంలో నిలిచింది. ఇక బాలురలో నితీశ్‌సాయి హరినాథ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో 23.72 సెకన్లతో ఐదవ స్థానంలో నిలిచాడు. 400 మీటర్ల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో ఈత కొట్టిన ధక్షన్ శశికుమార్ 4:00.87 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచాడు. 100 మీటర్ల బటర్‌ఫ్లైలో, వేదాంత్ టాండలే 56.31 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచాడు.

### ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్.. నవంబర్ 14 నుంచి

## గ్రేటర్ నోయిడాలో పోరు

**హైదరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ 2025కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. నవంబర్ 14 నుంచి 21 వరకు గ్రేటర్ నోయిడాలోని షహీద్ విజయ్ సింగ్ పథిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. మొత్తం 18 దేశాల నుంచి 140 మందికి పైగా అగ్రశ్రేణి బాక్సర్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. వీరిలో ముగ్గురు ఒలింపిక్ పతక విజేతలు కూడా ఉండటం విశేషం. ఈ టోర్నమెంట్‌లో 20 మంది (10 మంది పురుషులు, 10 మంది మహిళలు)తో కూడిన బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. ఈ జట్టుకు మాజీ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ (51 కిలోలు), ప్రస్తుత ప్రపంచ చాంపియన్లు జాస్మిన్ లంబోరియా (57 కిలోలు), మీనాక్షి (48 కిలోలు), రెండుసార్లు ఆసియా చాంపియన్ పూజా రాణి (80 కిలోలు) వంటి స్టార్ మహిళా బాక్సర్లు నాయకత్వం వహిస్తున్నారు.

పురుషుల విభాగంలో ఈ సీజన్ ప్రపంచ కప్ టోర్నీల్లో పతకాలు సాధించిన హితేష్ (70 కిలోలు), అభినాష్ జమ్వాల్ (65 కిలోలు) వంటి బాక్సర్లు ఉన్నారు. జాదుమణి సింగ్ (50 కిలోలు), పవన్ బర్త్వాల్ (55 కిలోలు), సచిన్ (60 కిలోలు), సుమిత్ (75 కిలోలు), లక్ష్య చాహార్ (80 కిలోలు), జుగ్నూ (85కిలోలు), నవీన్ కుమార్ (90కిలోలు), నరేందర్ (90+ కిలోలు) వంటి ఇతర భారత బాక్సర్లు కూడా తమ సత్తా చాటడానికి సిద్ధంగా ఉన్నారు. మహిళల్లో ప్రీతి (54కిలోలు), పర్వీన్ (60కిలోలు), నీరజ్ ఫోగట్ (65కిలోలు), అరుంధతి చౌధరి (70కిలోలు) పోటీ పడుతున్నారు.

ఈ ఫైనల్స్‌లో మూడు పారిస్ ఒలింపిక్ పతక విజేతలైన దక్షిణ కొరియాకు చెందిన ఏజి ఇమ్, చైనీస్ తైపీకి బాక్సర్లు వూ షిహ్‌యీ, చెన్ నీన్‌చిన్ బరిలో నిలిచారు. వీరితో పాటు వివిధ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణాలు సాధించిన పలువురు కూడా బరిలో నిలవడంతో పోటీ స్థాయి మరింత పెరగనుంది. ప్రపంచంలోని అత్యుత్తమ బాక్సర్లు స్వదేశంలో పోటీ పడటం మన దేశ బాక్సర్లకు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశమని బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ పేర్కొన్నారు.

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం భారత బాక్సింగ్‌కు గర్వకారణం. ప్రపంచ స్థాయిలో మేము ఎంత ఎదిగామో ఇది ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలను, ఒలింపిక్ పతకవిజేతలను ఇక్కడ పోటీకి తీసుకురావడం కేవలం గౌరవం మాత్రమే కాదు, బాక్సింగ్ పవర్‌హౌస్‌గా భారత్ పెరుగుతున్న స్థాయికి నిదర్శనం అని అన్నారు. ఈ వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ సీజన్ మొత్తంలో జరిగిన గ్లోబల్ సిరీస్‌కు ముగింపు పలకనుంది. సీజన్‌లో అత్యధిక ర్యాంకు సాధించిన అథ్లెట్లు పది వెయిట్ కేటగిరీల్లో ట్రోఫీ కోసం పోటీపడతారు.

## వరల్డ్ టేబుల్ టెన్నిస్-2025 ఫైనల్స్‌కు మనుష్-దియా అర్హత

### తొలి భారతీయ జంటగా రికార్డు



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్-2025 ఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి భారతీయ జంటగా మనుష్ షా-దియా చిటాలే నిలిచారు. ఇది భారత టేబుల్ టెన్నిస్‌కు చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. మంగళవారం తాజా వరల్డ్ టేబుల్ టెన్నిస్ సిరీస్ ఫైనల్స్ రేస్ ర్యాంకింగ్స్ ప్రకారం, మనుష్-దియా జంట డిసెంబర్ 10 నుండి 14 వరకు చైనాలోని హాంకాంగ్‌లో జరిగే సంవత్సరాంతపు ఈవెంట్‌లో స్థానం నిర్ధారించిన ఐదవ మిక్స్‌డ్ డబుల్స్ జట్టుగా నిలిచింది. అలాగే స్టార్ కంటెండర్ మస్కట్ (నవంబర్ 17-22) ముగింపులో డబ్ల్యూటిటి సిరీస్ ఫైనల్స్ రేస్ ర్యాంకింగ్‌లు డబ్ల్యూటిటి ఫైనల్స్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించే ఏడు జతలను నిర్ణయిస్తాయి. ఎనిమిదవ స్థానాన్ని హోస్ట్ వైల్డ్‌కార్డ్ జత తీసుకుంటుంది. ఈ సీజన్‌లో, షా మరియు చిటాలే ట్యూనిస్‌లో డబ్ల్యూటిటి కాంటెండర్ టైటిల్‌ను గెలుచుకున్నారు. అలాగే బ్రెజిల్‌లోని ఫోజ్ డో ఇగువాకులో జరిగిన డబ్ల్యూటిటి స్టార్ కాంటెండర్ ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచారు. తాజా ఐటిటిఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఈ భారత జంట ఎనిమిదో స్థానంలో ఉంది. డబ్ల్యూటిటి ఫైనల్స్ మొదటిసారి 2021లో జరిగాయి. మొదటి నాలుగు ఎడిషన్ల మాదిరిగానే, ఈ సంవత్సరం ఈవెంట్‌లో కూడా సింగిల్స్ విభాగాలలో టాప్ 16 మంది పురుషులు, మహిళలు పోటీపడతారు. అయితే, 2023, 2024 ఎడిషన్లలో భాగమైన పురుషులు, మహిళల డబుల్స్ విభాగాలను హాంకాంగ్‌లో మిక్స్‌డ్ డబుల్స్ ద్వారా భర్తీ చేయనున్నారు.



## దిగివస్తున్న పసిడి ధరలు

**ముంబయి, అక్టోబరు 28:** బంగారం ధరలు ప్రస్తుతం దిగుతున్నాయి. ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పుత్తడి తిరోగమనబాట పట్టింది. నిన్న ఒక్కరోజే తులంపై రూ. 2,340 తగ్గిన ధర మంగళవారం కూడా స్వల్పంగా దిగొచ్చింది. ట్రేడింగ్‌లో తులంపై రూ.820 తగ్గింది. దీంతో ఇవాళ ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460కి తగ్గింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.720 తగ్గి రూ.1,12,250కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,23,420గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,13,140గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. ఒక్కరోజే కేజీపై రూ.5వేలు తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1.48 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో వెండి స్పాట్‌ధర ఔన్స్ ఒక్కొంటికి 46.59 డాలర్లుగా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా ఇవే రేట్లు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో పుత్తడికి డిమాండ్ పడిపోవడంతోపాటు అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన బంగారం నుంచి ఈక్విటీ మార్కెట్లలోకి తగ్గించడంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయని నిపుణులు చెబుతున్నారు. కాగా, పది రోజుల క్రితం తులం బంగారం ఎన్నడూ లేని విధంగా రూ.1.35 లక్షలు దాటిన విషయం తెలిసిందే. దీంతో వినియోగదారులు పుత్తడి కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు బంగారం ధరలు తగ్గుతుండటంతో కొనుగోలుదారుల్లో ఉత్సాహం నెలకొంది. అటు రేట్లు తగ్గడంపై పెట్టుబడిదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

# రష్యా చమురుకొనుగోళ్లు నిలిపివేసిన భారత్ కంపెనీలు




**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** రష్యా చమురుకొనుగోళ్ల నిలిపివేయాలంటే భారత్‌పై అమెరికా తెస్తున్న ఒత్తిళ్లు ఆచరణలోకి వస్తున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం మానేశాయి. తాత్కాలికంగా చమురు కొనుగోలును నిలిపివేశాయి. ఆంక్షలపై మరింత స్పష్టత కోసం వేచిచూసే వైఖరిలో ఉన్నాయి.

స్పాట్ మార్కెట్ల నుంచి కొనుగోళ్లతో ఆ లోటును భర్తీ చేసుకుంటున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించారు. రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపేయాలని భారత్, చైనాపై ఒత్తిడి కొనసాగిస్తున్నారు. రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అగ్రరాజ్యం నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా పెనాల్టీ ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. 2025లో ఇప్పటివరకు సగటున రోజుకు 1.7 మిలియన్ బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. ఇందులో 1.2 మిలియన్ బ్యారెల్స్ చమురు ఆ రెండు సంస్థల నుంచే వచ్చింది. ఇందులో ఎక్కువ శాతం రిలయన్స్, నయారా వంటి ప్రైవేటు సంస్థలే కొనుగోలు చేశాయి. అమెరికా, ఐరోపా దేశాల నుంచి ఆంక్షలు పెరిగిన కారణంగా ముడిచమురు కొనుగోలు కోసం భారత కంపెనీలు పశ్చిమాసియా వైపు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇప్పటికే స్పందించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతులపై ఈయూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపింది. అమెరికా, బ్రిటన్,ఐరోపా దేశాలు ప్రకటించిన ఆంక్షల ప్రభావాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఆంక్షల అమలు, నియంత్రణ చట్టాలకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. అమెరికాకు సహకరిస్తామన్న సంకేతాలను అందించేందుకే భారత రిఫైనరీలు ఆ దేశ కంపెనీల నుంచి చమురు కొనుగోలును పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా 2022 తర్వాత ఈ అక్టోబరులో అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు గరిష్ఠ స్థాయికి చేరాయి. ప్రస్తుతం అమెరికా నుంచి వచ్చే చమురు దిగుమతులు రోజుకు 5.4 లక్షల బ్యారెళ్లకు చేరాయని తెలుస్తోంది. ప్రస్తుతం రష్యా నుంచే ఎక్కువగా ముడిచమురు దిగుమతి అవుతుండగా ఇరాక్, సౌదీ అరేబియా రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి.

## అమెజాన్‌లో 30 వేలమందిపై లేఆఫ్ వేటు



**న్యూయార్కు, అక్టోబరు 28:** ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీ లేఆఫ్స్‌కు సిద్ధమైంది. ఖర్చులను తగ్గించుకునే చర్యల్లో భాగంగా, మంగళవారం నుంచి ఏకంగా 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో పెరిగిన డిమాండ్ కారణంగా అధికంగా నియమించుకున్న సిబ్బందిని తగ్గించుకోవడమే లక్ష్యంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం 15.5 లక్షల మంది అమెజాన్ ఉద్యోగులతో పోలిస్తే ఈ సంఖ్య స్వల్పమే అయినప్పటికీ, కంపెనీలోని 3.5 లక్షల కార్పొరేట్ సిబ్బందిలో ఇది దాదాపు 10 శాతానికి సమానం. 2022 చివర్లో 27,000 మంది ఉద్యోగులను తొలగించిన తర్వాత, ఇదే అతిపెద్ద లేఆఫ్ కావడం గమనార్హం. అయితే, ఈ వార్తలపై స్పందించేందుకు అమెజాన్ ప్రతినిధి నిరాకరించారు. ఈ ఉద్యోగాల కోత ప్రభావం హ్యూమన్ రిసోర్సెస్ (పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ), ఆపరేషన్స్, డివైజెస్, సర్వీసెస్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) వంటి పలు కీలక విభాగాలపై ఉండే అవకాశం ఉంది. ప్రభావిత ఉద్యోగులకు మంగళవారం ఉదయం నుంచి ఈమెయిల్స్ ద్వారా సమాచారం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో సిబ్బందితో ఎలా వ్యవహరించాలనే అంశంపై సోమవారం మేనేజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు సమాచారం. కంపెనీలో అనవసరమైన ప్రక్రియలను తగ్గించేందుకు సీఈఓ ఆండీ జెస్సీ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. దీనికి తోడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం పెరగడం వల్ల పునరావృతమయ్యే పనులను ఆటోమేట్ చేస్తూ సిబ్బందిని తగ్గిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

మరోవైపు, ఈ ఏడాది ప్రారంభంలో అమలు చేసిన వారానికి ఐదు రోజులు ఆఫీసుకు రావాలి అనే నిబంధన వల్ల చాలామంది ఉద్యోగులు స్వచ్ఛందంగా వైదొలుగుతారని కంపెనీ ఆశించినా, అది జరగకపోవడం కూడా ఈ భారీ లేఆఫ్స్‌కు ఓ కారణంగా తెలుస్తోంది. ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ, రానున్న పండగల సీజన్ కోసం గిడ్డంగులు, ఇతర అవసరాల నిమిత్తం 2.5 లక్షల మంది తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవాలని అమెజాన్ యోచిస్తోంది. కాగా, కంపెనీకి అత్యంత లాభదాయకమైన ఏడబ్ల్యూఎస్ విభాగం వృద్ధిరేటు, పోటీ సంస్థలైన మైక్రోసాఫ్ట్ అజూర్, గూగుల్ క్లౌడ్ కంటే వెనుకబడింది. అమెజాన్ తన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను గురువారం ప్రకటించనున్నది.

## ఎలాన్ మస్క్ గ్రోకీ పీడియా రెడీ




**న్యూయార్కు, అక్టోబరు 28:** అమెరికా బిలియనీర్, టెస్లాబాస్ ఎలాన్ మస్క్ మరో సంచలనానికి తెర తీశారు. ముందుగా ప్రకటించినట్లుగానే 'వికీపీడియా'కి పోటీగా గ్రోకిపీడియా పేరుతో కొత్త ఎన్‌సైక్లోపీడియాను పరిచయం చేశారు. ఏఐ (కృత్రిమ మేధ) సాంకేతికతతో పనిచేసే దీని బీటా వెర్షన్‌ను నేడు అందుబాటులోకి తెచ్చారు. ఈ విషయాన్ని మస్క్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. వికీపీడియా కంటే పది రెట్లు ఎంతో బెటర్ అంటూ వెల్లడించారు. వికీపీడియా తరహాలో అంతకంటే మెరుగైన గ్రోకిపీడి యాను డెవలప్ చేస్తున్నట్లు మస్క్ ప్రకటించిన విషయం తెలిసిందే. వికీపీడియా కంటే భారీగా ఉంటుందన్నారు. విశ్వాన్ని అర్థం చేసుకునే లక్ష్యంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వికీపీడియా కన్నా చాలా విశ్వసనీయమైన, పారదర్శకమైన, భిన్నమైన, కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో గ్రోకిపీడియాను తయారు చేస్తున్నట్లు మస్క్ తెలిపారు. ఇవాళ దాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇదిప్రారంభమైన కాసేపటికే భారీట్రాఫిక్ కారణంగా క్రాష్ అయ్యింది. దీంతో కాసేపటికి సేవల్ని పునరుద్ధరించారు. ఇది వికీపీడియా కంటే కొత్తగా ఏమీలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## వైమానికరంగంలో మేకిన్ ఇండియా

### హిందూస్థాన్ ఏరోనాటిక్స్‌తో రష్యా సంస్థ ఒప్పందం

### భారత్‌లోనే పూర్తిస్థాయి ప్యాసింజర్ విమానాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** విమానాల విడిభాగాలు, హెలికాప్టర్ల తయారీలో మేకిన్ ఇండియా కార్యాచరణను భారత్‌మరింత ముందుకు తీసుకువెళుతోంది. తాజాగా ఎస్‌జె 100 విమానాలు తయారీకి రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ సంసిద్ధత వ్యక్తంచేసింది. హిందూస్థాన్ ఏరోనాటిక్స్‌తో యుఎసి ఒప్పందంచేసుకుంది. భారత్‌లోపూర్తి స్థాయిలో ప్రయాణీకుల విమానం తయారీ ఇదే తొలిసారి. గతంలో ఎవిఆర్ఒ హెచ్ఎస్748 విమానాలను 1961లో తయారుచేయగా 1988లో ఆప్రాజెక్టు నిలిచిపోయింది. రానున్న పదేళ్లలో స్థానిక కనెక్టివిటీకోసం ఎస్‌జె100 వంటి చిన్న పరిమాణం కలిగిన 200 విమానాలు అవసరం. పౌరవిమానయాన రంగంలో భారత్ ఆత్మనిర్భరత సాధించేందుకుఈ ఒప్పందం కీలకమని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ ప్రకటించింది. ఉడాన్ కింద స్వల్ప దూర ప్రయాణాలకు గేమ్‌ఛేంజర్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది. ఎస్‌జే 100 రెండు ఇంజన్లతో కూడిన చిన్నపరిమాణం కలిగిన విమానం. 103 మంది సామర్థ్యం ఉంది. స్వల్పదూరం ప్యాసింజర్‌సేవలకు అనువుగా ఉంటుంది. నిర్వహణ ఖర్చుకూడా తక్కువే. ఇప్పటికే రష్యా సంస్థ 200 విమానాలు తయారుచేస్తే ప్రపంచ వ్యాప్తంగా 16 ఎయిర్‌లైన్ సంస్థలు వీటిని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.




## నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, అక్టోబరు 28:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలునష్టాల్లోముగిసాయి. రియాలిటీ, ఐటి, ఆర్థికరంగసేవలు, వినియోగరంగ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగి సూచీలు దిగువకు దిగజారాయి. గరిష్ట స్థాయిలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగారు. దీనితో సూచీలపై ఒత్తిడిపెరిగి నష్టాల్లోనే ముగిసాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌సూచీలు కూడా ఫ్లాట్‌గా ముగి సాయి. సెన్సెక్స్ ముందు లాభాల్లోనే ప్రారంభం అయినా ఆద్యంతం ఒడిదొడుకులతో చివరకు150.68పాయింట్ల నష్టంతో 84,628.16 వద్దముగిసింది. నిఫ్టీ కూడా 29.85 పాయింట్ల నష్టంతో 25,936.20వద్ద స్థిరప డింది. ఇక డాలరులతో రూపాయి మారకం విలువలు 88.27గా ఉన్నాయి.

సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్,ఐసిఐసిఐబ్యాంకు, టెక్ మహీంద్ర, బజాజ్ ఫిన్‌సెర్వ్, మహీంద్ర అండ్ మహీంద్రషేర్లు నష్ట పోయాయి. టాటా స్టీల్, ఎల్అండ్‌టి ఎస్‌బిఐ, కోటక్ మహీంద్ర బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్‌షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌ధర 64 డాలర్లవద్ద కొనసా గుతుంటే బంగారం ఔన్స్ ఒక్కొంటికి 3906 డాలర్లవద్దట్రేడింగ్ జరిగింది. మొత్తంగాచూస్తే మార్కెట్లు ప్రతికూలంగానే ముగిసాయి. బిఎస్ఇలో 1910 కంపెనీలు షేర్లు పెరిగిఏ 2246 షేర్లు దిగజారాయి. 180 షేర్లు స్థిరంగా కొనసాగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.